# ఏకాదశీ వ్రత మహిమ

## (పద్మ పురాణం ప్రకారం)


రచన

**భక్తికా దేవిదాసి**



**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2018**

**EKADASI VRATA MAHIMA**

*by*

**Bhaktika Devi Dasi**

T.T.D. Religious Publications Series No. 1343
© All Rights Reserved

*First Print :* 2018

*Copies :* 500

*Published by :*

**SRI ANIL KUMAR SINGHAL**, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*D.T.P.*

Publications Division
T.T.D., Tirupati.

*Printed at*

Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

# ముందుమాట

**శ్లో॥ న భోక్తవ్యం న భోక్తవ్యం సంప్రాప్తే హరివాసరే ।**
**పురాణ మన్యధా కృత్వా తిర్యగ్యోని మవాప్నుయాత్ ॥** (నారదీయ పురాణం)

ఏకాదశినాడు ఎట్టిపరిస్థితుల్లోను భోజనం చేయకూడదు. ఈ పురాణ వాక్యాన్ని నిరాకరించినవారు పక్షిజాతిలో జన్మిస్తారు. ఏకాదశి చింతామణి. ఏకాదశి కామధేనువు. ఏకాదశి కల్పవృక్షం. ఏకాదశి మోక్షప్రదం. ఏకాదశి వేదమార్గం. ఏకాదశి ఏకాదశియే! దానికి సాటి మరొకటి లేదు. భైరవుని శ్రీరంగమాహాత్మ్యంలో ఏకాదశీ సంకల్ప శ్లోకం–

**శ్లో॥ ఏకాదశ్యా మహం కించి దనశ్నన్ పురుషోత్తమ ।**
**భోక్ష్యే హానిపరే శ్రీమన్, పాహి మాం శరణాగతమ్ ॥ (5-108)**

ఓ పురుషోత్తమా! ఏకాదశిరోజు నేనేమీ తినలేదు. భోజనం చేస్తే కీడు కల్గుతుందని ఉపవాసం చేస్తున్నాను. 'పాహిమాం' అంటూ శరణాగతుడ నౌతున్నాను.

హరివాసర వ్రతఫలాన్ని మరొకరికి దానం చేయడానికి ఎవరికీ శక్తిలేదు. ఎందుకంటే, అది మోక్షప్రదం, పుణ్యం, జన్మమృత్యువుల్ని పటాపంచలు చేసేది. జపాలలో గాయత్రి, ఉపవాసాలలో హరిప్రియోచిత దినం. అర్చనల్లో తులసి పరమ పవిత్రమైనవి. అంబరీషోపాఖ్యానం, రుక్మాంగదుని కథ, ఏకాదశీ వ్రత మహిమను చాటి చెప్పేవి.

**ఏకాదశికే హరివాసరం, హరిప్రియోచిత దినం, హరిదినం, హరితిథి మాధవతిథి, విష్ణువాసరం అనే పేర్లున్నాయి.** ఈ తిథి విష్ణు ప్రీతికరం కావటమే దీనికి ప్రధాన కారణం. ఆషాఢమాసంలోని తొలి ఏకాదశి అనబడే శుద్ధ ఏకాదశి, శయనైకాదశి అని, కార్తీక శుద్ధ ఏకాదశిని ఉత్థాన ఏకాదశి అని, మాఘ, కైశిక పురాణాలలో చెప్పబడింది. ఈ ఏకాదశులు మొత్తం 26 దాకా ఉన్నాయని పురాణాలు వాటికి అనేక విధాలైన కథలు చెబుతున్నాయి. ఆయా కథలన్నీ ప్రస్తుత రచయిత్రి 'భక్తికా దేవిదాసి', 'ఏకాదశీవ్రత మహిమ'లో వివరించారు.

మార్గశిరశుద్ధ ఏకాదశికి 'ముక్కోటి ఏకాదశి' అనిపేరు. దీనికే 'వైకుంఠ ఏకాదశి' అనడం లోకప్రసిద్ధి. ఆ రోజు తిరుమలలోనే కాదు, భారతదేశంలోని అన్ని విష్ణుదేవాలయాలలో వైకుంఠద్వారాలగుండా దర్శనానికి భక్తుల్ని అనుమతిస్తారు. అంటే, భక్తులు వైకుంఠద్వారం గుండా పోయి వైకుంఠంలోని విష్ణుమూర్తిని దర్శనం చేసుకొన్నట్లు భావిస్తారు.

శ్రీకృష్ణదేవరాయలవారు శ్రీకాకుళానికి వెళ్లి ఆంధ్రమహావిష్ణువును సేవించడానికి పోయినప్పుడు **'హరివాసరోపవాసరం'** అక్కడ అనుష్ఠించినట్లు ఆ రోజు రాత్రి నాల్గవజాములో ఆయనకు స్వప్నం రాగా, ఆ స్వప్నంలో ఆంధ్రమహావిష్ణువు **'ఆముక్తమాల్యద'** ప్రబంధాన్ని వ్రాయమని ఆదేశించినట్లు అవతారికలో రాయలు వ్రాసుకొన్నాడు

పదునైదు తిథుల్లో పాడ్యమి మొదలుకొని పది రోజులు ఉపవాసం చేయడం కష్టం కాబట్టి, పదకొండవ రోజు అంటే ఏకాదశి రోజు ఎవరు నిరాహారియై భగవచ్చింతనతో రాత్రి జాగరణ చేస్తారో వారు భగవంతుని అనుగ్రహానికి పాత్రులౌతారు. ఇట్లా ఉపవాసం చేసి ద్వాదశిరోజు, ప్రాతః కాలంలో బ్రాహ్మణుల సంతర్పణ ఏర్పాటుచేసి, తాను పారణ చేసేవానికి అనేక అశ్వమేధాల ఫలం లభిస్తుందని పురాణాలు ఘోషిస్తున్నాయి.

ఇలా ఈ గ్రంథంలో 26 ఏకాదశుల వ్రత మహిమ విపులంగా వర్ణించబడింది. ఈ సందర్భంలో రచయిత్రిని అభినందిస్తూ, భక్తులు ఈ గ్రంథాన్ని మార్గదర్శకం (guide book) గా గ్రహించి సత్ఫలితాలు పొందుతారని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ఏకాదశీ వ్రతం | 1 |
| | భక్త అంబరీషుని జీవిత చరిత్ర | 13 |
| | పురుషోత్తమ మాస మాహాత్మ్యం | 23 |
| 1. | ఉత్పన్న ఏకాదశి – మార్గశిరమాసం, కృష్ణపక్షం | 45 |
| 2. | మోక్షద ఏకాదశి – మార్గశిరమాసం, శుక్లపక్షం | 49 |
| 3. | సఫల ఏకాదశి – పుష్యమాసం, కృష్ణపక్షం | 52 |
| 4. | పుత్రద ఏకాదశి – పుష్యమాసం, శుక్లపక్షం | 55 |
| 5. | షట్తిల ఏకాదశి – మాఘమాసం, కృష్ణపక్షం | 57 |
| 6. | జయ ఏకాదశి – మాఘమాసం, శుక్లపక్షం | 60 |
| 7. | విజయ ఏకాదశి – ఫాల్గుణమాసం, కృష్ణపక్షం | 64 |
| 8. | ఆమలకీ ఏకాదశి – ఫాల్గుణమాసం, శుక్లపక్షం | 67 |
| 9. | పాపమోచనీ ఏకాదశి – చైత్రమాసం, కృష్ణపక్షం | 71 |
| 10. | కామదా ఏకాదశి – చైత్రమాసం, శుక్లపక్షం | 75 |
| 11. | వరూథినీ ఏకాదశి – వైశాఖమాసం, కృష్ణపక్షం | 78 |
| 12. | మోహినీ ఏకాదశి – వైశాఖమాసం, శుక్లపక్షం | 81 |

13. అపర ఏకాదశి – జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం 84

14. నిర్జల ఏకాదశి – జ్యేష్ఠమాసం, శుక్లపక్షం 86

15. యోగినీ ఏకాదశి – ఆషాఢమాసం, కృష్ణపక్షం 90

16. శయన ఏకాదశి – ఆషాఢమాసం, శుక్లపక్షం 93

17. కామిక ఏకాదశి – శ్రావణమాసం, కృష్ణపక్షం 98

18. పవిత్ర ఏకాదశి – శ్రావణమాసం, శుక్లపక్షం 100

19. అన్నద ఏకాదశి (అజ ఏకాదశి)–భాద్రపదమాసం, కృష్ణపక్షం 104

20. పార్శ్వ ఏకాదశి – భాద్రపదమాసం, శుక్లపక్షం 106

21. ఇందిర ఏకాదశి – ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం 109

22. పాశాంకుశ ఏకాదశి – ఆశ్వయుజమాసం, శుక్లపక్షం 112

23. రమా ఏకాదశి – కార్తికమాసం, కృష్ణపక్షం 114

24. ఉత్థాన ఏకాదశి – కార్తికమాసం, శుక్లపక్షం 118

25. పద్మినీ ఏకాదశి – అధికమాసం, కృష్ణపక్షం 121

26. పరమ ఏకాదశి – అధికమాసం, శుక్లపక్షం 126


# ఏకాదశీ వ్రతం

ఏకాదశి తిథి పరమ పవిత్రమైనదినంగా వర్ణించబడింది. ఏకాదశీ మహిమ శాస్త్రాల్లో, విస్తారంగా కీర్తించబడింది. "ఏకాదశి" వ్రతాన్ని ఆచరించడం పరమశ్రేష్ఠమైన కార్యం. దీన్ని ఆచరించిన వారికి పునర్జన్మ ఉండదనీ, శ్రీవైకుంఠలోకం ప్రాప్తిస్తుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. ప్రతి నెలలో శుక్లపక్షంలో ఒక ఏకాదశి, బహుళపక్షంలో మరొక ఏకాదశివంతున సంవత్సరంలో మొత్తం ఇరవైనాల్గు ఏకాదశులు కూడివస్తాయి. ఒకవేళ ఏ సంవత్సరంలో అయినా అధికమాసం వస్తే, మరొక రెండు ఏకాదశులతో వెరసి ఇరవై ఆరు ఏకాదశులుగా సంభవిస్తాయి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, స్త్రీలు ఎనిమిది (8) సం॥ లు దాటిన పిల్లలు అందరూ కూడ ఏకాదశి వ్రతాన్ని పాటించాలని, అది వారికి నిశ్చయంగా మోక్షప్రాప్తిని కలిగిస్తుందన్న ప్రస్తావనలు అనేకం కనపడతాయి. ఏకాదశి వ్రతము కేవలము భగవత్ప్రీత్యర్థమే చెప్పబడింది. 80 సం॥ దాటిన వయోవృద్ధులు గానీ, చిన్న పిల్లలు గానీ, అనారోగ్యంతో బాధపడేవారు గానీ ఈ వ్రతాన్ని ఆచరించలేకపోతే దోషం లేదు. మిగిలినవారు ఆచరించకపోతే దోషం తప్పదు.

బ్రహ్మాండ పురాణంలో కృష్ణుడు యుధిష్ఠిర మహారాజుతో ఇలా అంటాడు. "ఓ రాజా! సర్పాలలో శేషుడు, పక్షులలో గరుత్మంతుడు, యజ్ఞాలలో అశ్వమేధ యజ్ఞం, నదులలో గంగానది, దేవతలలో విష్ణువు, ఎలా శ్రేష్ఠులో అలాగే వ్రతాలలో ఏకాదశీ వ్రతం చాల శ్రేష్ఠమైనది.

**ఏకాదశీ వ్రతం నామ సర్వకామఫలప్రదమ్ ।**
**కర్తవ్యం సర్వదా విప్రై ర్విష్ణుప్రీణనకారణమ్ ॥**

"ఏకాదశివ్రతము సమస్త కోరికలను తీరుస్తుంది కనుక విష్ణుప్రీత్యర్థము ప్రతియొక్కరు కూడ ఈ వ్రతాన్ని పాటించాలి. అపుడు సమస్తసంపదలు సహజంగానే కలుగుతాయి." ఏకాదశిని హరివాసరం, మాధవ తిథి అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఎందుకంటే ఏకాదశీవ్రతపాలన ముఖ్య ప్రయోజనము సమస్త ఇంద్రియాల ద్వారా శ్రీహరిని సంపూర్తిగా ప్రసన్నుని చేయడమే. అంటే ఏకాదశిరోజు సాధకుడు శ్రీహరిని, హరిభక్తులను ప్రసన్నులను చేయడానికి యత్నించాలి. ఏకాదశిరోజు ఉపవాసము చేయాలి. ఉపవాసము అనే పదానికి అర్థము "దగ్గరగా వసించడము". కాబట్టి ఏకాదశి రోజు సాధకుడు సమస్త కలుషాలకు దూరంగా ఉండి, సమస్త కలాపాలను ఇంద్రియభోగాలను విడిచి కృష్ణునికి దగ్గర కావాలి.

**ఉపావృత్తస్య పాపేభ్యో యస్తు వాసో గుణైః సహ**
**ఉపవాసః స విజ్ఞేయః సర్వభోగవివర్జితః**

"ఉపవాసము అనగా సకల విధములైన పాపకర్మల నుండి మరియు ఇంద్రియతృప్తి నుండి దూరముగా ఉండుట."

కలియుగంలో జనులు అన్నగతప్రాణులు. అంటే కేవలము అన్నము పైననే వారి అస్తిత్వము నిలిచి ఉంటుంది. అన్నము లేకపోతే వారు కృశించిపోతారు. కాని ఇతరయుగాలలో జనులు తీవ్రమైన తపస్సును తట్టుకోగలిగి ఉండేవారు. అందుకే కలియుగంలో కేవలము నెలకు రెండు రోజులపాటు ఏకాదశి వ్రత ఉపవాసము మానవులకు ఉపదేశించబడింది.

భక్తులు పాండవులకు ఎంతో ఋణపడివున్నారు: ఎలాగంటే ధర్మరాజు– శ్రీకృష్ణుని సంవాదం వలన ఏకాదశుల మాహాత్మ్యము, శ్రీకృష్ణుడు – అర్జునుని సంవాదం వలన శ్రీమద్భగవద్గీత, శుకమహర్షి – పరీక్షిత్తు సంవాదం వల్ల శ్రీమద్భాగవతము భక్తలోకానికి అందాయి.



## ఏకాదశీ వ్రతము చేయు విధానము

ముందురోజు అనగా దశమినాటి రాత్రిపూట ఉపవాసం ఉండాలి.

* తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్త సమయంలో నిద్ర లేచి, స్నానాది కార్యక్రమములు పూర్తి చేసుకొని భగవంతునికి మంగళహారతి చేయవలెను లేదా ఆలయమునకు వెళ్ళి మంగళహారతిని దర్శించవలెను.
* ఇతర భౌతిక వ్యవహారములనన్నింటినీ తగ్గించుకొని సాధ్యమయినంత ఎక్కువగా భగవచ్చింతన చేయవలెను.
* ఏకాదశీ వ్రతమును పాటించువారు పెద్దల వలన ఆ రోజు ఏకాదశీ మాహాత్మ్యమును తప్పనిసరిగా వినవలెను.
* ఏకాదశీవ్రతపాలనలో ఉపవాసము ఎంత ముఖ్యమో ద్వాదశిరోజు సరైన సమయంలో ఉపవాసాన్ని ముగించడము కూడ అంతే ముఖ్యం. దానిని ద్వాదశీ పారణము అంటారు. దానికి ఒక ప్రత్యేకమైన సమయాలు ఉంటాయి.
* మరుసటి రోజు అనగా ద్వాదశి రోజున నిర్ణీత సమయంలో వరి, గోధుమ మొదలైన వాటితో తయారు చేసిన పదార్థాలను భగవంతునికి తులసి వేసి నివేదన చేసి, ఆ ప్రసాదాన్ని స్వీకరించడం ద్వారా ఏకాదశి ఉపవాసాన్ని విరమించవలెను.
* ఏకాదశిరోజు ఉపవాసంతోపాటు హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరేరామ హరేరామ రామ రామ హరే హరే అనే మహామంత్రం జపం ఎక్కువసార్లు చేయాలి. భగవద్గీత, భాగవతం శ్రవణం చేయాలి లేదా చదవాలి, నామ సంకీర్తన చేయాలి.

**తినకూడనివి**

* ఏకాదశి నాడు భక్తులందరూ క్రింది పదార్థాలను భుజించరాదు. బియ్యం, గోధుమ మొదలైన ధాన్యాలు, పప్పులు, బఠానీలు, చిక్కుళ్ళువంటి కూరగాయలు. ఆవాలు (గోధుమ పిండి, ఆవనూనె, సోయా బీన్స్ నూనె మొదలైనవి), వీటితో తయారు చేసిన ఖాద్య పదార్థాలు, మసాల దినుసుల పొడిని కూడా వాడరాదు. ఏదైనా పిండితో వాటి పొడి కలిస్తే ఆ పిండిని కూడా ఏకాదశినాడు ఉపయోగించరాదు.

* బియ్యంపిండి, రవ్వ, గోధుమపిండి, శెనగపిండి (మొ॥వి) వాడకూడదు. తేనె కూడ వాడకూడదు. ఆవాలు, మెంతులు పోపు వాడకూడదు.

* నెయ్యి, వేరుశెనగనూనెతో పోపు, అల్లం, పచ్చిమిర్చి వాడవచ్చును.

* గమనించదగిన విషయం ఏమిటంటే ఏకాదశినాడు ధాన్యములు, పప్పులు వంటి ఆహారపదార్థాలను త్యజించుటకు ఒక కారణము కలదు. అది ఏమనగా ఏకాదశి దినమున పాపపురుషుడు ధాన్యము లందే నివసిస్తాడు. కావున ఆ రోజున ఎవరైతే అన్నమును భుజిస్తారో వారికి 10వేల బ్రాహ్మణులను చంపిన పాపము కలుగును మరియు గోమాంసము తినిన పాపము కూడా కలుగును. ఏవ్యక్తి అయినను తన తపోబలముతో బ్రహ్మహత్య పాతకములనుండి తప్పించుకొనవచ్చు నేమో గాని, ఈ ఏకాదశినాడు అన్నము భుజించిన వారికి నరకము తప్పదు.

* మనిషి ఏకాదశిరోజు అన్నము తినకూడదని పురాణాలలో పదేపదే చెప్పబడింది. పొరబాటున ఎవరైనా ధాన్యమును తింటే దానికి ప్రాయశ్చిత్తముగా నిర్జల ఏకాదశిగా, అంటే రోజు మంచినీళ్ళైనా త్రాగకుండా ఉపవసించాలి. అయితే ఎవరైతే ఉద్దేశ్యపూర్వకంగా ఆ రోజు అన్నాన్ని భుజిస్తారో వారికి నిష్కృతే లేదు.



* బ్రహ్మహత్యాపాతకముతోపాటు సకలపాపాలు ఏకాదశిరోజు ధాన్యమును ఆశ్రయించి ఉంటాయి కనుక ఎవరైతే ఆ రోజు అన్నమును తింటారో వారు పాపమునే తిన్నట్లు అవుతుంది. (నారదపురాణము)

* ఏకాదశిరోజు అన్నమును తినేవాడు మాతృహత్య, పితృహత్య, భ్రాతృహత్య, గురుహత్య పాపాన్ని పొందుతాడు. అటువంటివాడు ఏనాడూ భగవద్ధామాన్ని పొందలేడు. (స్కాంద పురాణము)

* ఏకాదశిరోజు ధాన్యాన్ని తినేవాడు కేవలము పాపమును తిన్న వాడౌతాడు. ఎందుకంటే ఆ రోజు సమస్త పాపాలు ధాన్యాన్ని ఆశ్రయించి ఉంటాయి. కనుక భ్రాంతికి లోనై ఎవడైతే ఏకాదశిరోజు అన్నమును తింటాడో అసంఖ్యాకమైన పాపాలను పొందుతాడు. (బ్రహ్మవైవర్త పురాణము)

* ఏకాదశిరోజు అన్నమును తినే బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు లేదా సన్న్యాసి గోమాంసభక్షణ చేసినవాడే అవుతాడు. (విష్ణుధర్మోత్తర పురాణము)

* ఏకాదశిరోజు యజ్ఞప్రసాదము తినడమే నిషేధించబడినపుడు ఇక సాధారణ ధాన్యము గురించి వేరుగా చెప్పేదేముంది? (పద్మపురాణము)

* పాపము చేస్తే మనిషి తానొక్కడే నరకానికి పోతాడు. కాని అతడు ఏకాదశిరోజు అన్నమును తింటే పితరులతో పాటుగా నరకానికి వెళతాడు. (విష్ణుధర్మోత్తర పురాణము)

* తల్లి లేదా తండ్రి శ్రాద్ధదినము ఏకాదశిరోజు వస్తే దానిని మర్నాడు చేయాలి. ఏకాదశిరోజు పెట్టే పిండాలను పితృదేవతలు, దేవతలు స్వీకరించరు. (పద్మ పురాణము, ఉత్తరఖండము)

* ఏకాదశిరోజు ఎవరైతే భోజనం చేయండని ఇతరులకు చెబుతాడో, భోజనం చేయిస్తాడో అతడు కూడ గోహత్య, స్త్రీహత్య, బ్రాహ్మణహత్య పాతకాన్ని పొందుతాడు. (పద్మ పురాణ ఉత్తరఖండము)

**తినదగినవి**

* కొందరు ఏకాదశినాడు కేవలం ఫలాలను మాత్రమే తిని ఉంటారు. కొందరు కేవలం ఉదకాన్ని (నీటిని) మాత్రమే సేవించి ఉపవసిస్తారు. మరికొందరు అసలు ఏదీ తీసుకోకుండా కఠిన ఉపవాసం (దీనిని నిర్జలోపవాసం అంటారు) చేస్తారు. అయితే ఏకాదశి దినమున పండ్లను మరియు కొన్నిరకాల కూరగాయలను తీసుకొనడం వల్ల ఏమాత్రము వ్రతభంగము కాదని, ఈ విషయం మహాభారతంలోని ఉద్యోగపర్వంలో ఈ విధంగా చెప్పబడింది.

**శ్లో॥ అష్టైతాన్యవ్రతఘ్నుని అపో మూలం ఫలం పయః**
**హవిర్ బ్రాహ్మణ కామ్యా చ గురోర్వచనం ఔషధమ్**

"మంచినీళ్ళు, పండ్లు, కందమూలాలు, పాలు, నెయ్యి, బ్రాహ్మణ సంతుష్టి, గుర్వాదేశపాలన, ఔషధము అనే ఎనిమిది అంశాలు ఏకాదశి వ్రతనియమాన్ని భంగపరచవు."

* ఏకాదశిరోజు ఉపవాసములో అన్నిరకాలపండ్లు తీసికోవచ్చును. జీడిపప్పు, బాదంపప్పు, వేరుశనగలు (పల్లీలు) ఆహారంగా తీసికోవచ్చును. ఆలుగడ్డలు, గుమ్మడికాయి, దోసకాయలు, బొప్పాయిపండు, పనస పండు, కొబ్బరికాయి, అన్ని రకాల పాలపదార్థాలు తినవచ్చును. పల్లీల (వేరుశెనగ)నూనె వాడవచ్చును.

* ఏకాదశి నాడు నిర్దేశించిన ఆహారమును ఒకసారి లేక రెండుసార్లు మాత్రమే తీసుకొనవలెను. ఆకలికి ఆగలేనివారు స్వల్పంగా తీసుకొన వచ్చును.



**భగవంతునికి నివేదన చేసే పద్ధతి**

పవిత్రమైన మనస్సుతో, భక్తిప్రపత్తులతో భగవంతునికి పరిశుద్ధమైన శాఖాహారాన్ని సమర్పించడమే నైవేద్యం అనబడుతుంది. భగవంతునికి నివేదించబడిన ఆహారమే అమృతమయమై భగవత్ప్రసాదముగా మారుతుంది. భక్తియోగంలో భగవత్ప్రసాదాన్ని తినడం మొట్టమొదటి భక్తికార్యమని శాస్త్రాలలో చెప్పబడింది. అది సకలపాపహరము, సమస్తపుణ్యప్రదము. అందుకే అన్ని దేవాలయాలలో భగవత్ప్రసాదవితరణము తప్పనిసరిగా జరుగుతూ ఉంటుంది. దాని వలన పండితపామరులు, వృద్ధులు బాలురు, స్త్రీపురుషులు అనే భేదం లేకుండ ఎవ్వరైనా లాభాన్ని పొందగలుగుతారు. చివరికి నోరులేని జంతువులు కూడ పుణ్యాన్ని పొందగలుగుతాయి. ఈ విషయంలో శాస్త్రం ఈ విధంగా చెప్పింది:

**అతః శ్రీకృష్ణనామాది న భవేద్గ్రాహ్యమనింద్రియైః ।**
**సేవోన్ముఖే హి జిహ్వాదౌ స్వయమేవ స్ఫురత్యదః ॥**

"శ్రీకృష్ణుని నామరూపగుణ లీలాదుల దివ్యస్వభావాన్ని భౌతికేంద్రియాలతో ఎవ్వడూ తెలిసికోలేడు. జిహ్వాద్వారా ఆరంభమయ్యే దివ్యమైన భక్తియుత సేవ ద్వారా ఆధ్యాత్మికముగా పరిపూర్ణుడైనపుడే మనిషికి ఆ దేవదేవుని నామరూపలీలాదులు వ్యక్తమౌతాయి. జిహ్వ చేయగలిగే సేవలు ప్రసాదాన్ని తినడం, కృష్ణనామాన్ని పలకడము."

వేదాలలో కూడ ఆహారశుద్ధి అని చెప్పబడింది. అంటే భక్తియుతసేవ ద్వారా, భగవంతునికి నైవేద్యం పెట్టడం ద్వారా ఆహారము పవిత్రమౌతుంది. పవిత్రమైన ఆహారాన్ని (ప్రసాదాన్ని) తినడం ద్వారా మనసు పవిత్రమౌతుంది. దాని ద్వారా అతని బుద్ధి యందలి సూక్ష్మగ్రంథులు పవిత్రమౌతాయి; అపుడు మోక్షమార్గాన్ని గురించి ఆలోచించగలుగుతాడు.

భగవత్ప్రసాద మహిమ ఇంత గొప్పది. కాబట్టి ప్రతియొక్కరు గుడిలోని ప్రసాదాన్ని తినడముతో పాటు ప్రతిరోజు ఇంట్లో కూడ భగవంతునికి నైవేద్యం పెట్టి, ఆ ఆహారాన్ని భగవత్ప్రసాదరూపంలో భుజించాలి. అది అందరికి పవిత్రతను, పుణ్యాన్ని కలుగజేస్తుంది.

భగవంతునిచే ఇవ్వబడిన దానిని భగవంతునికి సమర్పించకుండ తానే భుజించేవాడు చోరుడే అవుతాడు. ప్రసాదమహిమ గురించి భగవద్గీతలో ఈ విధంగా చెప్పబడింది:

**యజ్ఞశిష్టాశినః సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః ।**
**భుంజతే తే త్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్ ॥**

"యజ్ఞప్రసాదాన్ని, అంటే భగవత్ప్రసాదాన్ని తినడం వలన భగవద్భక్తులు సర్వవిధాలైన పాపాల నుండి ముక్తులౌతారు. కాని కేవలము తమ ప్రీత్యర్థమే ఆహారాన్ని తయారు చేసికొనేవారు కేవలము పాపాన్నే తిననవారౌతారు." (భగవద్గీత 3.13)

కాబట్టి బుద్ధిమంతులైన మానవులు ప్రతిరోజు శ్రీకృష్ణునికి నైవేద్యాన్ని సమర్పించి దానిని భగవత్ప్రసాద రూపంలో భక్తితో స్వీకరించాలి. ఆ విధంగా చేయకపోతే ప్రతిరోజు మూడు నాలుగు పూటల పాపాన్నే తింటూ, పాపపు కొండలను తయారు చేసికొని తరువాత జన్మలలో శునకసూకరజన్మలను పొందవలసి ఉంటుంది. ఇది చాలా ప్రమాదకరమైన స్థితి. కేవలము భక్తులే భగవత్ప్రసాదాన్ని తింటూ ఈ ప్రమాదము నుండి బయటబడతారు.

శ్రీకృష్ణునికి నైవేద్యం పెట్టే ఆహారము పవిత్రంగా ఉండాలి. అది శాఖాహారమై ఉండాలి. అందులో ఉల్లి, వెల్లుల్లితో తయారు చేసిన వంటకాలు ఉండకూడదు. ఇక మాంసాహారము గురించి వేరుగా చెప్పనవసరము లేనేలేదు. కృష్ణునికి నైదేద్యం పెట్టేటప్పుడు ఆహారపదార్థాల మీద తులసిని వేయాలి. తరువాత



**"నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణహితాయ చ**
**జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః**
**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**
**హరే రామ హరే రామ రామ రామ హరే హరే"**

అని మూడు సార్లు చదవాలి. ఈ విధంగా భగవంతునికి నైవేద్యము పెట్టడము అలవాటు చేసికొంటే జీవహింస పాపము నుండి కూడ మనిషి బయట పడతాడు. మూగజీవులపై జరుగుతున్న తీవ్రమైన హింస కారణంగానే ప్రపంచంలో ఇపుడు అనేకమైన కఠినపరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రతియొక్కరు ఈ విషయాన్ని గుర్తించి సాత్త్వికగుణము కలవారై భగవత్ప్రసాదాన్నే తింటామని నిర్ణయించుకొని శాఖాహారులై లోకశాంతికి తోడ్పడాలి; అది వారికి పరమశాంతిని కలుగజేస్తుంది.

ఏకాదశీ వ్రతాన్ని పూర్తి చేసిన తరువాత భగవత్ప్రసాదముతో పారణ చేసి తృప్తిచెందాలి. ఈ విధంగా మానవజన్మలో పరమోన్నతమైన చైతన్యము జాగృతమై చిట్టచివరకు కృష్ణప్రేమగా రూపుదిద్దుకుంటుంది.

**చేయకూడనివి**

* ఏకాదశినాడు క్షవరం చేసుకోవడం, గోళ్ళు కత్తిరించుకోవడం నిషిద్ధము.
* దశమి, ఏకాదశి, ద్వాదశి లందు బ్రహ్మచర్యం పాటించాలి.

**ఏకాదశీ వ్రతపాలన మహిమ**

* మహారోగాలను నయం చేయడానికి, సమస్యలు తొలగిపోయి శాంతి చేకూరడానికి దేవదేవుడే ఏకాదశి వ్రతాన్ని పరమౌషధంగా అందజేశాడు. (తత్త్వసాగరము)
* ఏకాదశి వ్రతాన్ని పాటించడం ద్వారా సంసారమనే విషసర్పం కాటు నుండి మనిషి బయట పడతాడు. ఆ విధంగా అతడు సమస్త పాపాల నుండి విడుదలను పొందుతాడు.

* నూరుజన్మలుగా ప్రోగుపడిన పాపమనే కాష్ఠము ఏకాదశి వ్రత పాలనమనే అగ్నిచే క్షణములో భస్మీపటలమై పోతుంది. (నారద పురాణము)
* శుక్లపక్షములో, కృష్ణపక్షములో వచ్చే ఏకాదశులు రెండింటిని శ్రద్ధగా పాటించే భక్తులు వైకుంఠధామాన్ని చేరుకుంటారు. (పద్మపురాణము)
* మనిషి ఒక్క ఏకాదశినైనా యథావిధిగా పాటిస్తే అతడు దానాలు గాని, తపస్సులు గాని, తీర్థయాత్రలు గాని చేసే అవసరమే ఉండదు. మానవులు అన్నిరకాలైన లాభాలను పొందగలిగే విధంగా భగవంతుడు ఈ వ్రతాన్ని ఆవిష్కరించాడు. (పద్మ పురాణము, కార్తీక మాహాత్మ్యము)
* కృష్ణానుగ్రహము లేనిదే ఏకాదశి వ్రతపాలన మహిమ, ప్రాధాన్యత ఎవ్వరికీ అర్థము కావు; ఆ వ్రతాన్ని నిర్వహించే విధానము కూడ అర్థం కాదు. అందుకే శాస్త్రకోవిదులు కూడ ఈ విషయములో భగవన్మాయకు లోనౌతారు. కాబట్టి ఏకాదశి వ్రతపాలనము గురించి తెలుసుకోవాలంటే శ్రీ వైష్ణవభక్తాగ్రేసరులను ఆశ్రయించాలి.

## ఏకాదశి ఉపవాసం ముఖ్య ఉద్దేశము

ఏకాదశి ఉపవాసంలో ఉన్న పరమార్థం, కేవలం భుజించకుండా ఉండడం కాదు. గోవిందుణ్ణి గురించి వినడానికి, కీర్తించడానికి మరింత ఎక్కువ సమయాన్ని వినియోగించడానికే ఉపవాసం ఉద్దేశించబడింది. ఏకాదశిని కేవలం హరిని తృప్తి పరచుట కోసమే చేయవలెను. అందుకే దీనిని 'హరివాసరం' అని కూడా అంటారు. భగవంతుని, భగవద్భక్తులను సంతృప్తి పరచుట కొరకు ప్రతియొక్కరు ప్రయత్నించవలెను. ఏకాదశినాడు సకల పాపకర్మలకు దూరంగా ఉండి. గృహసంబంధకార్యాలను పక్కనపెట్టి, ఇంద్రియభోగాలను విడిచి పెట్టి ఉపవాసముంటూ భగవంతునికి దగ్గరగా నివసించవలెను.



## ఏకాదశి ఉపవాసం వల్ల ప్రయోజనం

* ఈ జన్మలోనే ఎంతో ఆనందాన్ని అనుభవించి, తరువాతి జన్మ లేకుండానే శ్రీవైకుంఠం చేరవచ్చు. అంటే ముక్తిని పొందవచ్చు.
* అనేకజన్మల్లో చేసుకొన్న సకలపాపాల నుండి విముక్తిని పొందవచ్చు. చివరకు పరమసిద్ధిని పొందవచ్చును.
* ఏకాదశినాడు విష్ణువును తులసీ మంజరులతో (దళములతో) ఆరాధించినట్లయితే 'వాజపేయ' యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది.
* వేల లక్షల సంవత్సరాలు చేసే యజ్ఞాలు, తపస్సులనే ఫలితాలు ఒక్క ఏకాదశీవ్రతఫలితానికి సమానం కాలేవు.
* ఈ జన్మలోనే పేరు, ప్రఖ్యాతులు వస్తాయి. మరు జన్మలో ముక్తిని పొందవచ్చును.
* శ్రద్ధతో ఆచరించినట్లయితే అశ్వమేధయజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది.
* నిస్వార్థంతో ఆచరిస్తే అష్టైశ్వర్య, ధనధాన్యాది సిరిసంపదలు సమకూరతాయి.
* స్వర్గలోకం వంటి ఉన్నతలోకాలు కూడా పొందవచ్చు.
* బ్రహ్మహత్యా పాతకాలనుండి సైతం బయటపడి సకలయజ్ఞాలు దానాలు, తపస్సులు చేసిన ఫలితంను పొందవచ్చు.
* కేవలం ఏకాదశీమాహాత్మ్యాన్ని గూర్చి విన్నంతనే 'జ్యోతిష్టోమ' యజ్ఞం చేసిన ఫలితం వస్తుంది.

### ఏకాదశుల పేర్లు

1) ఉత్పన్న ఏకాదశి, 2) మోక్షద ఏకాదశి, 3) సఫల ఏకాదశి, 4) పుత్రద ఏకాదశి, 5) షట్తిల ఏకాదశి, 6) జయ ఏకాదశి, 7) విజయ ఏకాదశి, 8) ఆమలకీ ఏకాదశి, 9) పాపమోచనీ ఏకాదశి, 10) కామదా ఏకాదశి, 11) వరూధిని ఏకాదశి, 12) మోహిని ఏకాదశి, 13) అపర ఏకాదశి, 14) నిర్జల ఏకాదశి, 15) యోగినీ ఏకాదశి, 16) శయన ఏకాదశి, 17) కామిక ఏకాదశి, 18) పవిత్ర (పుత్రద) ఏకాదశి, 19) అన్నద (అజ) ఏకాదశి, 20) పార్శ్వ ఏకాదశి, 21) ఇందిర ఏకాదశి, 22) పాశాంకుశ ఏకాదశి, 23) రమా ఏకాదశి, 24) ఉత్థాన ఏకాదశి, 25) పద్మినీ ఏకాదశి (అధికమాసము), 26) పరమ ఏకాదశి (అధికమాసము). ఈ ఇరవైయారు ఏకాదశి పేర్లను ఉచ్చరించేవారు సంవత్సరకాలం ద్వాదశివ్రతాన్ని చేసిన ఫలితాన్ని పొందుతారు.

అయితే ఒక ముఖ్య విషయమేమిటంటే ఎనిమిది మహాద్వాదశులు కూడా ఉన్నాయి. వీటిలో నాలుగు తిథి ననుసరించి, మిగిలిన నాలుగు నక్షత్రాన్ని అనుసరించి ఉంటాయి. అవన్నీ మహామహిమాన్వితాలు. పరమ మంగళమైన మహాద్వాదశులు సమస్తపాపాలను నశింపజేస్తాయి. వాటి పేర్లు – ఉన్మీలినీ మహాద్వాదశి, వ్యంజులీ మహాద్వాదశి, త్రిస్పృశ మహాద్వాదశి, పక్షవర్ధినీ మహాద్వాదశి, జయమహాద్వాదశి, విజయ మహాద్వాదశి, జయంతిమహాద్వాదశి, పాపనాశినీమహాద్వాదశి. ఈ మహాద్వాదశులు అరుదెంచినపుడు భక్తులు ఏకాదశిని విడిచి మహాద్వాదశి రోజు ఉపవాసం చేస్తారు. ఆ విధంగా ఏకాదశి ఉపవాసము పూర్తవుతుంది, భగవంతుడు కూడ పూర్తిగా ప్రసన్నుడౌతాడు.

# భక్త అంబరీషుని జీవిత చరిత్ర

పరమభాగ్యశాలియగు అంబరీషుడు సప్తద్వీపసమన్వితమగు ప్రపంచముపై శాసనమును, అక్షయమగు అనంతమైన సంపదను, పృథ్వి యందు సమృద్ధిని సాధించెను. అట్టి స్థానము దుర్లభము అయినప్పటికిని దానినతడు పట్టించుకొనలేదు. ఏలయన అట్టి ఐశ్వర్యము భౌతికమైనదని అతడెరిగి యుండెను. స్వప్నమువలె అట్టి సంపద చివరకు నశించియే తీరును. భక్తుడు కానివాడు అట్టి ఐశ్వర్యమును బడసినపుడు అధికాధికముగా తమోగుణము నందు నిమగ్నుడగునని ఆ రాజు ఎరిగియుండెను.

అంబరీషుడు దేవదేవుడగు వాసుదేవునికి, ఆతని భక్తులగు సాధు పురుషులకు పరమభక్తుడై యుండెను. ఇట్టి భక్తి కారణమున అతడు సమస్త విశ్వమును గులకరాయివలె తుచ్ఛముగా భావించెను.

**శ్రీమద్భాగవతము 9.18-20**

**స వై మనః కృష్ణపదారవిన్దయో ।**
**ర్వచాంసి వైకుంఠగుణానువర్ణనే ॥**
**కరౌ హరేర్మన్దిరమార్జనాదిషు**
**శ్రుతిం చకారాచ్యుతసత్కథోదయే ॥**
**ముకున్దలిఙ్గాలయదర్శనే దృశౌ**
**తద్భృత్యగాత్రస్పర్శేఽఙ్గసఙ్గమమ్ ।**
**ఘ్రాణం చ తత్పాదసరోజసౌరభే**
**శ్రీమత్తులస్యా రసనాం తదర్పితే ॥**
**పాదౌ హరేః క్షేత్రపదానుసర్పణే**
**శిరో హృషీకేశపదాభివన్దనే ।**
**కామం చ దాస్యే న తు కామకామ్యయా**
**యథోత్తమశ్లోకజనాశ్రయా రతిః ॥**

అంబరీషుడు మనస్సును శ్రీకృష్ణపాదారవింద ధ్యానమునందు, వాక్కులను ఆ దేవదేవుని గుణకీర్తనమునందు, కరములను హరిమందిర మార్జనము నందు, కర్ణములను శ్రీకృష్ణుడు పలికిన పలుకులను లేదా శ్రీకృష్ణుని గూర్చి పలికిన వాక్కులను వినుట యందు నియోగించెను. ఆ భాగవతుడు నేత్రములను శ్రీకృష్ణుని అర్చామూర్తిని, శ్రీకృష్ణమందిరములను, మథుర బృందావనము వంటి శ్రీకృష్ణస్థానములను దర్శించుట యందు నెలకొల్పెను. అతడు స్పర్శను కృష్ణభక్తులను స్పృశించుట యందు, ఘ్రాణమును భగవదర్పితమగు తులసీదళములను ఆఘ్రాణించుట యందు, రసనమును భగవత్ప్రసాదమును ఆస్వాదించుట యందు, పాదములను హరిమందిర క్షేత్ర పర్యటనమునందు, శిరమును శ్రీహరి చెంత మ్రొక్కుట యందు, కోరికలను హృషీకేశుని సేవ యందు ఇరువదినాలుగు గంటలు నిలిపెను. నిజమునకు ఇంద్రియభోగాలకు అతడేదియును కోరలేదు. సర్వేంద్రియములను అతడు భగవత్సంబంధమగు కార్యక్రమములో నిలిపి భక్తియోగమున నెలకొనెను. కృష్ణానురక్తిని పెంపొందించుకొని భౌతికవాంఛల నుండి పూర్తిగా బయటపడుటకు ఇదియే మార్గము.

అంబరీషుని ఏకాంతభక్తికి మిగుల ప్రసన్నుడైన భగవానుడు శత్రు భీకరమైనది. శత్రువుల నుండి విపత్తుల నుండి భక్తుని రక్షించునది యగు సుదర్శనచక్రమును అతనికి ఒసగెను.

శ్రీకృష్ణుని అర్చించుటకు అంబరీషుడు తనతో సమానముగా యోగ్యురాలు అగు రాణితో గూడి సంవత్సరకాలము ఏకాదశీ ద్వాదశీ వ్రతమును ఆచరించెను.

సంవత్సరకాలము ఆ వ్రతమును ఆచరించిన పిమ్మట కార్తీకమాసము నందు అతడు మూడురాత్రులు ఉపవాసముండి యమునానదిలో స్నానము చేసినవాడై మధువనమున దేవదేవుడగు హరిని అర్చించెను.



మహాభిషేకవిధిని అనుసరించి అంబరీషుడు సర్వోపచారములతో శ్రీకృష్ణభగవానుని అర్చామూర్తికి అభిషేకకార్యక్రమము నొనరించెను. పిమ్మట ఉత్తమ వస్త్రములతోను, ఆభరణములతోను, సుగంధపుష్పమాలలతోను, ఇతర పూజాద్రవ్యములతోను ఆ భగవంతుని అలంకరించెను. ఆ విధముగా భక్తిశ్రద్ధలతో అతడు శ్రీకృష్ణుని, భౌతికవాంఛారహితులైన మహాభాగులగు బ్రాహ్మణులను అర్చించెను.

పిమ్మట అంబరీషుడు ఇంటికి వచ్చిన అతిథులను, ముఖ్యముగా బ్రాహ్మణులను సంతుష్టి పరచెను. బంగారు తొడుగు కలిగిన శృంగములు, రజితమండితమగు గిట్టలు కలిగిన అరువదికోట్ల గోవులను అతడు దాన మిచ్చెను. ఆ గోవులు చక్కని వస్త్రశోభితములై క్షీరభరితమగు పొదుగులను కలిగి యుండెను. సాధుస్వభావము కలిగినవి, వయస్సులో ఉన్నవి, సుందరములైనవి యగు అవి వత్సములను కలిగినవి, వయస్సులో ఉన్నవి, సుందరములైనవి యగు అవి వత్సములను గూడియుండెను. గోవులను దానమిచ్చిన పిమ్మట ఆ రాజు బ్రాహ్మణులకు తృప్తిదీరగా భోజనమిడి వారు సంతుష్టులైనంతట వారి అనుమతితో ద్వాదశి పారణమునకు ఉపక్రమించెను. కాని ఇంతలో మహాయోగి యగు దుర్వాసముని అతిథి రూపమున రంగప్రవేశము చేసెను.

అంబరీషుడు లేచి దుర్వాసమునిని ఆహ్వానించి ఆసనమును సమర్పించి పూజోపహారములచే పూజించెను. పిదప ఆ మునిపాదముల చెంత కూర్చొని అతడు భోజనము చేయుమని అర్థించెను.

అంబరీషుని అభ్యర్థనను దుర్వాసుడు మహదానందముతో అంగీకరించినను నిత్యానుష్ఠానమును నిర్వహించుటకు యమునానదికి వెడలెను. అచట పవిత్రజలములలో మునిగినవాడై అతడు నిరాకార బ్రహ్మమును ధ్యానించెను.

ఇంతలో పారణమునకు ద్వాదశీదినమున ఒక్క ముహూర్తకాలమే మిగిలెను. అందువలన వెంటనే పారణము కావించుట తప్పనిసరియయ్యెను. అట్టి సంకట పరిస్థితిలో రాజు బ్రాహ్మణులను సంప్రదించెను.

**రాజు :** "బ్రాహ్మణుని యెడ మర్యాదాతిక్రమము నిజంగా గొప్ప అపరాధమే. ఇంకొక ప్రక్క ద్వాదశీసమయములో పారణము చేయనిచో వ్రతపాలనమునకు భంగము వాటిల్లును. కనుక ఓ బ్రాహ్మణులారా! పారణము ఎలా చేయగలను." ఈ ప్రకారము బ్రాహ్మణులతో సంప్రదించిన పిమ్మట అంబరీషుడు తీర్థస్వీకారం పారణచేయని దోషం కలగక, అతిథిని విడవకుండా పారణచేస్తే పుణ్యం కలుగుతుందని నిశ్చయించుకొన్నాడు.

ఓ కురుశ్రేష్ఠా! అంబరీషుడు మనస్సులో అచ్యుతుని ధ్యానించుచు తీర్థాన్ని స్వీకరించిన పిమ్మట దుర్వాసముని రాకకై ఎదురు చూసెను.

మధ్యాహ్న సమయ అనుష్ఠానమును పూర్తి కావించుకొని దుర్వాసముని యమునానది నుండి తిరిగిరాగా రాజు అతనిని సకలోపచారములతో ఆహ్వానించెను. కాని తన అనుమతి లేకుండగనే అతడు జలపానము చేసెనని దుర్వాసుడు యోగబలముచే తెలిసికొనెను.

దుర్వాసుడు ఆకలిగొనినవాడై దేహము కంపించుచుండగా ముఖము చిట్లించుచు భృకుటి ముడివడగా, చెంతనే చేతులు జోడించి నిలిచియున్నట్టి అంబరీషునితో క్రుద్ధుడై ఇట్లు పలికెను.

అహో! ఈ క్రూరుని వ్యవహారమును చూడుడు. ఇతడు విష్ణుభక్తుడు కాడు. ఐశ్వర్యముచే, తన పదముచే ఇతడు గర్వితుడై తానే ఈశ్వరుడనని భావించుచున్నాడు. ఇతడెట్లు ధర్మమును అతిక్రమించెనో గమనింపుడు.

అంబరీషా! నన్ను ఆతిథ్యమునకు పిలిచిన నీవు నాకు భోజనము పెట్టకయే తొలుత భుజించితివి. ఇట్టి నీ దుర్వ్యవహారమునకు శిక్షగా ఇప్పుడే ఫలమును చూపెదను.



దుర్వాసముని ఇట్లు పలుకుచుండగా అతని ముఖము కోపముతో ఎఱ్రబడెను. శిరస్సు నుండి జటను పెరికి అతడు అంబరీషుని శిక్షించుటకై కాలాగ్నిని బోలిన కృత్యను సృష్టించెను.

జ్వలించుచున్న కృత్య త్రిశూలమును చేపట్టి అడుగులతో భూమిని కంపింపజేయుచు అంబరీషుని చెంతకు వెడలెను. కాని ఆ రాజు దానిని చలించక తన స్థానము నుండి కొంచెమైనను కదలలేదు.

దావాగ్ని దూదిపింజను భస్మంచేసినట్లు భగవంతుని పూర్వాదేశముచే సుదర్శనచక్రము భక్తుని రక్షించుటకై వెంటనే కృత్యను దగ్ధమొనర్చెను.

తన యత్నము విఫలమగుటయు, ఆ సుదర్శనచక్రము తనవైపు వచ్చుటయు గాంచిన దుర్వాసముని మిక్కిలి భీతిల్లినవాడై ప్రాణరక్షణార్థము అన్ని దిశలలో పరుగిడసాగెను.

ప్రజ్వరిల్లెడి దావాగ్నిశిఖలు సర్పమును వెంబడించునట్లుగా, భగవానుని సుదర్శనచక్రము దుర్వాసమునిని అనుసరించెను. ఆ చక్రము దాదాపుగా తన వెన్నంటి యుండుటను గాంచి అతడు సుమేరుపర్వత గుహలో ప్రవేశింపగోరి వేగముగా పరుగుదీసెను.

ఆత్మరక్షణార్థము దుర్వాసముని సర్వత్ర అన్ని దిక్కులలో పరుగిడెను. ఆకాశము, ధరిత్రి, గుహలు, సముద్రములు, ముల్లోకములు, స్వర్గము మున్నగు ప్రదేశములలో ఎచ్చటికేగినను సుదర్శనచక్రము యొక్క దుస్సహమగు తేజమే తనను వెంబడించుచున్నట్లు అతడు గాంచెను.

భీతహృదయుడగు దుర్వాసుడు ఆశ్రయమును గోరి ఎల్లెడల పరుగు దీసినను ఆశ్రయమును పొందజాలక చివరకు బ్రహ్మదేవుని జేరి అతనితో "ప్రభూ! బ్రహ్మదేవా! దేవదేవుడు ప్రయోగించిన తేజోమయమగు సుదర్శన చక్రము నుండి నన్ను రక్షింపుము" అని పలికెను.

**బ్రహ్మదేవుడు :** ద్విపరార్థము చివరన లీలలు ముగిసినంతట తన భ్రుకుటి కదలిక చేతనే విష్ణుభగవానుడు మా లోకములతో పాటు సమస్త విశ్వమును లయమొనర్చును. నేను, శివుడు, దక్షుడు, భృగువు మున్నగు వారము, భూతనాథులు, ప్రజాపాలకులు, సురేశ్వరులు అందరును ఆ విష్ణువునకు శరణుజొచ్చినవారమై లోకహితము కొరకు ఆతని ఆజ్ఞలను శిరసావహించుచున్నాము.

సుదర్శనచక్రతాపముచే మిగుల పీడితుడైన దుర్వాసుడు ఆ విధముగా బ్రహ్మచే తిరస్కృతుడై కైలాసవాసి యగు శివుని ఆశ్రయింప యత్నించెను.

**శివుడు :** వత్సా! గొప్పవారమనెడి మిథ్యాభావనలో ఈ విశ్వమందే పరిభ్రమించుచుండెడి వారమగు నేను, బ్రహ్మ, ఇతర దేవతలు దేవదేవునిపై ఎట్టి పరాక్రమమును చూపజాలము. ఏలయనగా అనంతమగు విశ్వములు, వాని యందలి జీవులు ఆ దేవదేవుని నిర్దేశమాత్రమున ఉత్పన్నములు, వినష్టములు అగుచుండును.

నేను (శివుడు), సనత్కుమారుడు, నారదుడు, మహనీయుడగు బ్రహ్మ, (దేవహూతి తనయుడగు) కపిలుడు, అపాంతరతముడు (వ్యాసుడు), దేవలుడు, యమరాజు, ఆసురి, మరీచి మున్నగు ఋషులు, ఇతర సిద్ధపురుషులు భూత భవిష్యత్‌వర్తమానముల నెరిగినవారమేయైనను భగవన్మాయచే ఆవరింపబడిన వారమై ఆ మాయ ఎంత విస్తారమైనదో ఎరుగకున్నాము. ఈ సుదర్శనచక్రము మాకును దుస్సహమే. కనుక నీవు కేవలము విష్ణువునే ఆశ్రయింపుము. ఆ దేవదేవుని చెంతకే వెడలుము. దయామయుడగు ఆతడు నిశ్చయముగా నీకు శుభమును కలుగజేయును.

శివాశ్రయమును పొందుట యందును నిరాశకు లోనైన దుర్వాసముని పిమ్మట నారాయణుడు లక్ష్మీసమేతుడై వసించునట్టి వైకుంఠమునకు పోయెను.



సుదర్శనచక్ర తాపముచే సంతప్తుడైన దుర్వాసముని నారాయణుని పాదపద్మముల చెంత మోకరిల్లి శరీరము కంపించుచుండగా ఆ దేవదేవునితో "ఓ అచ్యుతా! అనంతా! జగద్రక్షకా! భక్తజనాభీష్టా! ప్రభూ! నేను మహాపరాధిని, దయచేసి నన్ను రక్షింపుము" అని పలికెను.

దేవా! విధాతా! నీ అనంతశక్తిని ఎరుగక నేను నీ ప్రియతమభక్తుని యెడ అపరాధమొనర్చితిని. దయచేసి నన్ను ఈ ఘోర అపరాధము నుండి రక్షించుము. నీవు ఏదైనను చేయగల సమర్థుడవు. ఏలయనగా ఒక వ్యక్తి నరకమునకు పోవలసియున్నను హృదయములో కేవలము నీ పవిత్ర నామమును ఉద్దీపితము చేయుట ద్వారా నీవు అతనిని ఉద్ధరించగలవు.

భగవానుడు "నేను పూర్తిగా నా భక్తులకు వశుడనై యున్నాను. నిజమునకు నేను అస్వతంత్రుడను. నా భక్తులు పూర్తిగా భౌతికవాంఛా రహితులు కనుక నేను వారి హృదయములలో వసింతును. నా భక్తుని మాటయేల, నా భక్తునికి భక్తులును నాకు అత్యంతప్రియమైనవారు.

బ్రాహ్మణోత్తమా! ఏ సాధకమహాత్ములకు నేనే గతియై యున్నానో అట్టి భక్తులు లేనిదే దివ్యానందమును గాని, పరమైశ్వర్యమును గాని నేను అనుభవింపగోరను.

విశుద్ధభక్తులు ఇహపరముల యందును భౌతికోన్నతిని కోరక నా సేవ కొరకు తమ గృహమును, దారాపుత్రులను, బంధువులను, విత్తమును, చివరకు ప్రాణమునైనను త్యజింతురు కనుక ఎన్నడైనను వారిని నేనెట్లు విడువగలను?

పతివ్రతయగు స్త్రీసేవద్వారా మంచివాడగు భర్తను వశము చేసికొనినట్లుగా సమదర్శులు, హృదయమున నా యందే పూర్తిగా అనురక్తులైనవారు నగు విశుద్ధభక్తులు నన్ను వశము చేసికొందురు.

నా ప్రేమభక్తిలో నెలకొని సదా సంతుష్టులై యుండెడి నా భక్తులు తాము చేసెడి సేవకు నాలుగు విధములైన ముక్తులు (సాలోక్యము, సారూప్యము, సామీప్యము, సాయుజ్యం) సహజముగానే లభ్యమైయున్నను వాని యెడ అనురక్తులు కారు. అయినచో నశ్వరమగు స్వర్గసౌఖ్యమును గూర్చి వేరుగా చెప్పనేల?

విశుద్ధభక్తుడు సదా నా హృదయము నందుండును, నేను సదా విశుద్ధ భక్తుని హృదయమున ఉందును. నా భక్తులు నన్ను తప్ప వేరేదియు నెరుగరు, నేను వారిని తప్ప మరియెవ్వరిని ఎరుగను.

ఓ బ్రాహ్మణా! నీ రక్షణమునకై ఇప్పుడొక ఉపాయమును చెప్పుచున్నాను వినుము. అంబరీషుని యెడ అపరాధమొనర్చి నీవు ఆత్మవైరత్వముగా వర్తించితివి. కనుక క్షణమాలస్యము చేయక వెంటనే అతని కడకు వెడలుము. నామమాత్రమగు శక్తిని భక్తునిపై ప్రయోగించినపుడు నిక్కముగా అది ప్రయోగించినవాని పైననే ప్రభావమును చూపును. ఆ విధముగా కర్తకే హాని కలుగును గాని లక్ష్యమునకు కాదు.

బ్రాహ్మణోత్తమా! కనుక నీవు శీఘ్రమే నాభాగసుతుడగు అంబరీషుని చెంతకు వెడలుము. నీకు శుభమగుగాక! ఆ మహాభాగుని ప్రసన్నుని జేసికొనినచో నీకు శాంతి కలుగుతుంది.

శుకమహర్షి సుదర్శనచక్రముచే మిగుల పీడితుడైన దుర్వాసముని ఆ విధముగా విష్ణుభగవానునిచే ఆదేశితుడై వెంటనే అంబరీషుని చెంతకు వెడలి దుఃఖముతో అతని పాదపద్మములను పట్టుకొనెను.

దుర్వాసుడు పాదములపై పడినంతట అంబరీషుడు మిగుల లజ్జితుడు అయ్యెను. ఆ ముని స్తుతింప నుద్యుక్తుడగుటను గాంచినవాడై కరుణతో ఆ రాజు అతని కన్నను ఎక్కువ వ్యథచెంది వెంటనే సుదర్శనచక్రమును స్తుతింప నారంభించెను.



ఓ అచ్యుతప్రియా! నీవు సహస్రారములు కలిగినవాడవు. జగత్పతీ! సర్వాస్త్ర విధ్వంసకా! దేవదేవుని ఆదివీక్షణమా! నీకు వందనములు. దయచేసి ఈ బ్రాహ్మణునికి ఆశ్రయమొసగి శుభమును కలుగజేయుము.

ఈ విధముగా ఆ రాజు సుదర్శనచక్రమును, విష్ణుభగవానుని స్తుతించగా దానిచే ఆ చక్రము శాంతించి దుర్వాసుని దగ్ధము చేయుటను ఆపెను.

మహాయోగియగు దుర్వాసుడు సుదర్శన చక్రాగ్నితాపము నుండి ముక్తుడై ప్రసన్నతను పొందినంతట అంబరీషుని సద్గుణములను ప్రశంసించుచు ప్రశంసించుచు గొప్పగా ఆశీర్వదించెను.

**దుర్వాసముని :** రాజా! భగవద్భక్తుల మాహాత్మ్యమును నేడు దర్శించితిని. ఏలయన నేను అపరాధమొనర్చినను నీవు నా శుభము కొరకే ప్రార్థించితివి.

భగవానుని పొందినవారికి అసాధ్యమైనది, త్యజింప అసంభవమైనది ఏమి యుండును?

భగవంతుని పవిత్రనామమును శ్రవణము చేసినంత మాత్రముననే మనుజుడు పవిత్రుడగుచున్నాడు.

రాజా! నా అపరాధములను ఉపేక్షించినవాడవై నీవు నా ప్రాణమును కాపాడితివి. ఈ విధముగా నీవు కరుణామయుడవగుటచే నేను మిగుల అనుగ్రహింపబడితిని.

దుర్వాసముని నెనుకకు దిరిగివచ్చునని ఎదురు చూచుచు అంబరీషుడు భోజనము చేయలేదు. అందువలన ఆ ముని అరుదెంచినంతట అతడు పాదములపై బడి ప్రసన్నునిగా జేసి భోజనమొసంగెను.

ఈ విధముగా రాజు దుర్వాసమునిని సాదరముగా ఆహ్వానించినంతట ఆ ముని ఆతిథ్యమును స్వీకరించినవాడై మిక్కిలి సంతుష్టి చెంద "నీవు

కూడ భుజింపుము" అని ఆదరముతో పలికి అంబరీషుని భోజనము చేయుమని అర్థించెను.

**దుర్వాసముని :** రాజా! నేను నీ యెడ మిగుల ప్రసన్నుడనైతిని. తొలుత నిన్ను సాధారణవ్యక్తిగా భావించి ఆతిథ్యమును అంగీకరించినను తరువాత నా బుద్ధిబలముచే నీవు పరమభాగవతుడవని ఎరుగగలిగితిని. అందువలన నీ దర్శనస్పర్శసంభాషణలచే మిగుల ప్రీతిచెంది అనుగృహీతుడను అయితిని.

మొదట దుర్వాసుడు వెడలినంతట అతడు తిరిగివచ్చునంతవరకు ఒక సంవత్సరకాలము అంబరీషుడు ఉపవసించి కేవలము జలమును స్వీకరించి యుండెను.

సంవత్సరము పిమ్మట దుర్వాసముని తిరిగి వచ్చినంతట అంబరీషుడు అతనికి తృప్తిగా భోజనమొసంగి పిదప తాను కూడ భుజించెను. దుర్వాసుడు దగ్ధమయ్యెడి ఘోరప్రమాదము నుండి బయటపడుటను గాంచినంతట భగవదనుగ్రహమువలన తాను కూడ శక్తిమంతుడనని అతడు తెలిసి కొనగలిగెను. కాని సర్వము భగవంతుని చేతనే చేయబడినందున ఆ మహనీయుడెట్టి ప్రతిష్ఠను స్వీకరింపలేదు.

ఈ ప్రకారము దివ్యగుణశోభితుడగు అంబరీషుడు భక్తియోగము వలన బ్రహ్మము, పరమాత్ముడు, భగవానుడనెడి తత్త్వములను పూర్తిగా నెరిగి చక్కగా భక్తియుతసేవలో నెలకొనెను. తన భక్తి కారణమున అతడు ఈ భౌతికజగత్తు నందలి అత్యున్నత లోకమునైనను నరకతుల్యముగా భావించెను.

* * *

**హరేకృష్ణ**

# పురుషోత్తమమాసమాహాత్మ్యం

## (పద్మపురాణం నుండి)

కాలప్రమాణంలో చాంద్రమానం ప్రకారం, రెండేండ్లకొక మారో, మూడేండ్లకు ఒకమారో ఏదో ఒక నెల 'అధికమాసం' వస్తుంది. ఈ అధికమాసాన్ని కొందరు దేనికి పనికిరాదంటూ మలినమాసం అనీ, మైలమాసం అనీ అంటారు. కాని ఈ అధికమాసం దైవారాధనకు, భగవన్నామ స్మరణకు, నదీస్నానానికి, దీపదానాలకు అత్యంత పవిత్రమైనదనీ చెప్పబడడమేగాక, సాక్షాత్తు గోలోక బృందావనంలోని శ్రీకృష్ణభగవానుడు తన పేరుతోనే దీన్ని "పురుషోత్తమ మాసం" అని అన్నాడని పద్మపురాణంలో తెల్పబడింది. ఈ అధికమాసంలో వచ్చే మొదటి ఏకాదశిని "పద్మినీ ఏకాదశి" అనీ, రెండవ ఏకాదశిని "పరమ ఏకాదశి" అని అంటారు. ఈ రెండు ఏకాదశులను ఆచరించడం మరింత శ్రేష్ఠం అని పురాణ ప్రసిద్ధి! దాని గొప్పదనాన్ని తెలిపే కథలను, గాథలను చదవండి!

* * *

'అధికమాసం' అనే మాటను మనం అప్పుడప్పుడు వింటూ వుంటాం. ఇంతకీ అధికమాసం అంటే ఏమిటి? అది ఎందుకు వస్తుంది? ఎన్ని సంవత్సరాలకు ఒకసారి వస్తుంది? ఇది ఎలా ఏర్పడుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఆకాశాన్ని గమనిస్తూ కాలగమనాన్ని గుర్తించే భారతీయ సిద్ధాంత గణితాన్ని "పంచాంగము" అని అంటారు. "పంచ" అనగా "అయిదు". "అంగము" అనగా భాగము. తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణములు అను 5 విషయాలను గూర్చి తెలిపేదే పంచాంగము.

ఆధునికంగా వాడబడుతున్న తేదీ అనే మాట ఈ తిథి అనే శబ్దం నుంచి పుట్టింది. తిథి తేదీగా చివరకు డేట్ అనే ఇంగ్లీషు పుట్టుకొచ్చింది.

పంచాంగగణనం ప్రకారం కాలమానాన్ని సౌరమాన, చంద్రమాన పద్ధతులలో లెక్కిస్తారన్న విషయం తెలిసిందే. సౌరమాన సంవత్సరానికి, చంద్రమాన సంవత్సరానికి మధ్య ఉన్న తేడా పదకొండుంపావు రోజులు. చాంద్రమాన సం॥ సౌరమాన సం॥ కంటే తక్కువ వ్యవధి కల్గి వుంటుంది. అదే విధంగా చాంద్రమాన మాసం కూడా సౌరమాన మాసం కంటే చిన్నది. ఈ తేడా కారణంగా అప్పుడప్పుడు చాంద్రమాన మాసంలో, సౌరమానం ప్రారంభం కాదు. అలాంటి సందర్భంలో సూర్యసంక్రాంతి లేని చాంద్రమాసానికి "అధికమాసం" అని పేరు.

| | |
|---|---|
| For one year (12 Months) | = 11 days |
| For one year (12 Months) | = 11 days |
| For 8 months | = 7½days |
| For 16 days O& 4 galige | = ½ day |
| Total 33 months | = 30 days |

భూమి, సూర్యుడు చుట్టూ తిరగడానికి 365 రోజులు సమయం పడుతుంది. సరిగ్గా చెప్పాలంటే 365 రోజులు 6 గం॥ల 9 ని॥ల 8 సెకండ్లు సమయం పడుతుంది. ఇది వాక్షత్రిక గణనము.

సూర్య సిద్ధాంతపరంగా మరియు నేటి ఆధునిక శాస్త్రపరంగా గానీ, రమారమిగా 29.53 రోజుల్లో చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. ఈ లెక్కన 354 రోజుల్లో 12 మాసాలు పూర్తి అవుతాయి.

కాబట్టి 354 రోజుల్లో పూర్తయ్యే చాంద్రమాన సంవత్సరానికి, 365 రోజులలో ఉన్న సౌరమాన సంవత్సరానికి సమన్వయాన్ని కొసాగించాలి.



లేకపోతే మాస ఋతువుల పొంతన దెబ్బతింటుంది. రెండు సంవత్సర లెక్కలలో ఉన్న 11 రోజులు తేడాను సరిదిద్దేదే ఈ అధికమాసం అనే అమరిక.

పురుషోత్తమ మాసాన్ని సాధారణంగా స్మార్తులు, సామాన్య జనులు శూన్యమాసంగా భావిస్తారు. ఇంకొందరు మైలమాసమని కూడా అంటారు. ఆ సమయంలో ఎటువంటి పుణ్యకార్యాలు తలపెట్టరు. కాని అధికమాస మహిమపురాణాలలో స్పష్టంగా తెలుపబడింది. నిజానికి ఇది మహత్తరమైన మాసం. భక్తులు, అంటే విష్ణు ఆరాధకులైన వైష్ణవులు దీనిని పరమ పవిత్రమైన మాసంగా భావిస్తారు. ఈ మాసం భగవంతునికి అత్యంత ప్రియమైంది, భగవంతుడే దీనికి పురుషోత్తమమాసమనే పేరు పెట్టాడు. అందుకే వారు ఈ మాసాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో గడుపుతారు. పూర్ణలాభాన్ని పొందుతారు. సంవత్సరంలో వచ్చే ఈ పురుషోత్తమ అధికమాసం గురించి భవిష్యోత్తర పురాణంలో ఈ విధంగా చెప్పబడింది. "పురుషోత్తమ అధికమాసంలో నెయ్యితో వండిన పాలకోవా బిళ్ళలు ముప్పది మూడింటిని శాస్త్ర నిపుణుడైనట్టి గృహస్థ బ్రాహ్మణునికి కృష్ణధ్యానం చేస్తూ దానమివ్వాలి. ఆ విధంగా చేయకపోతే కడచిన సంవత్సరంలో చేసిన పుణ్యమంతా నశించిపోతుంది".

ఇలాంటి అధికమాసప్రాధాన్యాన్ని గూర్చి సూతమహర్షి శౌనకాది మహర్షులతో ఇలా వివరించాడు.

ఒకప్పుడు, నైమిశారణ్యంలో యజ్ఞం చేయడానికి వేలాదిమంది ఋషులు వచ్చారు. వారి అందరి అదృష్టం వల్ల, సూతుమహర్షి, తన శిష్యులతో కలసి అక్కడికి వచ్చారు. ఆయన ఎన్నో పవిత్రస్థలాలను దర్శిస్తూ ఆ క్రమంలో నైమిశారణ్యానికి వచ్చారు. సూతుణ్ణి దర్శించిన ఋషులందరికి పరమానందం కలిగింది. వారందరూ కూడా వెంటనే తమ స్థానాలనుండి లేచి ఆయనకు స్వాగతం ఇచ్చి కూర్చోబెట్టారు.

అప్పుడు ఆ మహర్షులందరూ చేతులు జోడించి "ఓ సూత మహర్షీ! దయచేసి మాకు దేవాదిదేవుని లీలలు గురించి వివరించండి. అనంతమైన వారి లీలలను విని తరించాలి. మేము భగవంతుని దివ్యసన్నిధిని చేరుకోవాలి".

శౌనకాది ఋషుల ప్రార్థనను విన్న సూతమహర్షి ఇలా ప్రారంభించాడు. ఓ మహర్షులారా! నేను పుష్కర తీర్థాన్ని సందర్శించాను. ఆ తర్వాత అనేక పుణ్యతీర్థాలను సందర్శిస్తూ హస్తినాపురాన్ని చేరాను. అక్కడ గంగానది తీరాన, వేలమంది ఋషులతో కలసి పరీక్షిత్తు మహారాజు వుండటం చూశాను. ఆ సమయంలో శుకమహర్షి అక్కడ ప్రత్యక్షమయ్యారు. వెంటనే అందరూ తమ తమ ఆసనాల నుండి లేచి ఆయనకు ప్రణామాలర్పించారు. పరీక్షిత్తు మహారాజుకు కృష్ణకథను వివరించే శుకదేవ శుకమహర్షికి పద్మం వంటి పీఠాన్ని సమర్పించారు. అక్కడ నేను ఆ శుకముని నుండి పవిత్రమైన శ్రీమద్భాగవతాన్ని పూర్తిగా విన్నాను. నేను హస్తినాపురం నుండే వస్తున్నాను. ఆకర్షణీయమైన ఆ భగవంతుడి లీలలనన్నింటినీ నేను మీకు వివరిస్తాను.

పూర్వం, ఒకసారి శ్రీనారదముని బదరికాశ్రమంలోని నారాయణఋషి దగ్గరికి వెళ్ళారు. ఈ ఋషి ఆశ్రమం అలకనందానదీ తీరాన ఉంది. నారదముని నారాయణ ఋషిని ఈ విధంగా ప్రార్థించాడు –

"ఓ దేవాదిదేవా! ఈ ప్రపంచంలోని జీవులందరూ ఇంద్రియ సుఖాల్లో నిమగ్నమై వున్నారు. వారు జీవిత గమ్యాన్ని మరచిపోయారు. దయచేసి ఈ జీవులు భగవంతుని సన్నిధికి చేరుకోవడానికి ఉపయోగపడే విషయాలను వివరించండి".

వెంటనే నారాయణుడు చిరునవ్వుతో "ఓ నారదా! దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని లీలలను వినడంతో అన్ని పాపాలు నశిస్తాయి. నీకు భగవంతుని లీలలు తెలుసు. కానీ ఇతరులకు మేలు కలిగించడానికి మాత్రమే, ఇలా



అడుగుతున్నావు. కాబట్టి ఇప్పుడు నీకు పవిత్రమైన పురుషోత్తమమాసం గొప్పతనాన్ని వివరిస్తాను. ఆ మాసం కేవలం భౌతికమైన సంతోషాలనే కాకుండా భగవంతుని దివ్యసన్నిధిని ప్రసాదిస్తుంది.

నారదుడు "ఓ దేవా! నేను కార్తీకం, చైత్రం వంటి కొన్నిమాసాల మాహాత్మ్యాన్ని విన్నాను. కానీ పురుషోత్తమమాసం అంటే ఏది? ఈ పవిత్ర మాసం గురించి వివరించండి. ఈ నెలలో ఎలా నడచుకోవాలో, ఏ మంత్రం జపించాలో, ఎవరిని పూజించాలో, ఉపవాసం ఉండాలా, లేదా? ఇలాంటి నియమాలతో విషయాలన్నీ వివరంగా తెలియజేయండి.

సూతమహర్షి ఈ విధంగా అన్నారు. "ఓ నారదా! ఒకసారి యుధిష్ఠిర మహారాజు తన సామ్రాజ్యాన్ని, ఆస్తులను, పతివ్రత అయినటువంటి తన భార్యనూ జూదంలో పోగొట్టుకున్నాడు. ఆ సమయంలో ద్రౌపది నిండుసభలో దుశ్శాసనుడిచేత అవమానించబడింది. కాని దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాలను అపహరించబోయాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆమెను రక్షించాడు. ఆ తర్వాత యుధిష్ఠిరమహారాజు తన తమ్ముళ్ళు, భార్యతో సహా రాజ్యాన్ని వదిలి, కామ్యక వనంలో నివసించాడు.

ఒకసారి దేవకీనందనుడైన శ్రీకృష్ణుడు, అడవిలోవున్న పాండవులను పరామర్శించడానికి వెళ్ళాడు. పాండవులందరూ ద్రౌపదితో సహా శ్రీకృష్ణుని చూచి చాలా సంతోషించారు. వారి వనవాస జీవిత కష్టాలన్నీ మరచిపోయారు. శ్రీకృష్ణదర్శనంతో కొత్త జీవితాన్ని పొందినంతగా ఆనందించారు. శ్రీకృష్ణునికి వాళ్లు అందరూ నమస్కరించారు. వారియొక్క దుర్భర జీవితాన్ని చూసి శ్రీకృష్ణుడు ఎంతో బాధపడ్డాడు. అదే సమయంలో దుర్యోధనుని మీద చాలా కోపం కలిగింది. అప్పుడు కృష్ణుడు పూర్తి విశ్వాన్ని నాశనం చేస్తాడేమో అనిపించేంత కోపంగా వున్నాడు. అది చూసి పాండవులందరూ కూడా భయపడి, భగవంతుణ్ణి వినయంతో ప్రార్థించారు. అర్జునుడి ప్రార్థనలకు

సంతోషించాను. మీ భక్తి ప్రేమలకు కట్టుబడిపోయాను. ఇప్పుడు నేను మీకు అద్భుత మహిమగల పురుషోత్తమమాసం యొక్క మాహాత్మ్యాన్ని మీకు వివరిస్తాను అని శ్రీకృష్ణుడు పలికాడు.

"ఓ అర్జునా! ఒకానొకసారి, ప్రకృతి నిర్ణయం వల్ల అధిక మాసం ఒకటి కాలమానంలో అవతరించింది. ప్రతి ఒక్కరూ ఈ మాసాన్ని అపవిత్రంగానూ, మలినమాసంగా చూశారు. ఏ విధంగా మలినాన్ని తాకడం అపవిత్రంగా భావిస్తారో, ఆ విధంగా ఈ అధికమాసాన్ని ఏ పవిత్ర కార్యానికి పనికిరాదన్నట్లుగా చూడడం మొదలు పెట్టారు. ఇలాగ ఆ మాసం నిందలు పొందుతూ, అందరిచేత నిరాకరించబడింది. ఆ మాసంలో ఏ విధమయిన శుభకార్యాలు చేసేవారు కాదు.

ఈ విధంగా మానవులందరి చేత నిరాకరింపబడి, నిందించబడుతూ అధికమాసం చాలా దుఃఖితురాలయింది. ఆమె వైకుంఠానికి వెళ్ళి తన దీనస్థితిని విష్ణుభగవానునికి వివరించింది. అంతులేని దుఃఖంతో భగవంతుని పాదాలవద్ద పడిపోయింది. కన్నీళ్ళతో ప్రార్థించడం మొదలుపెట్టింది. "ఓ కృపాసింధూ! నేను నిస్సహాయ స్థితిలో నిన్ను చేరుకున్నాను. ప్రపంచ జనులందరూ నన్ను తిరస్కరిస్తున్నారు. నన్ను రక్షించు. నీ కృప నాకు కలిగించు. నన్ను దయతో చూడు" అని భగవంతుని పాదాలవద్ద పడిపోయింది. ఆమె కన్నీళ్ళను, దీనస్థితిని చూసి నారాయణునికి ఆమెపై జాలి కలిగింది. "దుఃఖించకు – నీ కష్టాలన్నింటిని తొలగించి నీకు రక్షణనిస్తాను. ఇకమీదట ఏడవకు. నా శరణుపొందిన తర్వాత ఏడవడం సరియైన పద్ధతి కాదు".

భగవంతునివల్ల ఓదార్పు పొందిన అధిక మాసం మనసులోని మాటలు మళ్ళీ ఈ విధంగా బయటపెట్టింది. "ఓ నారాయణా! నీకు నా దుస్థితి తెలుసు. నాలాంటి కష్టాలు ఈ ముల్లోకాలలో ఎవరికీ లేవు. మిగతా అన్ని



నెలలు, సంవత్సరాలు, దినాలు, పగలు, రాత్రి అన్నీ నీ చేత రక్షింపబడుతున్నాయి. కావున అవి నిర్భయంగా సంచరిస్తాయి. కానీ నాకు పేరు లేదు, ఒక రక్షణ లేదు, అందరు దేవతలు, మానవులు కూడా నన్ను తిరస్కరిస్తారు అని పదే పదే చెప్తూ భగవంతుని పాదాలవద్ద మళ్ళీ మూర్ఛబోయింది. నారాయణుడు చెప్పగా గరుత్మంతుడు తన రెక్కలతో విసరుతూ ఆమెకు సేద తీర్చాడు. కొంచెం సేపటికి 'స్పృహ' రాగా ఆమె తిరిగి చెప్పడం ప్రారంభించింది. "ఓ దేవాదిదేవా! నేను నీ శరణు కోరుతున్నాను. నన్ను రక్షించు". వెంటనే శ్రీమహావిష్ణువు అధికమాసంతో ఇలా అన్నాడు. "ఓ పుత్రీ! దయచేసి దుఃఖించకు. నీ కష్టాలన్నీ త్వరలోనే నశిస్తాయి. శాశ్వతానందమయమైన శ్రీవైకుంఠదివ్యధామానికి వచ్చిన తర్వాత ఇంకా దుఃఖించడం ఎందుకు!

ఇలా చెబుతున్న శ్రీసూతమహర్షి ఋషులతో ఇంకా కొనసాగించాడు. "ఓ ఋషులారా! విష్ణువు కూర్చొన్న తర్వాత శ్రీకృష్ణుడు రహస్యంగా చెప్పడం ప్రారంభించాడు. జాగ్రత్తగా వినండి! నేను (సూతమహర్షి) మీకు ఆ మాటలను వివరంగా చెప్తాను. పురుషోత్తముడు ఈ విధంగా అన్నాడు. నేను స్వీకరిస్తాను. "ఓ విష్ణు! నువ్వు చాలా గొప్ప పనిచేశావు. ఆమెను నా దగ్గరకు తీసుకురావడం వల్ల నీ కీర్తి మరింతగా పెరిగింది. నువ్వు ఆమెను స్వీకరించావు. నాతో సమానమైన కీర్తి, ఐశ్వర్యాన్ని, విజయాన్ని, మోక్షాన్ని, భక్తులకు ప్రసాదించే శక్తిని ఇస్తున్నాను. ఈ అధికమాసం నాతో సమానం. నాలో వున్న శక్తులన్నింటినీ ఈ అధికమాసానికి ఇస్తున్నాను. ఇకమీదట నా పేరుతో "పురుషోత్తమ మాసం" అని ఈ నెల ప్రాముఖ్యం పొందుతుంది.

ఇంకా జనార్దనుడు ఇలా అన్నాడు "ఈమెకు నా లక్షణాలన్నీ లభించడం వల్ల నేనే ఈమెకు భర్తనవుతాను. పురుషోత్తమ మాసాన్ని నేను రక్షిస్తాను. నాతో సమానం కావున ఈ మాసం అన్ని మాసాలకు అధిపతి.

ప్రతి ఒక్కరిచేత పూజింపబడుతుంది. పురుషోత్తమమాసాన్ని ఎవరైతే పాటిస్తారో వారికి ఎలాంటి కోరికలైనా తీరుతాయి. వేరే మాసాల లాగా భౌతికమైన కోరికలు లేకుండా ఈ పురుషోత్తమమాసాన్ని కోరికల రహితంగా చేస్తాను. ఈ మాసాన్ని పూజిస్తే గత జన్మల పాపాలన్నీ నశించడమేగాక, ఈ జన్మలో సంతోషకరమైన జీవితం గడిపి చివరలో భగవంతుని దివ్యధామానికి చేరుకుంటారు".

శ్రీవిష్ణుభగవానుడు ఇంకా ఇలా అన్నాడు "ఎవరైతే తపస్సులు చేసినా, పుణ్యకార్యాలు చేసినా, బ్రహ్మచర్యాన్ని పాటించినా, జీవితాంతం ఉపవాస వ్రతం చేసినా వారు నా గోలోకం చేరడం అసంభవం. కానీ ఎవరైతే భక్తిగా పురుషోత్తమ మాసాన్ని ఆచరిస్తారో వారు సులభంగా భవసాగరాన్ని దాటి భగవంతుని దివ్యధామానికి చేరుకోగలరు. అన్ని తపస్సుల్లోకెల్లా పురుషోత్తమ మాసాన్ని ఆచరించడం ఉత్తమమైనది. ఏ విధంగా చక్కగా దున్నిన నేలలో రైతు విత్తనం నాటితే మంచి దిగుబడి వస్తుందో అదే విధంగా తెలివైన వ్యక్తి ఈ పురుషోత్తమ మాసాన్ని ఆచరిస్తాడో అతను ఈ జన్మలో సంతోషంగా జీవించి, శరీరం వదలిన తర్వాత అతను భగవంతుని సన్నిధికి తిరిగి చేరుకుంటాడు.

ఏ వ్యక్తి అయితే పరమమూర్ఖత్వంతో జపం చేయడో, ఎటువంటి దానం చేయడో, ఎవరైతే భగవంతుణ్ణి, ఆయన భక్తులకు గౌరవాన్ని ఇవ్వరో, బ్రాహ్మణుల పట్ల సత్ప్రవర్తన లేనివారై ఉంటారో, ఇతరులతో శత్రుత్వాన్ని పెంచుకొంటారో, పురుషోత్తమ మాసాన్ని నిందిస్తారో వాళ్లందరూ నరకంలో అనంతకాలం వుండవలసి వస్తుంది.

1) పవిత్ర నదిలో స్నానమాచరించడం
2) భగవంతుణ్ణి ఆరాధించడం, నామాన్ని జపించడం
3) దానం చెయ్యడం



ఇలా ఏ అదృష్టవంతుడైతే నా ఉపదేశాలను పాటిస్తాడో, అతను ఐశ్వర్యంతోపాటు మంచి పుత్రులను పొంది ఈ జీవితంలో సంతోషంగా గడిపి, చివరికి భగవంతుని చేరుకొంటాడు. ప్రతి ఒక్కరు ఈ పురుషోత్తమ మాసాన్ని ఆచరించాలి. నేను ఈ మాసాన్ని అన్ని మాసాలకు అధిపతిని చేశాను.

ఇలా వివరించి శ్రీకృష్ణుడు అపారమైన కృపతో ధర్మరాజు, ద్రౌపదిలను చూసి, అర్జునుడితో మళ్లీ చెప్పడం ప్రారంభించాడు. "ఓ అర్జునా! ఇప్పుడు నీకు అర్థమయిందా మీరు (పాండవులు) ఎందుకు కష్టపడుతున్నారో! సాక్షాత్తు శ్రీమహావిష్ణువైన నన్ను ఆ పురుషోత్తమమాసం మీరు అడవిలో ఆచరించ లేదు. కాబట్టి మీరు ఈ విధంగా కష్టపడుతున్నారు. వ్యాసదేవుడిచ్చిన ధర్మసూత్రాలను మీరు పాటిస్తున్నారు. కానీ ఈ పురుషోత్తమమాసాన్ని ఆచరించకుండా, మీరు నిజమైన భక్తితో నాకు (శ్రీకృష్ణుడికి) సేవ చేయలేరు.

శ్రీకృష్ణుడు తిరిగి చెప్పడం ప్రారంభించారు. "ఇప్పుడు నేను ద్రౌపది పూర్వజన్మను మీకు వివరిస్తాను. క్రితం జన్మలో ద్రౌపది మేధావి అనే బ్రాహ్మణుడి కుమార్తె. ఆమె చిన్నతనంలోనే తల్లి చనిపోవడం చేత తండ్రి ఆమెను పెంచాడు. రోజురోజుకు ఆమె యుక్తవయస్సురాలై అందంగా తయారయ్యింది. కానీ ఆమె తండ్రి ఆమెకు పెళ్ళి చేయాలని ఆలోచించేవాడు కాదు. ఆమె స్నేహితురాళ్ళు భర్త, పిల్లలతో సంతోషంగా వుండడం చూచి ఆమె బాధపడేది కొద్దికాలం తర్వాత ఆమె తండ్రి పవిత్రహరినామాన్ని జపిస్తూ ఈ భౌతికశరీరం వదిలాడు.

తండ్రి మరణం ఆమెకు మరింత దుఃఖం కలిగించింది. ఆమె అదృష్టం కొద్దీ దుర్వాసమహర్షి ఆమె ఆశ్రమానికి వచ్చింది. ఆయనను చూసిన వెంటనే ఆమె ప్రణామాలర్పించి పూజించింది. పూలు, పండ్లు సమర్పించింది.

దుర్వాసమహర్షి ఆమెయొక్క అతిథి మర్యాదలకు సంతోషం తెలుపగానే ఆమె మహర్షీ! మీకు భూత, భవిష్యత్, వర్తమానాలన్నీ తెలుసు. నాకు ఈ ప్రపంచంలో ఎవరూ లేరు. నేను కూడా అవివాహితను. కావున రక్షించడానికి భర్త లేడు. కాబట్టి నాకు సహాయం చేసి ఈ పరిస్థితినుంచి బయటపడే సలహా ఇవ్వండి". అంతా విన్న దుర్వాసమహర్షి ఆమెకు సహాయం చేయదలచి ఇలా అన్నారు. "ఓ అమ్మాయీ! మూడు నెలల తర్వాత పురుషోత్తమమాసం ప్రారంభమవుతుంది. ఈ పవిత్రమాసం శ్రీకృష్ణునికి ప్రీతికరమైంది. ఈ మాసంలో పవిత్ర నదీస్నానం చేసినంతనే పాపం పోతుంది. ఈ పురుషోత్తమ మాసం అన్ని మాసాలకంటే పరమ పవిత్రమయింది. కార్తీకమాసంతో సహా అన్ని పవిత్రమాసాల మాహాత్మ్యం ఈ పురుషోత్తమ మాస మాహాత్మ్యంలో 1/16 వంతుకు కూడా సమానం కావు. ఈ మాసంలో పవిత్ర నదీస్నానం ఒకసారి చేసినా, గంగానదిలో 12,000 సం॥ స్నానం చేసిన ఫలితం వస్తుంది. బృహస్పతి సింహరాశిలోకి ప్రవేశించినపుడు ఎవరైతే గంగలో లేదా గోదావరిలో స్నానం చేసిన ఫలితం, దానం చేసిన ఫలితం పొందుతారు. మరియు పవిత్ర కృష్ణనామాన్ని ఈ మాసంలో జపించడం వల్ల అన్ని దుఃఖాలు నశిస్తాయి. అన్ని విధాల సౌఖ్యంతో పాటు కోరికలు అన్నీ కూడా నెరవేరుతాయి. దయచేసి నా సలహా విని ఈ పురుషోత్తమ మాసాన్ని పాటించడం మరచిపోకు". ఈ విధంగా దుర్వాసమహర్షి చెప్పాడు.

కానీ దురదృష్టవశాత్తూ ఆ బ్రాహ్మణయువతి ఆ మాటలమీద నమ్మకం లేక కోపంతో ఆయన్ను నిందించడం ప్రారంభించింది. "ఓ మహర్షి! మీరు అబద్ధమాడుతున్నారు. ఏ విధంగా ఈ అధికమాసం (మలినమాసంగా అందరిచేత నిరాకరింపబడింది.) మాఘమాసం, కార్తీకమాసం, వైశాఖ మాసాలకంటె ఎలా గొప్పదవుతుంది. నేను మీ మాటలు నమ్మలేను. నన్ను మోసం చేయాలని చూస్తున్నారు. ఈ అధికమాసం ఏ పుణ్యకార్యాలకు



పనికిరాదు". ఈ విధంగా పలికిన బ్రాహ్మణయువతిపై చాలా కోపించిన దుర్వాసమహర్షి కళ్ళు ఎర్రగా మారి శరీరం వణకడం ప్రారంభించింది. కానీ ఆ యువతియొక్క అసహాయస్థితి గుర్తుకు వచ్చి శాంతించాడు. దుర్వాసమహర్షి ఈ విధంగా అన్నాడు. "ఓ అమ్మాయీ! నేను నిన్ను శపించదలచుకోలేదు. ఎందుకంటే మీ నాన్న నాకు మంచి స్నేహితుడు. నువ్వు ఎలాంటి నిస్సహాయ స్థితిలో వున్నావంటే అజ్ఞానంతో శాస్త్రాలను కూడా అర్థం చేసుకోలేక పోతున్నావు. నాపట్ల నీవు చేసిన అపరాధాన్ని కూడా నేను తీవ్రంగా తీసుకోవడం లేదు. కానీ అదే సమయంలో నీవు పురుషోత్తమమాసం పట్ల చేసిన అపరాధాన్ని నేను సహించలేక పోతున్నాను. వచ్చేజన్మలో ఈ పాపఫలితాన్ని నీవు అనుభవిస్తావు". అని పలికి దుర్వాస మహర్షి నారాయణ సేవకొరకు ఆ స్థలాన్ని వెంటనే విడిచివెళ్ళాడు.

శ్రీకృష్ణుడు అర్జునుడితో ఈ విధంగా పలికాడు. "ఓ అర్జునా! ఎపుడైతే దుర్వాసమహర్షి ఆ స్థలాన్ని వదిలాడో ఆ బ్రాహ్మణయువతి వైభవం అంతా ఆ క్షణంలో కోల్పోయింది. పురుషోత్తమ మాసం పట్ల అపరాధం చేసినందువల్ల ఆమె శరీరం కురూపిగా తయారయ్యింది. అపుడు ఆమె భక్తితో పరమశివుణ్ణి ప్రార్థించడానికి నిర్ణయించుకుంది.

ఆ బ్రాహ్మణ యువతి శివుడిని తృప్తి పరచడానికి గొప్ప తపస్సును 9,000 సం॥ పాటు ఆచరించింది. అపుడు శంకరుడు ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. ఆమె ఎంతో సంతోషంతో తిరిగి స్పృహలోకి వచ్చి పవిత్రమైన శంకరుని దర్శనంతో ఆమె శరీరం మునుపటి స్థితికి చేరి ప్రకాశించనారంభించింది. పరమశివుణ్ణి ఆమె మనస్సులో ప్రార్థించడం మొదలుపెట్టింది. చక్కని ప్రార్థనలతో ఆయన్ను ప్రసన్నం చేసింది. ఎంతో సంతోషించిన పరమశివుడు "ఓ బ్రాహ్మణ యువతీ! నీకు శుభం కలుగుగాక!

నా నుంచి ఏదైనా వరం కోరుకో! నీ తపస్సుచే నేను సంతృప్తి పొందినాను. ఏమి కావాలన్నా ఇస్తాను!" అని అన్నాడు. ఈ మాటలు విన్న వెంటనే ఆ యువతి "ఓ పరమేశ్వరా! నాకు భర్తను ప్రసాదించు" అని ఆమె ఐదుసార్లు అడిగింది. అప్పుడు పరమశివుడు "అలాగే కానీ! నీవు భర్త కావాలని ఐదుమార్లు అడిగావు. కావున నీకు ఐదుమంది భర్తలు లభిస్తారు". ఆ మాటలు విని ఆమె సిగ్గుతో తలవంచుకుంది. ఆమె "ఓ శంకరా! ఒక అమ్మాయికి ఐదుమంది భర్తలు ఉండడం ఘోరమైన విషయం. దయచేసి మీ వరాన్ని ఉపసంహరించుకోండి. అపుడు పరమశివుడు గంభీరంగా "అది నాకు అసంభవం. నువ్వు కోరుకున్నది నేను ఇచ్చాను. వచ్చే జన్మలో నీకు ఐదుగురు భర్తలు లభిస్తారు. ఇంతకు ముందు నీవు దుర్వాసమహర్షి ఎంతో కరుణతో నీకు వివరించిన పురుషోత్తమ మాసం పట్ల నీవు అపరాధం చేసావు. ఓ అమ్మాయీ! నాకు, దుర్వాసుడికి ఎటువంటి భేదం లేదు. దేవతలందరం బ్రహ్మతోసహా, నారదుని వంటి మహర్షులతో సహా శ్రీకృష్ణుని ఆదేశానుసారం ఈ పురుషోత్తమ మాసాన్ని పాటిస్తాం. ఈ పురుషోత్తమ మాసాన్ని ఆచరించిన వ్యక్తి ఈ జన్మలో అదృష్టాన్ని పొంది మరణం తర్వాత గోలోక బృందావనం చేరుకుంటాడు. ఈ మాసానికి అపరాధం చేసిన కారణంగా నీవు వచ్చే జన్మలో ఐదుమంది భర్తలను పొందుతావు" అని పలికి శివుడు అదృశ్యమయ్యాడు. ఆ బ్రాహ్మణ యువతి ఎంతో దుఃఖంతో, భవిష్యత్తు జన్మ గురించి దిగులు చెంది, కర్మానుసారంగా శరీరాన్ని వదిలిపెట్టింది.

తర్వాత శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు. "ఓ అర్జునా! ఆ తర్వాత కాలంలో ద్రుపద మహారాజు గొప్ప యజ్ఞం చేస్తుండగా ఆ బ్రాహ్మణయువతి యజ్ఞకుండంలో ద్రుపదుడి కుమార్తెగా ఆవిర్భవించి ద్రౌపదిగా ప్రసిద్ధి చెందింది. ఆమే మీ ధర్మపత్ని, ఆమె ముందుజన్మలో పురుషోత్తమమాసాన్ని



నిందించినందున, నిండుసభలో దుశ్శాసనుడిచేత ఐదుగురు భర్తలముందు అవమానింపబడింది. కాని అదృష్టం కొద్దీ నన్ను (శ్రీకృష్ణుడిని) స్మరించడం, నా శరణాగతి పొందడం వల్ల నేను ఆ దుస్థితి నుండి ద్రౌపదిని రక్షించాను. ఓ పాండవులారా! వచ్చే పురుషోత్తమమాసాన్ని పూజించడం మరచిపోవద్దు. ఎవరైతే పురుషోత్తమమాసాన్ని ఆచరించరో, పూజించరో, నన్ను పూజించరో వారు ఎప్పటికీ అదృష్టాన్ని పొందలేరు. ఈ పురుషోత్తమ మాసం మీ కోరికలన్నీ నెరవేర్చి దుఃఖాలను పోగొడుతుంది. మీ పద్నాలుగేళ్ళ వనవాసం పూర్తి కాబోతుంది. దయచేసి ఈ పురుషోత్తమమాసాన్ని శ్రద్ధగా పాటించండి". ఈ విధంగా పాండవులను ఓదార్చి శ్రీకృష్ణుడు ద్వారక వెళ్ళాడు.

కొన్నిరోజుల తర్వాత పురుషోత్తమమాసం ప్రారంభమయినపుడు యుధిష్ఠిరుడు తమ్ముళ్ళకు, భార్యకు శ్రీకృష్ణుని మాటలను గుర్తు చేశాడు. వారు శ్రీకృష్ణుడు చెప్పిన ఉపదేశాలను అనుసరించారు. వారు అనేక విధాలుగా శ్రీకృష్ణుణ్ణి పూజించి పురుషోత్తమమాసాన్ని ఆచరించారు. దాని ఫలితంగా వారు వారి రాజ్యాన్ని తిరిగి పొందడమే కాకుండా ఆనందంగా జీవించి చివరకు శ్రీవైకుంఠాన్ని చేరుకున్నారు.

ఇలా, సూతమహర్షి నైమిశారణ్యంలో ఋషులకు ఇంకా చెప్తున్నాడు. "ఓ ఋషులారా! ఇపుడు నేను మరొక ముఖ్యమైన కథ, పురుషోత్తమ మాసాన్ని తెలిపేది వివరించబోతున్నాను. ఇది సూర్యవంశరాజైన హదధన్వుడికి సంబంధించింది. పూర్వకాలంలో చిత్రధన్వుడు ఒక ధార్మికమైన రాజు ఉండేవాడు. ఆయన హైహయ రాజ్యానికి రాజు. ఆయన కుమారుడే హదధన్వుడు. హదధ్వనుడియొక్క ధర్మపాలన మరియు విశ్వాసపాత్రత వల్ల ప్రపంచం అంతా అతడంటే ప్రేమించేవారు. గురువును మెప్పించి చిన్నవయస్సులోనే పండితుడయ్యాడు. అంగాలు, ఉపనిషత్తులతో సహా

వేదాలన్నీ అభ్యసించాడు. విద్య పూర్తిచేసి గురుదక్షిణ సమర్పించి రాజధానికి చేరుకున్నాడు. చిత్రధన్వుడు వయసు మీరిపోవడం వలన రాజ్యాన్ని కుమారుడికి అప్పగించి వానప్రస్థజీవితం గడపాలని అడవికి వెళ్ళాడు. హదధన్వుడు హైహయరాజ్యానికి రాజయ్యాడు.

ఒకసారి హదధన్వుడు తన ఐశ్వర్యాలను గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు. తన పూర్వజన్మపుణ్యకర్మల వల్ల ఇంతటి పెద్దరాజ్యం పొందగలిగానని ఆయనకు తెలుసు. ఈ విధంగా ఆలోచిస్తూ ఆయన వేటకు అడవికి పరివారంతో సహా బయలుదేరారు. అడవిలో రాజు చేతిలో దెబ్బతిన్న జింక అడవిలోకి పారిపోయింది. రాజు ఆ జింకను తరుముతూ వెళ్ళాడు. అలా వెళుతూ రాజు ఆకలిదప్పులతో అలసిపోయాడు. ఆయన నీళ్ళకోసం వెతకగా కొద్దిదూరంలో తియ్యని నీళ్ళతో నిండిన సరస్సు కనిపించింది. అక్కడికి వెళ్ళి గుర్రాన్ని దిగి దాన్ని ఆ ప్రక్కనే ఉన్న మర్రిచెట్టుకి కట్టివేశాడు. తన దాహాన్ని తీర్చుకొని ఆ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకున్నాడు. ఆ సమయంలో ఒక అందమైన చిలుక ఆ చెట్టుమీద నుంచి ఈ విధంగా పలికింది.

"ఐశ్వర్యంతో కళ్ళు మూసుకుపోయిన ఓ రాజా! నువ్వు జీవిత చరమగమ్యం గురించి ఆలోచించడం లేదు. ఈ భవసాగరాన్ని ఎలా దాటగలవు? జన్మమృత్యుచక్రం నుండి ఎలా బయట పడగలవు?"

ఈ విధంగా చిలుక పదేపదే చెప్పడంతో రాజు తీవ్రంగా ఆలోచించ సాగాడు. ఈ చిలుకరూపంలో శుకమహర్షి నన్ను హెచ్చరిస్తూ కరుణ చూపిస్తున్నారని రాజు ఆలోచించసాగాడు. అదే సమయంలో సైనికులు సమీపించడంతో చిలుక అదృశ్యమయింది. కానీ రాజు చిలుక గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు. హదధన్వుడు ఈ విధంగా ఆలోచిస్తున్న



సమయంలో వాల్మీకిమహర్షి ఆయన రాజభవనానికి వచ్చాడు. రాజు ఆయనను భక్తిశ్రద్ధలతో గౌరవించాడు. వాల్మీకిమహర్షి రాజును చూసి, "హదధన్వా! నీవు ఎందుకు అంత దిగులుగా వున్నావు. ఏదో సందేహంతో సతమతమవు తున్నట్లున్నావు. నీ సందేహం తీర్చడానికి నేను ప్రయత్నిస్తాను. చెప్పు" అని అడుగగా రాజు అడవిలో చిలుక చెప్పిన మాటలు చెప్పాడు. అంతా విన్న వాల్మీకిమహర్షి ఈ విధంగా వివరించాడు.

"ఓ రాజా! పూర్వజన్మలో నీవు ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించావు. నీ పేరు అప్పుడు సుదేవుడు. నీవు ధార్మికమైన, భక్తిప్రపత్తులతో కూడిన జీవితం గడిపేవాడివి. నీ భార్యపేరు గౌతమి. గౌతమఋషి కుమార్తె. గృహస్థ ఆశ్రమ ధర్మాలన్నింటినీ చక్కగా నిర్వర్తించేవాడివి. కానీ నీకు పిల్లలు లేరు. అప్పుడు నీవు నీ భార్య గౌతమితో ఇలా చెప్పావు. "ఓ గౌతమీ! పుత్రులు లేని ఈ మానవజీవితం వ్యర్థం. కాబట్టి వెనువెంటనే మరణించాలను కుంటున్నాను." అప్పుడు గౌతమి "ఓ స్వామి! దయచేసి ఆ విధంగా పలుకవద్దు. మీరు వైష్ణవులు కావున ఇలాంటి పరిస్థితులలో స్థిరచిత్తంతో వుండాలి. మీకు పుత్రుడు కావాలనుకుంటే జగన్నాథుణ్ణి ప్రార్థించి పుత్రుడిని వరంగా అడగండి'. ఆ మాటలు విన్న సుదేవ తామ్రపర్ణి నది ఒడ్డున 4,000 సం॥ తపస్సు చేశాడు. శ్రీహరి మెచ్చి గరుడవాహనంపై ప్రత్యక్ష మయ్యారు. చతుర్భుజరూపుడైన హరిని చూసి సుదేవ ఎంతో ఆనందంతో సాష్టాంగ ప్రణామం చేశాడు. ప్రార్థనలు చేశాడు. ఎంతో సంతోషించిన శ్రీహరి "ఓ సుదేవా! నీ తపస్సు నన్ను ఎంతో సంతోషింపచేసింది. నీకు ఏదైనా వరం కావాలంటే కోరుకో". అప్పుడు సుదేవుడు "ఓ స్వామీ! మీరు నాకు ఒక సత్పుత్రుణ్ణి ప్రసాదించండి". అపుడు హరి "ఓ సుదేవా! నీ ప్రారబ్ధకర్మ ప్రకారం తదుపరి ఏడు జన్మలకు కూడా నీకు పుత్రసంతానం

లేదు. కావున మరేదైనా వరం కోరుకో". ఇది చూసిన గరుడుని మనస్సు కరిగిపోయింది. అపుడు గరుడుడు కూడా విష్ణువును ప్రార్థించాడు. అది విన్న మహావిష్ణువు వారికి పుత్రుణ్ణి ప్రసాదించే శక్తిని గరుడుడుకి ప్రసాదించాడు. అపుడు గరుడుడు స్పృహ కోల్పోయిన సుదేవుడికి సపర్యలు చేశాడు. గరుడుడు ఈ విధంగా చెప్పాడు. "ఓ అదృష్టవంతుడా! నా ప్రభువు ఆజ్ఞ ప్రకారం నేను మీకు ఒక వరాన్ని ప్రసాదిస్తాను. మీకు త్వరలో ఒక పుత్రుడు జన్మిస్తాడు. అతడు నా అంత జ్ఞానవంతుడు అవుతాడు" అని ఆశీర్వదించిన తర్వాత శ్రీహరి, గరుడుడు తిరిగి వైకుంఠం వెళ్ళిపోయారు. కొంతకాలం తర్వాత గౌతమి ఒక పుత్రునికి జన్మనిచ్చింది. అతనిపేరు శుకదేవుడు. చిన్నతనం నుంచే శుకదేవుడు దైవలక్షణాలతో విద్యలో గురువును, పెద్దలను సంతృప్తి పరచేవాడు. ఒకసారి దేవలమహర్షి వారి ఆశ్రమానికి వచ్చాడు. సుదేవ, గౌతమి దంపతులు ఆయనకు ఉచితాసనాన్ని ఇచ్చి గౌరవించారు. వారి కుమారుడు శుకదేవుడు కూడా వారికి ప్రణామాలు అర్పించాడు. అతణ్ణి చూసి దేవలుడు కూడా సంతోషించాడు. కానీ వెంటనే గంభీరంగా ఆలోచించడం మొదలు పెట్టాడు. "బ్రాహ్మణ దంపతులతో ఈ విధంగా చెప్పాడు. "శుకదేవుడికి అన్నీ మంచి లక్షణాలే ఉన్నాయి. కానీ అతనికి ఒక గండం వుంది. 12 సం॥ల వయసులో నీటిలో మునిగి చనిపోతాడు" అని చెప్పి ఆ ఋషి వెళ్ళిపోయాడు. బ్రాహ్మణ దంపతులు దుఃఖంతో కృశించిపోయారు. కానీ దయాసాగరుడైన శ్రీకృష్ణుని తలుచుకుంటూ రోజులు గడుపుతున్నారు.

ఒకనాడు శుకదేవుడు తన స్నేహితులతో కలసి సరస్సులో స్నానం చేస్తుండగా మహర్షి చెప్పినట్లుగా ఆ అబ్బాయి నీళ్ళలో మునిగిపోయాడు. స్నేహితులు ఈ వార్తను తల్లిదండ్రులకు చెప్పగా వారు బిగ్గరగా ఏడుస్తూ



సరస్సు దగ్గరకి వచ్చి కుమారుడి శవానికి ముద్దులు పెడుతూ దుఃఖిస్తూ "కుమారా! నీవు గనుక లేచి మాతో మాట్లాడనట్లయితే మేము కూడా మా ప్రాణాలు విడుస్తాం" అని శ్రీహరి నామాన్ని జపించడం ప్రారంభించారు. వారు ఆ విధంగా జపం చేస్తుండగా అకాల వర్షం, పెనుగాలులు వచ్చాయి. పూర్తిగా నీళ్ళతో నిండిపోయినా వారు దుఃఖంలో ఏమీ పట్టించుకోకుండా కుమారుడు కొరకు ఏడుస్తూనే వున్నారు. ఆ విధంగా వారు హరినామాన్ని జపించడంలో ఒక మాసం గడిచిపోయింది. ఆ మాసం పురుషోత్తమమాసం. అనుకోకుండా సుదేవదంపతులు పురుషోత్తమమాసాన్ని పూజించారు. వారి తపస్సుకు సంతోషించిన శ్రీకృష్ణుడు ప్రత్యక్షమవగా వర్షం వెంటనే ఆగిపోయింది. శ్రీకృష్ణుణ్ణి చూడగానే వారు కుమారుడి శవాన్ని పక్కనపెట్టి ప్రణామాలు అర్పించారు. శ్రీకృష్ణుడు చాలా సంతోషించాడు. ఎందుకంటే వారు శ్రీకృష్ణునికి ఎంతో ఇష్టమైన పురుషోత్తమమాసాన్ని ఆచరించారు.

"ఓ సుదేవా! నీ కుమారుడు శుకదేవుడు 12,000 సం॥ నీతో ఈ భౌతిక ప్రపంచంలో జీవిస్తాడు. నీకు సుఖసంతోషాలను కలిగిస్తాడు. మీ జీవితం చివరలో మీరు నా గోలోకధామానికి చేరుకుంటారు". ఈ విధంగా శ్రీకృష్ణుడు చెప్పడం పూర్తవగానే శుకదేవుడు లేచి కూర్చున్నాడు. అది చూసి బ్రాహ్మణదంపతులు చాలా సంతోషించారు. ఆ దృశ్యం చూసి దేవతలు వారిపై పుష్పవర్షం కురిపించారు. శుకదేవుడు తల్లిదండ్రులకు, శ్రీహరికి తన ప్రణామాలర్పించాడు. అంతవరకు జరిగిన విషయాలన్నీ సుదేవుడికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఆయన శ్రీహరిని అడిగాడు, తిరిగి తమ పుత్రుణ్ణి ఎందుకు బతికించారు అని!

భక్తసులభుడైన శ్రీహరి ఈ విధంగా సమాధానమిచ్చాడు. "ఓ బ్రాహ్మణా, నీకు తెలియదా నేను ఎందుకు మీ పట్ల సంతృప్తి చెందానో? మీ ఇద్దరూ

కూడా పరమపవిత్రమైన పురుషోత్తమ మాసాన్ని పాటించారు. ఆ మాసం నాకు అత్యంత ప్రియమైనది. మీరు దుఃఖంతో ఏడుస్తూ నా నామజపం చేసినపుడు పురుషోత్తమమాసం జరుగుతున్నది. మీరు ఆ మాసం మొత్తాన్ని పాటించారు. అది నాకు చాలా సంతోషం కలిగించింది. ఒకసారి బ్రహ్మ, వేదాలలో తెలిపిన అన్ని దానాలలో, తపస్సు గొప్పదా లేక పురుషోత్తమ మాసం గొప్పదా అని లెక్కించారు. కానీ అన్ని వైదికకర్మలకంటే పురుషోత్తమ మాసం గొప్పదని తెలుసుకున్నారు.

"ఏ వ్యక్తి అయితే ఈ పురుషోత్తమ మాసాన్ని పాటిస్తాడో, అతడే ముల్లోకాలలో పరమఅదృష్టవంతుడు. మరణించాక నా దివ్యధామం చేరుకుంటాడు". ఈ విధంగా చెప్పి శ్రీకృష్ణుడు అదృశ్యమయ్యాడు.

వాల్మీకిమహర్షి హదధన్వుడితో ఇంకా ఇలా అన్నాడు. "ఓ రాజా! ఇప్పుడు నీ ప్రశ్నకు సమాధానం చెపుతాను. ఏ చిలుక నీకు అడవిలో సలహా ఇచ్చిందో అది ముందు జన్మలో నీ కుమారుడు శుకదేవుడు. శుకదేవుడు భగవంతుని కృపవల్ల ముక్తి పొందాడు కానీ నీ పట్ల జాలి కలిగివున్నాడు. నువ్వు ఈ భౌతిక ప్రపంచంలో చిక్కుకుని వుండడం చూచి, నీ బాధ్యతను అంటే పురుషోత్తముడైన శ్రీకృష్ణుణ్ణి వచ్చే పురుషోత్తమమాసంలో పూజించడం గుర్తు చేశాడు. దానివల్ల నీవు భగవత్సన్నిధిని చేరుకుంటావు".

హదధన్వ మహారాజు ఈ విధంగా అడిగాడు "ఓ మహర్షీ! శ్రీకృష్ణుడికి ఈ పురుషోత్తమమాసంలో దీపం వెలిగించడం వల్ల వచ్చే ఫలితం ఏమిటి? అప్పుడు వాల్మీకిమహర్షి ఉత్సాహంగా చెప్పడం మొదలుపెట్టాడు. "ఒకప్పుడు చిత్రభానుడు అనే రాజు భాగ్యనగరం పాలించేవాడు. అతడు గొప్ప కృష్ణభక్తుడు. అన్ని మంచి లక్షణాలు కలిగి వుండేవాడు. సత్యం, అహింస, క్షమ, దయ, పెద్దలపట్ల వినయం, గౌరవం, అన్ని శాస్త్రాల జ్ఞానం



తెలిసినవాడు. ఒకసారి అగస్త్యమహర్షి చిత్రభానుడి రాజభవనానికి వచ్చాడు. అపుడు రాజు ఆయనకు ఎంతో సాదరంగా గౌరవమర్యాదలు చేసి ఈ విధంగా చెప్పాడు. "ఓ మహర్షీ! మీ రాకతో నా జీవితలక్ష్యం నెరవేరింది. ఎందుకంటే మీ లాంటి కృష్ణభక్తుడు నా రాజ్యంలో అడుగు పెట్టారు". అప్పుడు రాజు అగస్త్యమహర్షిని తన పూర్వజన్మ గురించి అడగడం ప్రారంభించాడు. "ఓ మహర్షీ! నేను ఈ జన్మలో ఎంతో అదృష్టవంతుడిని మరియు అన్ని సుఖసంతోషాలు అనుభవిస్తూ భార్యాపిల్లలతో సంతోషంగా వున్నాను. నేను పూర్వజన్మలో ఎలాంటి పుణ్యకార్యాలు చేయడం వల్ల ఇలా వున్నానో వివరించండి". అపుడు అగస్త్యమహర్షి ఇలా చెప్పడం ప్రారంభించారు. "ఓ రాజా! నేను చెపుతాను జాగ్రత్తగా విను. పూర్వజన్మలో నీవు మణిగ్రీవుడు అనే వ్యక్తివి. నీవు పరమక్రూరుడివి, నాస్తికుడివి. కానీ నీ భార్య (ప్రస్తుత నీ భార్య) ఎంతో ధార్మికతతో పుణ్యవతి. ఆమె పతివ్రత, ఎల్లపుడూ నిన్ను సంతోషపెట్టడానికి ప్రయత్నించేది. నీ ప్రవర్తన వల్ల నిన్ను ప్రతి ఒక్కరూ అసహ్యించుకునేవారు. రాజు కూడా నీ సంపదనంతా తీసివేసుకున్నాడు. ఆ పరిస్థితుల్లో నీవు ఊరు వదలి అడవిలో నీ భార్యతో కలిసి జీవించడం ప్రారంభించావు. ఒకసారి నీవు ఆహారం కోసం వేటాడడానికి వెళుతుండగా దారిలో ఒక ఋషి ఉగ్రదేవుడు ప్రయాగతీర్థానికి వెళుతూ ఆహారం లేక ఎండవేడికి స్పృహతప్పి పడివున్నాడు. అతణ్ణి నీ కుటీరానికి తీసుకువచ్చి నీవు, నీ భార్య సపర్యలు చేశారు. కొంత సమయానికి ఋషికి మెలకువ రాగా ఆశ్చర్యంతో చూశాడు. అపుడు మణిగ్రీవుడు జరిగినదంతా వివరించాడు. చల్లటి మంచినీళ్ళు ఋషికి ఇవ్వగా, ఋషి ఎంతో సంతోషంతో స్వీకరించి వారి దీన పరిస్థితికి కారణం అడిగాడు. అప్పుడు మణిగ్రీవుడు పూర్వజీవితం గురించి వివరించి కష్టాలకు పరిష్కారం చూపమని అర్థించాడు. అంతా విన్న ఉగ్రదేవుడు "ఓ మణిగ్రీవా! నీవు ఈ ప్రపంచంలో కీర్తిమంతుడవు అవుతావు. ఎందుకంటే నీవు నాకు చక్కని ఆతిథ్యం ఇచ్చావు.

నీ కష్టాలన్నీ తొలగించడానికి నీకు ఒక సులభమైన దారి చూపిస్తాను. ఇంక ఒక నెల రోజుల తర్వాత పురుషోత్తమమాసం ప్రారంభం అవుతుంది. ఆ పురుషోత్తముణ్ణి సంతృప్తి పరచడానికి నీవు ప్రతిరోజూ ఒక దీపాన్ని భగవంతునికి అర్పించు. ఈ విధంగా చేయడంవల్ల నీ దురదృష్టం అంతా నశిస్తుంది. నేతి దీపం శ్రేష్ఠమైనది. కానీ నీవు అడవిలో జీవిస్తున్నావు కనుక నువ్వులనూనె దీపం అర్పించు. కానీ నీకు ధనం వచ్చాక నేతి దీపం వెలిగించు". ఈ విధంగా చెప్పి ఉగ్రదేవుడు హరినామాన్ని జపిస్తూ ప్రయాగ బయలుదేరాడు. తర్వాత మణిగ్రీవుడు ఋషి చెప్పినట్లుగా పురుషోత్తమ మాసంలో నూనె దీపం వెలిగించి పురుషోత్తముడైన శ్రీకృష్ణుడికి హారతిచ్చేవాడు. అలా మాసం అంతా చేశాడు. తర్వాత కొంతకాలానికి భార్యా, భర్తలు శరీరం విడిచాక స్వర్గలోకం చేరుకున్నారు. వారు పురుషోత్తమ మాసంలో శ్రీకృష్ణుడికి హారతి ఇవ్వడం వల్ల ఆ తర్వాత వేల సంవత్సరాలు అక్కడ స్వర్గసుఖాలు అనుభవించి తిరిగి ఈ జన్మలో చిత్రభానుడిగా జన్మించి రాజ్యసుఖాలు అనుభవిస్తున్నావు. ఇది నీ పూర్వజన్మ. ఓ రాజా! కేవలం పురుషోత్తమమాసంలో శ్రీకృష్ణుడికి దీపహారతి ఇవ్వడం వల్లనే ఇది సాధ్యమైంది. ఇందులో సందేహించాల్సిన అవసరం లేదు" అని అగస్త్యుడు ముగించాడు.

వాల్మీకి మహర్షి "ఈ విధంగా చిత్రభానుడికి వివరించి, అతని ద్వారా పూజలందుకున్న అగస్త్యమహర్షి ఎంతో సంతోషంతో తిరిగి వెళ్ళారు" అని ముగించాడు. ఈ విధంగా పురుషోత్తమ మాసం గురించి అంతా వివరించిన తర్వాత వాల్మీకిమహర్షి సరయూనది స్నానానికి వెళ్ళాడు. తర్వాత రాజు హదధన్వుడు తన రాజ్యానికి చేరుకుని ఎంతో నిరాడంబర జీవితం మొదలు పెట్టాడు. పురుషోత్తమ మాసం మొదలయ్యాక ఎంతో శ్రద్ధతో, వాల్మీకి మహర్షి చెప్పిన విధంగా రాజు, రాణి ఆచరించి పూర్తి చేశారు. పురుషోత్తమ మాసం పూర్తయిన వెంటనే వారు గోలోకం చేరుకున్నారు.



నారాయణుడు నారదుడికి ఇలా చెప్పడం ప్రారంభించారు. "ఓ నారదా! ఈ ప్రపంచంలో పురుషోత్తమమాసానికి సమానమైనది ఏదీ లేదు. వెయ్యి జన్మలు తీవ్రతపస్సు చేసినా కూడా వచ్చే ఫలితం ఒక పురుషోత్తమమాసం ఆచరించడంతో సమానం కాదు. దీనికి సంబంధించిన ఒక కోతి కథ వుంది. ఆ కోతి పురుషోత్తమమాసంలో కేవలం మూడు రోజులు పవిత్ర నదీస్నానం చేయడంవల్ల గోలోక ప్రాప్తి పొందింది. దాని కోటిజన్మల పాపాలు కూడా నశించిపోయాయి".

ఆ మాట విన్న నైమిశారణ్య ఋషులు, సూతమహర్షిని ఇలా ప్రశ్నించారు. "ఓ మహర్షీ! దయచేసి ఆ కోతి పూర్వజన్మ గురించి తెలియజేయండి. ఆ కోతి ఎవరు? ఎక్కడ, ఎలా పవిత్ర నదీస్నానం చేసింది పురుషోత్తమ మాసంలో? ఆ మాసంలో కోతి ఏమి తింటూ ఉండింది? తెలియకనే పురుషోత్తమ మాసాన్ని పాటించడం వల్ల అది ఎలాంటి ఫలితం పొందింది.

సూతుడు నారాయణుడు చెప్పింది గుర్తు చేసుకుంటూ, ఇలా చెప్పాడు "కేరళ రాష్ట్రంలో ఒక పిసినారి బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని పేరు చిత్రశర్మ. కానీ అతని పిసినారితనం, క్రూరత్వం వల్ల ప్రజలు అతణ్ణి కాదర్య (లోభి) అని పిలిచేవారు. గ్రామం నుంచి గెంటివేదయం వల్ల, అడవికి వెళ్ళిపోయాడు. అక్కడ ఒక పుణ్యాత్ముడైన తోటమాలితో స్నేహం చేశాడు. కొద్ది రోజులకు ఆ తోటమాలి తీర్థయాత్రలు చేయదలచి తన తోట చూసుకోమన్నాడు. ఆ కాదర్య, మంచి పండ్లన్నింటినీ తినివేశాడు. తోటమాలి తిరిగివచ్చి అడుగగా, కాదర్య కోతులు, పక్షులు వచ్చి తోటలోని పండ్లు తిని తోటను నాశనం చేశాయని చెప్పాడు. ఈ కారణం (మోసం) చేత అతడు చనిపోయాక కోతి శరీరాన్ని పొందాడు. అతడు అంత పాపాత్ముడైనప్పటికీ ఆ జన్మలో అతను కొంచెం పుణ్యం కూడా చేశాడు. అదేమిటంటే ఒక

వర్తకుడు, పురుషోత్తమమాసం ఆచరించి ఉద్యాపన చేశాడు. ఆ వర్తకుడు ఎంతో చక్కగా ఆ పవిత్రమాసాన్ని ఆచరించాడు. అతని నుంచి డబ్బు పొందాలనే ఆశతో ఈ కాదర్య కూడా పురుషోత్తమ మాసాన్ని ఆచరించాడు. కాబట్టి కోతి జన్మ అయినా "మృగతీర్థ" అనే పవిత్ర నది ఒడ్డున జన్మించాడు.

మృగతీర్థ చాలా అందమైన స్థలం. పండ్లు, పూలచెట్లతో నిండివుండేది. ఆ సరస్సులోని నీళ్ళు చల్లగా, తియ్యగా, ఆరోగ్యకరంగా వుండేవి. ఆ స్థలం అందమైనది, పవిత్రమైనది. ఎందువల్లనంటే అది రామచంద్రుడు వానరసేన సేవకు సంతోషించి అవి ఆనందించడానికి వాటికి కానుకగా ఇవ్వబడింది.

ఈ కోతి పుట్టినప్పటికి పిత్త సంబంధవ్యాధులతో బాధపడడం వల్ల ఏమీ తినలేకపోయేది. కానీ దాని జాతిలక్షణం మూలంగా పండ్లు తెంపి కొరికి పారవేసేది. కాలక్రమంలో ఒకసారి పురుషోత్తమమాసం మొదలైంది. ఆ కోతికి అపుడే జబ్బు ఎక్కువై నోటిలో నుండి రక్తం కారుతూ ఏమీ తినలేక ఆ నెల పూర్తిగా ఉపవాసం చేసింది. ఆ మాసంలోనే ఒకసారి ఒక చెట్టు మీద నుండి మరో చెట్టుకు ఎగురుతూ మృగతీర్థంలో పడిపోయింది. ఆ తర్వాత ఐదురోజులకు అది చనిపోయింది. అపుడు పుష్పక విమానం వచ్చి ఆ కోతిని గోలోకధామానికి తీసుకుపోయింది. అది చూసిన దేవతలు పురుషోత్తమ మాసాన్ని కీర్తించారు.

అంతా విన్న నారదమహర్షి నారాయణుడితో ఈ విధంగా పలికాడు "ఓ నారాయణా! నా మనస్సు, నా హృదయం పూర్తిగా సంతృప్తి చెందాయి. ఇంక ఆ విషయం గురించి ఎక్కువ తెలుసుకోనవసరం లేదు. నీకు జయము స్వామీ!" అని అదృశ్యమయ్యారు.

సూతమహర్షి అంతా వివరించాక నైమిశారణ్య ఋషుల నుండి అనుమతి తీసుకొని ఆయన కర్తవ్యం నిర్వర్తించడానికి గంగానదికి వెళ్ళారు.

# 1. ఉత్పన్న ఏకాదశి

## - మార్గశిరమాసం కృష్ణపక్షం

ఉత్పన్న ఏకాదశి మాహాత్మ్యము శ్రీకృష్ణార్జున సంవాద రూపమున భవిష్యోత్తర పురాణంలో వర్ణించబడింది. "శ్రీకృష్ణుని ద్వారా వర్ణితమైనట్టి ఈ ఏకాదశి వ్రతాన్ని మానవుడు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే లేదా దాని మహిమను, విధినియమాలను శ్రవణం చేస్తే ఈ జన్మలో సుఖమును పొంది తదుపరి జన్మలో విష్ణులోకాన్ని చేరుతాడు" అని శ్రీ సూతముని బ్రాహ్మణులతో, ఋషులతో చెప్పాడు.

"ఓ జనార్దనా! ఏకాదశిరోజున పూర్తి ఉపవాసం చేస్తే లేదా కేవలం రాత్రి మాత్రమే ఆహారం తీసికొంటే లేదా ఒక్కమారు మధ్యాహ్నం ఆహారం తీసికొంటే కలిగే లాభమేమిటో నాకు వివరించవలసినది" అని అర్జునుడు ఒకసారి శ్రీకృష్ణుని అడిగాడు.

దానికి సమాధానంగా శ్రీకృష్ణుడు ఇలా పలికాడు: "అర్జునా! శరదృతు ఆరంభంలోని ఏకాదశి, అంటే మార్గమాసం కృష్ణపక్ష ఏకాదశి రోజు ప్రొద్దుననే ఉపవాస వ్రతాన్ని చేపట్టాలి. స్నానం చేసే సమయంలో అతడు 'ఓ అశ్వక్రాంతే! ఓ రథక్రాంతే! ఓ విష్ణుక్రాంతే! ఓ వసుంధరే! ఓ మృత్తికే! ఓ ధరణీ! నేను పరమగతిని పొందులాగున నా పూర్వజన్మల పాపములన్నింటిని నశింపజేయుడు' అని ప్రార్థించాలి. స్నానానంతరం అతడు గోవిందుని పూజించాలి".

"ఒకసారి స్వర్గరాజగు ఇంద్రుడు దేవతలతో కలిసి భగవంతుని దగ్గరకు వెళ్ళి ఈ విధంగా ప్రార్థించాడు. 'ఓ జగదీశ్వరా! దేవదేవా! నీకు వందనములు. నీవే ఎల్లరకు పరమాశ్రయుడవు, తల్లివి, తండ్రివి, నీవే ఎల్లరను సృజించి,

పోషించి, లయింపజేయుదువు. భూమికి, ఆకాశానికి, సమస్త సృష్టికి నీవే పరమోపకారివి. నీవే స్వయంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడవై యున్నావు. నీవే సమస్త యజ్ఞములకు, తపస్సులకు, మంత్రాలకు, యజ్ఞకర్తలకు భోక్తవు. నీకు చెందనిది, నీచే నియంత్రించబడనిది ఈ ముల్లోకములలో ఏదీ లేదు. ఓ దేవా! భగవంతా! దేవతాప్రభూ! శరణాగత రక్షకా! ఓ యోగేశ్వరా! మేము ఇపుడు స్వర్గాన్ని కోల్పోయి రాక్షసులచే తరిమివేయబడినాము. భీతితో నీ పాదపద్మాలకు శరణాగతులమైన మమ్ము ఇప్పుడు రక్షించవలసినది. ఓ జగదీశ్వరా! స్వర్గం నుండి ఇపుడు భూలోకంనకు పతనం చెంది మేము దుఃఖసాగరంలో మునిగియున్నాం. దయచేసి మా యెడ ప్రసన్నుడవగుము".

"ఇంద్రుని అట్టి దయనీయమైన ప్రార్థనను వినిన విష్ణుభగవానుడు అతనితో 'దేవతలనే ఓడించినట్టి ఆ అజేయుడగు దానవుడెవ్వడు? వాడి పేరేమిటి? వాడి శక్తికి మూలమేమిటి? ఇంద్రా! దీనినంతటిని నిర్భయుడవై నాకు వివరించు' అని అన్నాడు.

"అపుడు ఇంద్రుడు సమాధానమొసగుచూ 'ఓ దేవదేవా! భక్తోద్ధారకా! పరమప్రభూ! ఆ ఉగ్రదానవుని పేరు నదిజంఘుడు.దేవతలకు తొలుత కష్టమును కలిగించిన ఆ అసురుడు బ్రాహ్మణ కులములో జన్మించాడు. వాడికి సమాన బలశాలియైన మురుడను పుత్రుడున్నాడు. చంద్రావతీ నగరం మురునికి రాజధాని. ఈ మురాసురుడే దేవతలను స్వర్గం నుండి తరిమివేసి తానే అచట నివసిస్తున్నాడు. ఇంద్రుడు, అగ్ని, వాయువు, యముడు, చంద్రుడు, నిర్ఋతి, వరుణుడు మున్నగు దేవతల పదవులను వాడే ఆక్రమించినాడు. మేమందరం కలిసి కూడ వాడిని జయింపలేక పోయితిమి. కనుక ఓ విష్ణూ! ఆ అసురుని సంహరించి దేవతలను కాపాడవలసినది' అని అన్నాడు."



"ఇంద్రుని పలుకులను వినిన భగవానుడు దేవతలను పీడించినట్టి ఆ అసురుల పట్ల క్రుద్ధుడై అతనితో 'ఓ దేవరాజా! నీ శత్రువైన ఆ అసురుని నేను స్వయంగా వధిస్తాను. ఇపుడు మీరందరు చంద్రావతి నగరానికి బయలుదేరండి' అని అన్నాడు. అపుడు దేవతలందరు విష్ణుభగవానుని నాయకత్వంలో చంద్రావతి నగరానికి బయలుదేరారు. ఒక ప్రక్క దేవతలు తమ చెంత ఉన్నట్టి వేలకొలది ఆయుధాలతో యుద్ధసన్నద్ధులు అవుతుండగా, వేరొక ప్రక్క అసంఖ్యాక అసురసేనాపరివృత్తుడై మురాసురుడు గర్జించ సాగాడు."

దానవులచే తీవ్రంగా దెబ్బతిని అదివరకే దేవతలు చెల్లాచెదురై యున్నారు. కాని ఇపుడు దేవదేవునిచే నడుపబడుచు దేవతలు నిర్భీతిగా తమ ఎదుట నిలబడుటను చూసి దానవులకు తీవ్రమైన క్రోధం కలిగింది. ఇతర దానవులను ఓడించడం భగవానునికి సులభమే అయినప్పటికిని మురాసురుని ఓడించడం మాత్రం అతనికి కష్టతరమైంది. ఎన్ని ఆయుధములను ప్రయోగించినప్పటికిని మురాసురుని వధించడం సాధ్యపడకపోయేసరికి భగవానుడు ఆ దానవునితో ముష్టియుద్ధానికి దిగి పదివేలసంవత్సరాలు పోరాడాడు. చివరకు భగవానుడు ఆ అసురుని ఓడించి బదరికాశ్రమానికి వెళ్ళాడు. బదరికాశ్రమములో భగవానుడు హేమవతి అనే సుందరమైన గుహలో ప్రవేశించి విశ్రాంతి తీసికొన్నాడు.

"ఓ అర్జునా! తదనంతరం ఆ దానవుడు నన్ను వెంబడించి గుహలో ప్రవేశించాడు. అచట విశ్రాంతి తీసికొంటున్న నన్ను చూసి అతడు చంపడానికి సన్నద్ధుడయ్యాడు. అపుడు దేదీప్యమానమైన దేవి నా శరీరం నుండి ఉత్పన్నమై, నానావిధములైన దివ్యాయుధములను కలిగినదై ఆ

అసురునితో పోరాడడం మొదలుపెట్టింది. దీర్ఘకాలం యుద్ధం చేసిన తరువాత ఆ దేవి చివరకు అసురుని శిరస్సును ఖండించివేసింది. అపుడు మిగిలిన అసురులు భయంతో పాతాళలోకానికి పారిపోయారు". విశ్రాంతి నుండి మేల్కొనిన భగవంతుడు తన ఎదుట మురాసురుడు మృతి చెందిపడి యుండడాన్ని, తేజోమయురాలైన దేవి ముకుళితహస్తయై ఎదుట నిలబడి ఉండడాన్ని గమనించి ఆశ్చర్యంతో "నీవెవరు?" అని ఆమెను ప్రశ్నించాడు.

"దేవా! నేను నీ దేహం నుండి ఉత్పన్నమై ఈ అసురుని వధించాను. నీవు విశ్రమించి ఉండడాన్ని చూసి ఈ అసురుడు నిన్ను వధించడానికి యత్నించాడు. కనుకనే నేను వీడిని వధించాను" అని దేవి పలికింది.

అపుడు భగవంతుడు ఆమెతో "దేవీ! ఈ కార్యానికి నీ పట్ల నేనెంతో ప్రసన్నుడనైనాను. నీకు వాంఛితమైనది కోరుకో" అని అన్నాడు. అపుడు ఆమె ఏదేని వరమును ఇవ్వమని అడుగగా భగవానుడు ప్రసన్నతతో "దేవీ! నీవు నా శక్తివి. నీవు ఏకాదశిరోజు ఉత్పన్నమైతివి కాబట్టి ఇకపై నీ పేరు ఏకాదశి. ఏకాదశి వ్రతాన్ని పాటించే ఎవ్వడైనా సరే సమస్త పాపదూరుడై నాశనం లేనట్టి స్వర్గసౌఖ్యాలను పొందుతాడు" అని అన్నాడు.

"ఆనాటి నుండి ఏకాదశి ఈ జగత్తులో చక్కగా పోషింపబడుచు పూజింపబడుచున్నది. ఓ అర్జునా! ఏకాదశి వ్రతాన్ని పాటించేవానికి నేను పరమగతిని ప్రసాదిస్తాను. ఓ కౌంతేయా! ద్వాదశితో కలిసిన ఏకాదశి ఎంతో ఉత్కృష్టమైంది. ఏకాదశిరోజు మనుజుడు మైథునభోగాన్ని త్యజించాలి; ధాన్యాన్ని, తేనెను, భోజనం విడిచిపెట్టాలి. నూనె రాసుకోకూడదు. ఈ ఏకాదశిని మనిషి పాటించినచో, దీని మాహాత్మ్యాన్ని వినినచో మరిన్ని ఉన్నతమైన ఫలితాలను పొందుతాడు".

## 2. మోక్షద ఏకాదశి

### - మార్గశిరమాసం శుక్లపక్షం

మోక్షద ఏకాదశి మార్గశిర మాసం శుక్లపక్షంలో వస్తుంది. ఈ ఏకాదశి మాహాత్మ్యం శ్రీకృష్ణ ధర్మరాజుల సంవాదరూపంలో బ్రహ్మాండ పురాణంలో వర్ణించబడింది.

"కృష్ణా! మార్గశిరమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి? ఆ ఏకాదశిని పాటించే పద్ధతిని నాకు వివరించవలసినది" అని ధర్మరాజు ఒకసారి శ్రీకృష్ణుని అడిగాడు.

దానికి బదులుగా శ్రీకృష్ణుడు ఇలా చెప్పసాగాడు. "ఓ రాజశ్రేష్ఠుడా! ఈ ఏకాదశి సమస్త పాపాలను నశింపజేస్తుంది. ఆ రోజున భగవానుని తులసీమంజరులతో పూజిస్తే ఆ దేవదేవుడు అతి ప్రసన్నుడౌతాడు. ఈ ఏకాదశిని చేయడం ద్వారా వాజపేయ యజ్ఞనిర్వహణ ఫలం కలుగుతుంది."

"వైఖానసుడనే రాజు చంపకనగరాన్ని పాలించేవాడు, ఆ రాజు ప్రజల పట్ల ఎంతో అనురాగం చూపించేవాడు. వేదజ్ఞానపారంగతులైన ఎందరో బ్రాహ్మణులు అతని రాజ్యంలో జీవించేవారు. తన తండ్రి నరకంలో పడి అక్కడ దుఃఖాలను అనుభవిస్తున్నట్లు ఆ రాజుకు ఒక రోజు కల వచ్చింది. అది చూసిన రాజు దిగ్భ్రాంతి చెందాడు. మర్నాడు అతడు బ్రాహ్మణుల సభలో తన కలను వెల్లడించాడు. నారకీయస్థితి నుండి తనను ఉద్ధరించమని తన తండ్రి అర్థించినట్లుగా కూడ రాజు వారికి తెలియజేశాడు. ఆ కల గనిన నాటి నుండి రాజు శాంతిని కోల్పోయాడు. రాజ్యపాలనలో ఎటువంటి సుఖంగాని, అభిరుచి గాని అతనికి కనబడలేదు. చివరకు కుటుంబ సభ్యులతో కూడ అతడు ఉదాసీనంగా వ్యవహరించసాగాడు. తండ్రి నరకంలో

కష్టాలుపడుతుంటే, పుత్రునియొక్క జీవితం, రాజ్యం, సంపద, బలం, ప్రభావము అన్నీ వ్యర్థమేనని అతడు తలచాడు. అందువలన అతడు తన తండ్రిని నరకబంధం నుండి బయటపడే మార్గాన్ని తెలుపుమని బ్రాహ్మణులను ప్రార్థించాడు."

అది వినిన బ్రాహ్మణులు రాజుతో ఇలా అన్నారు. "రాజా! ఇక్కడకు దగ్గరలోనే పర్వతముని ఆశ్రమం ఉన్నది. అతడు త్రికాలజ్ఞుడు. నీ స్వప్న వృత్తాంతాన్ని ఆయనకు తెలపండి."

వారి సలహాను వినిన వైఖానసుడు బ్రాహ్మణులతోను, ప్రజలతోను కూడినవాడై పర్వతముని ఆశ్రమానికి వెళ్ళాడు. రాజ్యక్షేమం గురించి పర్వతముని రాజును అడిగినంతట వైఖానసుడు ఆయనతో "స్వామీ! మీ అనుగ్రహం చేత మేమంతా కుశలమే. కాని రాజ్యసంపదలు ఉన్నప్పటికిని నేను గొప్ప కష్టంలో చిక్కుకున్నాను. నిజానికి నా మనస్సులో ఒక గొప్ప సందేహం చేలరేగింది. దానిని తీర్చుకోవడానికే మీ పాదపద్మాల చెంతకు వచ్చాను" అని అన్నాడు.

రాజు వలన సమస్త వివరాలను వినిన పర్వతముని సమాధిమగ్ను డయ్యాడు. తరువాత కొంతసేపటికి ఆయన ధ్యానం నుంచి మేల్కొని రాజుతో "రాజా! నీ తండ్రి గతజన్మలో అతికాముకుడైనందున నరకంలో పడినాడు. కనుక మార్గశిరమాసంలోని శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని మీరందరు ఖచ్చితంగా పాటించి ఆ పుణ్యాన్ని అతనికి ధారపోయాలి. మీ అందరి పుణ్యప్రభావం చేత అతడు నరకం నుండి బయటపడతాడు" అని అన్నాడు. పర్వతముని పలుకులను వినిన తరువాత రాజు తన పరివారంతో పురానికి తిరిగివచ్చాడు.



అటుపిమ్మట రాజు తన భార్యాపుత్రులతోను, అనుయాయులతోను కలిసి మార్గశిరమాసంలోని శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని విధిగా నిర్వహించి ఆ పుణ్యాన్నంతా తన తండ్రికి ధారపోసాడు. ఆ పుణ్యప్రభావం చేత అతని తండ్రికి స్వర్గప్రాప్తి కలిగి పుత్రుని ఎంతో దీవించాడు.

"కనుక ఓ రాజా! ఈ మోక్షద ఏకాదశిని యథావిధిగా పాటించేవాడు నిక్కముగా సమస్త పాపాల నుండి బయటపడతాడు," అని కృష్ణుడు ధర్మరాజుకు తెలిపాడు.

* * *

# 3. సఫల ఏకాదశి

**- పుష్యమాసం కృష్ణపక్షం**

సఫల ఏకాదశి పుష్యమాసకృష్ణపక్షంలో వస్తుంది. ఈ ఏకాదశి మాహాత్మ్యం శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంలో బ్రహ్మాండపురాణము నందు వర్ణించబడింది.

"కృష్ణా! పుష్యమాస కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి? దానిని ఏ విధంగా పాటించాలి. దయచేసి దీనిని నాకు వివరంగా చెప్పవలసినది" అని ధర్మరాజు అడిగాడు.

ఈ ప్రశ్నకు దేవదేవుడైన శ్రీకృష్ణుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు: "భరతవంశశ్రేష్ఠుడా! సర్పములలో శేషుడు ఉత్తముడైనట్లు, పక్షులలో గరుడుడు శ్రేష్ఠుడు అయినట్లు, యజ్ఞములలో అశ్వమేధయజ్ఞం శ్రేష్ఠమైనట్లు, నదులలో గంగానది ఉత్తమమైనట్లు, నరులలో బ్రాహ్మణుడు శ్రేష్ఠమైనట్లు, వ్రతములలో కెల్ల ఏకాదశి వ్రతము సర్వోత్కృష్టమైనది. రాజోత్తమా! ఏకాదశి వ్రతపాలనం చేసేవాడు నాకు ఎంతో ప్రియమైనవాడు, ఐదువేలసంవత్సరముల తపస్సు వలన కలిగే పుణ్యరాశి కేవలం ఏకాదశివ్రతపాలన వలన సిద్ధిస్తుంది."

మహిష్మతుడనే సుప్రసిద్ధుడైన రాజు చంపవతిపురాన్ని పాలించేవాడు. ఆ రాజుకు నలుగురు పుత్రులు. వారిలో జ్యేష్ఠుడైన లుంపకుడు పరమపాపి. బ్రాహ్మణులను, వైష్ణవులను, దేవతలను సదా నిందించే స్వభావం కల్గిన లుంపకుడు జూదం, వ్యభిచారం పట్ల ఆసక్తుడై ఉండేవాడు. అందువలన రాజు అతనిని దేశబహిష్కరణ జేశాడు. అపుడు లుంపకుడు అడవిలో నివసిస్తూ రాత్రివేళలలో తన తండ్రి రాజ్యంలోని ప్రజల ధనమును కొల్లగొట్టేవాడు. ఆ విధంగా అతడు ధనమును కొల్లగొట్టినప్పటికిని రాజు కుమారుడని భావించి జనులు అతనిని విడిచి పెట్టేవారు. లుంపకుడు పచ్చిమాంసం తింటూ జీవనాన్ని గడపసాగాడు.



అతడు ఉన్నట్టి అడవిలో ఒక అశ్వత్థవృక్షం ఉన్నది. అది దేవతల వలె పూజనీయమైనది. లుంపకుడు ఆ చెట్టు క్రింద కొంతకాలం జీవించాడు. అతడు ఆ విధంగా జీవించే సమయంలో కాకతాళీయంగా మార్గశిరకృష్ణపక్ష ఏకాదశి వచ్చింది. అలసట, దుర్బలత కారణంగా అతడు ఏకాదశికి ముందు రోజు స్పృహ తప్పినవాడై ఏకాదశిరోజు మధ్యాహ్నవేళకు తిరిగి స్పృహను పొందాడు. ఆకలిపీడితుడై అతడు ఎంతగా బలహీనుడయ్యాడంటే ఆ రోజు అతడు జంతువులను చంపే అవకాశమే కలుగలేదు. అందువలన అతడు కొన్ని పండ్లనుఏరుకొని విష్ణువుకుసమర్పించాడు. ఇంతలో సూర్యాస్తమయం అయింది. అనుకోకుండా ఆ రాత్రి అతడు జాగరణ చేశాడు.

ఉపవాసం, జాగరణ ఫలంగా అతడు సఫల ఏకాదశి వ్రతపాలనం చేసినట్లు అయింది. సాధకుడు చేసే ఈ వ్రతపాలనను మధుసూదనుడు చక్కగా స్వీకరిస్తాడు. ఈ ఏకాదశీవ్రతపాలనఫలంగా లుంపకునికి ఐశ్వర్యయుత మైన రాజ్యం సంప్రాప్తించింది. మర్నాడు ప్రొద్దున ఒక దివ్యమైన అశ్వం అతని ముందు నిలబడింది. ఆ సమయంలో ఒక అశరీరవాణి "రాకుమారా! మధుసూదనుని కృప వలన, సఫల ఏకాదశీ ప్రభావం వలన నీకిపుడు రాజ్యం లభిస్తుంది. నీవు దానిని ఎటువంటి కష్టాలు లేకుండ పాలించ గలుగుతావు. కాబట్టి నీవు నీ తండ్రి చెంతకు వెళ్ళి రాజ్యాన్ని అనుభవించు" అని పలికింది. ఆ ఆదేశం ప్రకారం లుంపకుడు తండ్రి చెంతకు వెళ్ళి రాజ్యభారాన్ని స్వీకరించాడు. తదనంతరం అతడు ఉత్తమమైన భార్యను పొంది పుత్రవంతుడయ్యాడు. ఈ ప్రకారం అతడు ఆనందంగా రాజ్యపాలనం చేసాడు.

సఫల ఏకాదశి పాటించడం ద్వారా మనిషి ప్రస్తుత జన్మలో యశస్సును బడసి, తదుపరి జన్మలో ముక్తిని పొందుతాడు. ఈ ఏకాదశి చేసేవారు ధన్యులు. ఈ ఏకాదశి పాటించడం వలన అశ్వమేధ యజ్ఞఫలం లభిస్తుంది.

* * *

# 4. పుత్రద ఏకాదశి

**- పుష్యమాస శుక్లపక్షం**

పుష్యమాసంలోని శుక్లపక్షంలో వచ్చే పుత్రద ఏకాదశీమహిమ శ్రీకృష్ణధర్మరాజ సంవాదరూపంలో భవిష్యోత్తరపురాణంలో వర్ణించబడింది.

ఒకసారి శ్రీకృష్ణుడు ధర్మరాజుతో "రాజా! పుష్యమాసంలోని శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరు పుత్రద ఏకాదశి. ఆ ఏకాదశిని పాటించడం ద్వారా మనిషి యొక్క సర్వపాపాలు నశిస్తాయి. ఆ ఏకాదశి వ్రతపాలనం ద్వారా జనులు పండితులై యశస్సును పొందుతారు. మంగళకరమైన ఏకాదశీ మహిమను ఇపుడు విను" అని అన్నాడు.

భద్రావతిపురంలో సుకేతుమానుడనే రాజు రాజ్యపాలన చేస్తుండేవాడు. అతని రాణి పేరు శైబ్య. పుత్రుడు లేకపోవడం వలన రాజు, రాణి ఇద్దరు కూడ దుఃఖంతో జీవితాన్ని గడిపారు. తమకాలంలో అధికభాగాన్ని వారు ధర్మకార్యాలలోనే గడిపేవారు. కాని వారు శోకతప్తులు కావడం వలన పితృతర్పణ కార్యంలో వారు వదలిన తర్పణాలు వేడిగా గోచరించాయి. సుకేతుమానుని తరువాత తమకు తర్పణాలు వదిలేవారే లేరని తలచి ఆ పితృదేవతలు కూడ దుఃఖించసాగారు. తన పితృదేవతల దుఃఖాన్ని చూసి రాజు మరింత విచారగ్రస్తుడయ్యాడు. మిత్రులు, హితులు, అమాత్యుల సాంగత్యం అతనికి ఏమాత్రం రుచించలేదు. విచారంలోను, నిరాశలోను మునిగిన ఆ రాజు పుత్రరహితమైన మానవజన్మ వ్యర్థమని భావించాడు. పుత్రుడు లేకపోతే దేవఋణం, పితృఋణం, జీవఋణం తీర్చుకొనడం అసాధ్యం. పుణ్యరాశులు లేనిదే, విష్ణుభక్తి లేనిదే ఎవ్వడును పుత్రులను, ధనాన్ని, జ్ఞానాన్ని పొందలేడు. ఈ రీతిగా నిర్ణయించినవాడై రాజు రహస్యంగా గుఱ్ఱంపై అడవికి వెళ్ళాడు.



పశుపక్షిభరితమైన అరణ్యంలో ప్రవేశించిన సుకేతుమానుడు విశ్రాంతి తీసికొనే ప్రదేశం కొరకు వెదుకసాగాడు. అపుడు ఆ దట్టమైన అరణ్యంలో రాజుకు అశ్వత్థము, పిప్పలము, చింత, ఖర్జూర, శాల, శలపర్ణ, తమాల, అర్జునాది వృక్షాలు కనిపించాయి. పెద్దపులులు, సింహాలు, అడవి ఏనుగులు, జింకలు, అడవి పందులు, కోతులు పాములు, చిరుతలు, కుందేళ్ళ వంటివి అక్కడ గోచరించాయి. దానితో విశ్రాంతికి బదులు అతడు అడవి అంతట తిరగనారంభించాడు. నక్కల ఊళలు, గుడ్లగూబల కూతలు విని రాజు భయకంపితుడై ఆశ్చర్యపడ్డాడు. ఈ విధంగా అన్ని దిక్కులలో తిరుగుతూ ఆ రాజు అతి తొందరలోనే అలసిపోయాడు. మధ్యాహ్నవేళకు అతడు తీవ్రమైన దప్పికకు గురయ్యాడు. పూజల ద్వారా యజ్ఞాల ద్వారా దేవతలను ప్రసన్నులను చేసినప్పటికిని, ప్రజలను కన్నబిడ్డల వలె పోషించినప్పటికిని, భోజన దక్షిణలతో బ్రాహ్మణులను సంతృప్తిపరచినప్పటికిని తాను ఈ రోజు ఇట్లు కష్టముల పాలైనట్లు రాజు భావించాడు. ఈ విధంగా ఆలోచిస్తూ అతడు అటు ఇటు తిరగసాగాడు. అకస్మాత్తుగా అతనికి కలువలతో నిండిన మానససరోవరంలాగా ఉన్నట్టి ఒక సరోవరం కనిపించింది. హంసలు, చక్రవాకాలు, చకోరాలు ఆ సరోవరజలంలో విహరిస్తున్నాయి. కొందరు మునులు ఆ సరోవరతటంలో వేదమంత్రాలను ఉచ్చరించడం చూసిన ఆ రాజు గుఱ్ఱం మీద నుండి దిగి వారిలో ప్రతియొక్కరికి నమస్కరించాడు. రాజు యొక్క నడవడికి ప్రసన్నులైన ఆ మునులు అతనితో "రాజా! మేము మీ పట్ల ప్రసన్నులమైనాము ఏదైనా వరము కోరుకో" అని అన్నారు.

అపుడు రాజు వారిని గురించి ప్రశ్నించాడు. వారందరు ఎందులకు ఈ సరోవరంలో ఉన్నారని అడిగాడు. ఆ ప్రశ్నకు బదులుగా మునులు అతనితో "రాజా! మేము విశ్వేదేవులము. స్నానం చేయడానికి ఇక్కడకు

వచ్చాము. ఈ రోజు పవిత్రమైన పుత్రద ఏకాదశి. పుత్రవాంఛితుడైన వ్యక్తి ఈ వ్రతాన్ని పాటిస్తే నిశ్చయంగా అతనికి పుత్రోదయం కలుగుతుంది" అని అన్నారు. పుత్రప్రాప్తికై తానింతవరకు ఎంతో ప్రయత్నించానని, కాని నేటివరకు ఏదీ కూడ సఫలం కాలేదని రాజు అన్నాడు. తన పట్ల మునులందరు ప్రసన్నులైనారు కనుక తనకొక పుత్రుని ప్రసాదించమని రాజు వారిని అర్థించాడు. అపుడు వారు అతనితో "రాజా! ఈ రోజు పుత్రద ఏకాదశి. ఈ వ్రతాన్ని శ్రద్ధతో పాటించు. భగవత్కరుణతోను, మా ఆశీర్వాదంతోను నీకు పుత్రుడు ఉదయిస్తాడు" అని దీవించారు.

మునుల ఆదేశానుసారం రాజు పరమమంగళకరమైన పుత్రద ఏకాదశి వ్రతాన్ని ఆచరించాడు. మర్నాడు ఉపవాసమును పూర్తిచేసి, పారణ కావించి మునులకు పదే పదే వందనం చేసి తన పురానికి వెళ్ళిపోయాడు.

కాలక్రమంలో శైబ్యగర్భవతి అయింది. మునుల ఆశీర్వాదం వలన, పుత్రదఏకాదశీవ్రతపాలన ప్రభావం వలన రాజుకు తేజోమయుడైన పుత్రుడు ఉదయించాడు. తరువాత రాజు ఆనందంతో రాజ్యపాలన చేశాడు. అతని పితృదేవతలు కూడ సంతృప్తి చెందారు. "ధర్మరాజా! ఈ పుత్రద ఏకాదశీ వ్రతం చేయడం ద్వారా మనిషి పుత్రుని బడసి స్వర్గాదిలోకాలను కూడ పొందుతాడు" అని శ్రీకృష్ణుడు అన్నాడు.

ఈ ఏకాదశి మహిమను వినినవాడు, కీర్తించినవాడు నిక్కముగా అశ్వమేధ యజ్ఞఫలాన్ని పొందుతాడు.

* * *

# 5. షట్తిల ఏకాదశి

## - మాఘమాసం కృష్ణపక్షం

ఈ షట్తిల ఏకాదశి మాఘమాసం కృష్ణపక్షంలో వస్తుంది. దీని మహిమ భవిష్యపురాణంలో వర్ణించబడింది. ఒకసారి దాల్భ్యఋషి పులస్త్యునితో "ఓ బ్రాహ్మణోత్తమా! మర్త్యలోకంలో జనులు బ్రాహ్మణహత్య, ఇంద్రియభోగం వంటి నానారకాలైన పాపాలలో నెలకొని ఉన్నారు. పాపఫలంగా వారికి కలిగే నారకీయపరిస్థితుల నుండి వారు ఏ విధంగా బయటపడగలరో నాకు వివరించండి" అని అడిగాడు. అపుడు పులస్త్యుడు దానికిసమాధానంగా "మహాభాగా! మాఘమాసం కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశిరోజు మనిషి నిర్మల చిత్తంతో భగవంతుని అర్చించాలి" అని చెప్పడం మొదలుపెట్టాడు.

ఆ విధంగా అర్చించే సమయంలో అతడు స్వామిని ఇలా ప్రార్థించాడు. "జనార్దనా! పరమ కరుణామయుడవైన శ్రీకృష్ణా! నీవు పాపులను ఉద్ధరించేవాడివి. అవిద్యాసాగరంలో మునిగిపోయే వారి పట్ల కరుణను చూపించు. ఓ పరబ్రహ్మమా! దేవదేవా! జగదీశ్వరా! లక్ష్మీసహితునిగా నీవు నా అర్చనను స్వీకరించు".

"తరువాత గొడుగు, వస్త్రం, పాదరక్షలు, నీటి కుండను దానమిచ్చి బ్రాహ్మణులను పూజించాలి. శక్త్యనుసారం నల్లగోవులను, నువ్వులను (తిలలను) ఉత్తమ బ్రాహ్మణులకు దానమివ్వాలి. తిలలను దానమివ్వడం ద్వారా మనిషి అనేకానేక సంవత్సరాలు స్వర్గవాసాన్ని పొందుతాడు".

"ఈ ఏకాదశి రోజున మనిషి తిలలు కలిపిన నీళ్ళతో స్నానం చేయాలి, నువ్వుల పలుచని ముద్దను శరీరానికి రాసుకోవాలి, నువ్వులతో యజ్ఞం చేయాలి. పితృదేవతలకు తిలోదకాలు ఇవ్వాలి, నువ్వులను తినాలి, నువ్వులను

దానం చేయాలి. ఈ విధంగా చేయడం ద్వారా అన్ని పాపాలు తొలగిపోతాయి. అందుకే ఈ ఏకాదశికి షట్తిల ఏకాదశి అనే పేరు వచ్చింది".

షట్తిల ఏకాదశీ మహిమను, దానిని పాటించడం వలన కలిగే లాభాన్ని వినగోరినపుడు శ్రీకృష్ణుడు ఒక కథను నారదమునికి చెప్పాడు. అది ఈ విధంగా ఉన్నది. అతిపురాతన కాలంలో ఒక బ్రాహ్మణవనిత ఉండేది. కఠోరమైన బ్రహ్మచర్య వ్రతంతో ఆమె దేవదేవుని సేవలో నెలకొన్నది. భగవత్సేవలో నిరంతరం అనేక రకములైన వ్రతాలను చేస్తూ ఆమె బక్కచిక్కి పోయింది. నిరుపేదబ్రాహ్మణులకు, అవివాహితకన్యలకు దానమిచ్చినప్పటికిని అన్నదానం ద్వారా బ్రాహ్మణులను, దేవతలను ఆమె సంతృప్తిపరచలేదు. అనేకమైన కఠోరమగు తపస్సులను చేయడం వలన దేహము చిక్కిపోయి నప్పటికిని ఈ బ్రాహ్మణ వనిత నిజంగా పవిత్రాత్మురాలే; ఆకలిగొన్న జనులకు ఈమె అన్నదానం చేయలేదు' అని నేను భావించాను. ఓ బ్రాహ్మణోత్తమా! ఆమెను పరీక్షించాలని తలచి నేను భూలోకంలోకి భిక్షుకుని వేషంలో వెళ్ళాను. భిక్షాపాత్రలో భిక్షను అడుగుతూ నెమ్మదిగా నేను ఆ బ్రాహ్మణవనిత ఇంటికి చేరాను.

అపుడు బ్రాహ్మణవనిత నాతో "ఓ బ్రాహ్మణా! నీవెక్కడ నుండి వచ్చావు?" అని అడిగింది. నేను ఆమె మాటలను విననట్లుగా నటిస్తూ మళ్ళీ భిక్షమడిగాను. దానితో ఆమెకు కోపం వచ్చి పిడికెడు మట్టిని తీసి నా భిక్షపాత్రలో వేసింది. తరువాత నేను నా ధామానికి వచ్చేసాను. ఆ బ్రాహ్మణవనిత కూడ తన తీవ్రతపః ఫలితంగా నా లోకానికి చేరుకుంది. అక్కడ భవ్యమైన భవంతిని పొందినప్పటికిని నాకు మట్టిని దానం చేసిన కారణంగా ఆమె ఇంట్లో అన్నం గాని, ధనంగాని లేకుండా పోయాయి. ఓ బ్రాహ్మణా! ఆ భవంతిలో ఆమెకు ఏమీ కనిపించలేదు. సంపత్తులు లేని



కారణంగా ఆమె కలవరపడింది. అపుడు ఆమె కోపంగా నా దగ్గరకు వచ్చి "జనార్దనా! నేను ఎన్నో వ్రతాలు, తపస్సులు చేశాను. విష్ణువును ఆరాధించాను. అయితే నాకు సంపత్తులు ఎందుకు లోపించాయి?" అని ప్రశ్నించింది.

అపుడు నేను ఆమెతో "బ్రాహ్మణీ! నీవు భూలోకం నుండి ఇక్కడకు వచ్చావు. ఇపుడు ఇంటికి వెళ్ళు. కొందరు వనితలు నిన్ను చూడడానికి నీ ఇంటికి వస్తారు. షట్తిల ఏకాదశి మాహాత్మ్యాన్ని వారి నుండి విను. వారు దానిని గురించి పూర్తిగా చెప్పేంతవరకు తలుపులు తీయకు" అని అన్నాను. నా మాట విని ఆమె వెళ్ళిపోయింది.

ఒకరోజు బ్రాహ్మణి తన ఇంట్లో కూర్చుని యున్న సమయంలో దేవతా వనితలు వచ్చి "ఓ సుందరీ! మేము మీ దర్శనానికై వచ్చాం. దయచేసి తలుపుతీయి" అని అన్నారు. అపుడు ఆమె వారితో "మీరు నన్ను చూడాలనుకుంటే షట్తిల ఏకాదశీమహిమను నాకు చెప్పండి. అప్పటిదాకా నేను తలుపులు తీయను" అని అన్నది. అపుడు దేవతావనితలు షట్తిల ఏకాదశీ మహిమలను ఘనంగా వర్ణించారు. ఆ వర్ణనను వినిన తరువాత బ్రాహ్మణి సంతృప్తి చెంది తలుపులు తీసింది.

"ఆ దేవతావనితల ఆదేశం మేరకు బ్రాహ్మణి షట్తిల ఏకాదశీ వ్రతపాలనం చేసింది. దానితో ఆమె అతి సౌందర్యవతి, తేజస్వి, ధనధాన్య కనక సంపత్తులు కలిగినది అయింది. కానీ లోభంతో ఎవ్వరూ ఈ ఏకాదశిని పాటించకూడదు. ఈ ఏకాదశీ వ్రతపాలన చేత మనిషి దుర్భాగ్యం, బీదరికం నశిస్తాయి. ఈ ఏకాదశీరోజు నువ్వులను దానం చేసినవాడు సమస్త పాపవిముక్తుడౌతాడు".

* * *

# 6. జయ ఏకాదశి

**- మాఘమాసం శుక్లపక్షం**

మాఘమాసం శుక్లపక్షంలో వచ్చే జయ ఏకాదశీ లేదా భైమీ ఏకాదశి మహిమ శ్రీకృష్ణ ధర్మరాజుల సంవాదరూపంగా భవిష్యోత్తర పురాణంలో వర్ణింపబడింది.

ఒకసారి ధర్మరాజు శ్రీకృష్ణుని సంబోధిస్తూ "ఓ ఆదిదేవా! జగదీశ్వరా! కృష్ణా! స్వేద అండజాది నాలుగు రకాలైన జీవులకు నీవు మూలకారణుడివి. సమస్తానికీ నీవే సృష్టికర్తవు, పోషకుడవు, లయకారకుడవు. మాఘశుక్లపక్షంలో వచ్చే ఏకాదశీ మహిమను నాకు చెప్పవలసినదిగా కోరుతున్నాను. ఆ ఏకాదశిని పాటించే విధానాన్ని, పరమమంగళమయమైన ఆ రోజు ఏ దైవాన్ని అర్చించాలో కూడా చెప్పవలసింది" అని అడిగాడు. ధర్మరాజు మాటలకు ప్రత్యుత్తరంగా శ్రీకృష్ణుడు "రాజోత్తమా! ధర్మరాజా! మాఘశుక్ల పక్షంలో వచ్చే ఏకాదశి, జయ ఏకాదశి యని సుప్రసిద్ధమైంది. ఈ ఏకాదశీ వ్రతపాలన ద్వారా సమస్తపాపాలు నశిస్తాయి. ఈ ఏకాదశిని పాటించేవాడు ఏనాడును దెయ్యంగా మారడు. రాజా! ముక్తిని ప్రసాదించడంలో, పాపనాశనంలో ఈ ఏకాదశికి మించినది లేదు. రాజసింహమా! పూర్వం నేను పద్మపురాణంలో వర్ణించినట్టి ఈ ఏకాదశి వర్ణనను ఇపుడు విను" అని తన ఉపదేశాన్ని కొనసాగించాడు.

"దేవతలందరు దేవేంద్రుని రాజ్యంలో సుఖంగా జీవిస్తున్నారు. అక్కడ నందనవనం పారిజాతపుష్ప సౌరభంతో నిండి ఉండేది. అప్సరసలు అక్కడ స్వేచ్ఛగా విహరించేవారు. ఇంద్రుడు కూడ ఆ అప్సరసలతో కలిసి నందనవనంలో విహరించేవాడు. ఒకసారి ఇంద్రుడు నందవనంలో ఐదుకోట్ల అప్సరసలతో నృత్యోత్సవాన్ని ఏర్పాటు చేసాడు. ఆ సభలో పుష్పదంతుడనే గంధర్వుడు ఉన్నాడు. చిత్రసేనుడనే ఇంకొక గంధర్వుడు తన భార్య మాలినితోను, కుమార్తెతోను అక్కడకు వచ్చాడు. చిత్రసేనునికి పుష్పవనుడనే పుత్రుడు ఉన్నాడు. అతని పుత్రుడు మలయవానుడు. పుష్పవతి అనే గంధర్వి మలయవానుని సౌందర్యానికి ఆకర్షితురాలైంది. మన్మథబాణ పీడితయైన పుష్పవతి మలయవానుని ఆకర్షించడానికి, లోబరచుకోవడానికి నానా భంగిమలతో, చూపులతో యత్నించింది.

"ఇంద్రుని ప్రీత్యర్థం మలయవానుడు, పుష్పవతి ఇతర అప్సరసలతో కలిసి నృత్యోత్సవంలో నృత్యం చేయడం మొదలుపెట్టారు. కాని పరస్పరాకర్షణ వలన మలయవానుడు, పుష్పవతి చక్కగా నృత్యం చేయలేక పోయారు. తత్ఫలితంగా నృత్య కార్యక్రమం సజావుగా సాగలేదు. మన్మథబాణ పీడితులై వారిద్దరు ఓరచూపులతో ఒకరినొకరు చూసుకోసాగారు. నృత్యగాన కార్యక్రమంలో జరుగుతున్న అవకతవకలను గమనించిన ఇంద్రుడు వారి మానసికస్థితిని అర్థం చేసికొన్నాడు. కార్యక్రమంలో నిరంతరం కలిగిన అంతరాయానికి అవమానితుడైన ఇంద్రుడు వారిని తీవ్రంగా శపించాడు; మూర్ఖులు, పాపులు అయిన మీరిద్దరు నా ఆజ్ఞను ఉల్లంఘించిన కారణంగా ఆడ, మగ దెయ్యాలుగా మారి భూలోకంలో మీ కర్మఫలాన్ని అనుభవించండి".

"ఆ రీతిగా శపించబడిన మలయవానుడు, పుష్పవతి పిశాచాలుగా మారి హిమాలయపర్వతగుహలో ఘోరమైన జీవితాన్ని గడపడం మొదలుపెట్టారు. దెయ్యాలుగా మారిన వారికి తీవ్రమైన దుఃఖం, శోకం కలిగాయి. శాపకారణంగా వారికి సుఖం నిద్ర కొరవడినాయి. హిమాలయ ప్రాంతంలోని దట్టమైన అరణ్యాలలో తిరుగుతూ ఒకసారి వారు ఒకచోట కూర్చొని బాధపడసాగారు. అపుడు మగదెయ్యం ఆడదెయ్యంతో "ఇంతటి ఘోరమైన పిశాచరూపాలు రావడానికి మనమెంతటి ఘోరమైన పాపాలు చేసామో కదా" అని అన్నది. తీవ్రమైన దుఃఖంతో ఆ దెయ్యాల జంట

పశ్చాత్తాప సాగరంలో మునిగిపోయాయి. దెయ్యాల రూపాలలో ఉన్న మలయవానుడు, పుష్పవతి ఆ రోజంతా పశ్చాత్తాపపడుతూ ఎటువంటి ఆహారం తీసుకోలేదు. అనుకోకుండా ఆ రోజు జయ ఏకాదశి అయింది. ఆకలిదప్పులతో పీడింపబడి నప్పటికిని వారు ఏ జీవినీ ఆ రోజు చంపలేదు. కందమూలములు గాని, జలం గాని వారు తీసుకోలేదు. రాజా! ఆ రీతిగా ఆ దెయ్యం జంట ఒక అశ్వత్థ వృక్షం క్రింద కూర్చొని ఉండగా సూర్యాస్తమయం అయింది. వణికే చలిలో, తీవ్రమైన ఆలోచనలతో వారు రాత్రంతా నిద్ర లేకుండానే గడిపారు. మానసిక కలత వలన వారి హృదయాలలో ఇంద్రియ భోగభావనే కలుగలేదు".

"రాజసింహమా! ఆ విధంగా అనుకోకుండానే వారు జయ ఏకాదశీ వ్రతాన్ని చేయడం జరిగింది. వ్రతపాలన ప్రభావంగా మర్నాడే వారు దెయ్యాల రూపం నుండి ముక్తిని పొందారు. పుష్పవతి, మలయవానుడు ఇద్దరూ తిరిగి తమ రూపాలను పొంది విమానాలలో స్వర్గలోకానికి వెళ్ళి దేవరాజైన ఇంద్రునికి అభివాదం చేశారు. అది చూసి ఆశ్చర్యపడిన ఇంద్రుడు వారితో 'ఎంత అద్భుతం! ఏ పుణ్యప్రభావం వలన మీకు దెయ్యాల రూపం పోయింది? ఏ దైవం మీకు నా శాపం నుండి ముక్తిని ప్రసాదించాడు?' అని అన్నాడు. దానికి సమాధానంగా మలయవానుడు ఇంద్రునితో 'దేవదేవుని నిర్హేతుక కరుణ వలన, ఆతనికి పరమప్రియమైన జయ ఏకాదశీ వ్రతపాలన వలన మేము శాపవిముక్తులమయ్యాము. ప్రభూ! కేవలం భక్తిప్రభావం వలననే మేము దెయ్యాల రూపం నుండి ముక్తులమయ్యామని పూర్ణవిశ్వాసంతో చెబుతున్నాను' అని అన్నాడు.

"ఈ మాటలను వినిన దేవేంద్రుడు మలయవానునితో "ఏకాదశిని పాటించడం ద్వారా, విష్ణుపూజను చేసిన కారణంగానే మీరు పవిత్రులయ్యారు. కాబట్టి మీరు నాకు కూడ పూజనీయులు. విష్ణువును పూజించేవారు



నిశ్చయంగా పూజనీయులు, నాకు ఆదరణీయులు' అని అన్నాడు. తరువాత పుష్పవతి, మలయవానుడు స్వర్గంలో సుఖంగా జీవించారు".

"ధర్మరాజా! ఈ ఏకాదశీవ్రతాన్ని ప్రతియొక్కరు పాటించాలి. జయ ఏకాదశి వ్రతపాలనం బ్రహ్మహత్యాపాతకాన్నైనా పరిహరిస్తుంది. దానం, యజ్ఞం, తీర్థాటనం వలన కలిగే పుణ్యం ఈ వ్రతపాలనచే అప్రయత్నంగానే లభిస్తుంది. ఈ ఏకాదశీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేసేవాడు వైకుంఠంలో శాశ్వతంగా నివసిస్తాడు."

ఈ ఏకాదశి మహిమను చదవడం, వినడం ద్వారా మనిషి అగ్నిష్టోమ యాగఫలాన్ని పొందుతాడు.

* * *

# 7. విజయ ఏకాదశి

**- ఫాల్గుణ మాసం కృష్ణపక్షం**

విజయ ఏకాదశీ మాహాత్మ్యం స్కందపురాణంలో వర్ణించబడింది. ఫాల్గుణమాసం కృష్ణపక్షంలో వచ్చే ఈ ఏకాదశిని గురించి తనకు వివరించమని ధర్మరాజు ఒకసారి శ్రీకృష్ణుని అడిగాడు.

దానికి ప్రత్యుత్తరంగా శ్రీకృష్ణుడు అతనితో "ధర్మరాజా! విజయ ఏకాదశి అని తెలియబడే ఈ ఏకాదశిని గురించి నీకు ఆనందంగా వివరిస్తాను. ఈ ఏకాదశీ వ్రతాన్ని పాటించడం ద్వారా అన్ని పాపాలు ఒకేసారి నశించిపోతాయి" అని చెప్పి తన వివరణను ఇంకను కొనసాగించాడు.

ఒకసారి నారదుడు బ్రహ్మదేవుని సమీపించి "ఓ దేవతాశ్రేష్ఠుడా! ఫాల్గుణమాసం కృష్ణపక్షంలో వచ్చే విజయ ఏకాదశిని పాటించేవాడు సాధించే ఫలాన్ని నాకు వివరించవలసినది" అని వినమ్రంగా అడిగాడు. అది వినిన బ్రహ్మదేవుడు నారదునితో "పుత్రా! ఈ పురాతన వృత్తాంతం అత్యంత పవిత్రమైనది, సకల పాపాలను నశింపజేసేది. పేరుకు తగినట్లుగా ఇది నిజానికి గొప్ప ఫలితాలను ఇస్తుంది. ఈ విజయ ఏకాదశి మనిషికి నిస్సందేహంగా విజయాన్ని చేకూరుస్తుంది. తండ్రి ఆజ్ఞను నెరవేర్చడానికి శ్రీరామచంద్రుడు తన భార్య సీతతోను, సోదరుడు లక్ష్మణునితోను పదునాలుగేండ్లు వనవాసానికి వెళ్ళినపుడు గోదావరి తీరంలోని పంచవటి అనే రమ్యమైన అరణ్యప్రాంతంలో కొంతకాలం నివసించాడు. వారు ఆ వనంలో ఉన్నప్పుడే దానవరాజగు రావణుడు సీతాదేవిని అపహరించాడు. సీతావియోగంతో శ్రీరాముడు దుఃఖసముద్రంలో మునిగిపోయాడు. సీతాన్వేషణలో శ్రీరాముడు అడవిలో తిరుగుతూ మరణింపనున్న పక్షిరాజు జటాయువును కలిశాడు. సీతను గురించి సమస్తం శ్రీరామునికి తెలియజేసిన జటాయువు ఈ జగత్తును వీడి వైకుంఠానికి వెళ్లాడు. తరువాత శ్రీరాముడు సుగ్రీవునితో స్నేహం చేశాడు. అపుడు రామచంద్రుని కార్యార్థమై పెద్ద వానరసేన ఏర్పాటు చేయబడింది. ఇంతలో కపిరాజగు హనుమంతుడు లంకలోని అశోకవనానికి వెళ్ళి సీతను చూసి, రాముని అంగుళీయకాన్ని ఆమెకు సమర్పించే మహత్కార్యాన్ని పూర్తి చేశాడు. తదనంతరం హనుమంతుడు రామచంద్రుని దగ్గరకు తిరిగివచ్చి సమస్తాన్నీ ఆతనికి వివరించాడు. హనుమంతుని మాటలను వినిన తరువాత శ్రీరాముడు తన మిత్రుడు సుగ్రీవునితో సంప్రదించి లంకపై దండెత్తడానికి నిశ్చయించాడు. అపుడు శ్రీరాముడు పెద్దవానరసేనతో సముద్రతీరానికి అరుదెంచి లక్ష్మణుని ఉద్దేశించి "సౌమిత్రీ! తిమింగలాలు, మొసళ్ళు వంటి భయంకరమైన జలచరాలతో నిండినట్టి ఈ అగాథమైన సముద్రాన్ని మనం ఎలా దాటగలం?" అని అన్నాడు. రాముని మాటలకు ప్రత్యుత్తరంగా లక్ష్మణుడు "ఓ ఆదిపురుషా! నీవు దేవదేవుడవు. ఈ ద్వీపంలోని బకదాల్భ్యుడనే ముని ఉన్నాడు. ఆయన ఆశ్రమం ఇక్కడకు నాలుగు మైళ్ళ దూరంలో ఉంది. ఓ రఘునందనా! ఆ మునికి బ్రహ్మదర్శనం కల్గింది. ఈ సముద్రాన్ని దాటే ఉపాయాన్ని మనం ఆ మునినే అడుగుదాం" అని అన్నాడు.

లక్ష్మణునిచే ఈ విధంగా సలహా పొందిన శ్రీరాముడు బకదాల్భ్యుని ఆశ్రమానికి వెళ్ళి ఆ మునికి వందనం చేశాడు. వచ్చిన వ్యక్తి శ్రీరామచంద్రుడని, రావణసంహారం వంటి ప్రత్యేక కార్యార్థమే ఇపుడు అవతరించాడని సర్వజ్ఞుడైన ఆ ముని వెంటనే తెలిసికొన్నాడు. వెంటనే ఆ ముని శ్రీరాముడు వచ్చిన కార్యం గురించి ప్రశ్నించాడు. అపుడు శ్రీరాముడు ఆ మునితో "ఓ బ్రాహ్మణోత్తమా! దానవులతో పోరాడి లంకను జయించడానికి నేను వానరసేనతో ఈ సాగరతీరానికి మీ కృపకోసం వచ్చాను. ఓ మునివర్యా! దయతో ఈ దుస్తరమైన సాగరాన్ని నేను సులభంగా దాటగలిగే ఉపాయాన్ని చెప్పండి. అని అన్నాడు.

దానికి ప్రత్యుత్తరంగా ముని శ్రీరామునితో "శ్రీరామా! యుద్ధాన్ని జయించి నీవు ఈ జగత్తులో అసాధారణ యశస్సును, సంపదను పొందగలిగే ఒక మహత్తర వ్రతాన్ని నీకు చెబుతాను. కాని ఈ వ్రతాన్ని నీవు అనన్యచిత్తంతో పాటించాలి. రామచంద్రా! ఫాల్గుణమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి విజయ ఏకాదశిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఏకాదశీ వ్రతపాలనచే నీవు నీ వానరసేనతో పాటు ఈ సముద్రాన్ని దాటగలవు. ఇక ఇపుడు ఈ వ్రతవిధానాన్ని సావధానంగా విను. ఏకాదశికి ముందురోజు బంగారు, వెండి, రాగి లేదా మట్టి కుండలో నీరు నింపి దానిని మామిడాకులతో అలంకరించాలి. తరువాత దానిని సప్తధాన్యాలతో అలంకరించిన వేదికపై ఉంచి దానిపై నారాయణుని స్వర్ణమూర్తిని నిలపాలి. ఏకాదశిరోజు నీవు తెల్లవారుజామునే స్నానం చేసి తులసీదళాలను, గంధాన్ని, పూలను, పూమాలలను, ధూపదీపాలను, నైవేద్యాన్ని సమర్పించి నారాయణుని పూజించాలి. ఆ రాత్రి జాగరణ కూడ చేయాలి. మర్నాడు ఆ పాత్రను నదీతీరం, కొలను లేదా సరస్సు ఒడ్డున ఉంచి సూర్యోదయం తరువాత దానిని యథావిధిగా పూజించాలి. ఆ తరువాత నారాయణుని మూర్తితోపాటు ఆ పాత్రను బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తున్న బ్రాహ్మణునికి దానం చేయాలి. ఈ విధంగా చేస్తే నీవు నిశ్చయంగా నీ శత్రువులను ఓడిస్తావు" అని అన్నాడు.

ముని ఆదేశానుసారం శ్రీరామచంద్రుడు ఈ ఏకాదశీవ్రతాన్ని పాటించి, ఫలితంగా విజయాన్ని సాధించాడు. ఈ ఏకాదశీ వ్రతాన్ని యథావిధిగా పాటించే వ్యక్తి ఖచ్చితంగా ఇహపరాలలో విజయాన్ని సాధిస్తాడు.

ఈ ప్రకారంగా నారదునితో పలుకుతున్న బ్రహ్మదేవుడు అతనితో "పుత్రా! కనుక ప్రతి మానవుడు ఈ విజయ ఏకాదశి వ్రతాన్ని తప్పకుండా పాటించాలి. ఈ విజయ ఏకాదశీ మహిమ మనిషి యొక్క సమస్త పాపాలను నశింపజేస్తుంది" అని పలికాడు.

ఈ ఏకాదశీ మాహాత్మ్యాన్ని చదివేవాడు, వినేవాడు వాజపేయ యజ్ఞఫలాన్ని పొందుతాడు.

# 8. ఆమలకీ ఏకాదశి

## - ఫాల్గుణమాసం శుక్లపక్షం

ఫాల్గుణమాస శుక్లపక్షంలో వచ్చే ఆమలకీ ఏకాదశి మహిమ మాంధాత వశిష్ఠుల సంవాదరూపంలో బ్రహ్మాండపురాణంలో వర్ణించబడింది.

ఒకసారి మాంధాత వశిష్ఠముని దగ్గరకు చేరి "ఓ మహాభాగా! మీరు నా పట్ల ప్రసన్నులై ఉన్నచో, సకల శుభాలను పొందగలిగే ఒక వ్రతాన్ని దయతో నాకు తెలపండి" అని అడిగాడు. దానికి ప్రత్యుత్తరంగా వశిష్ఠుడు ఇలా అన్నాడు. "రాజా! అందరికీ శుభాన్ని కలుగజేసే ఒక మహావ్రతం యొక్క మహిమను, చరిత్రను నీకు వివరిస్తాను. ఆ వ్రతం పేరు ఆమలకీ ఏకాదశీ వ్రతం. ఈ వ్రతాన్ని పాటించడం వలన కలిగే ప్రభావం సకల పాపాలను నశింపజేసి ముక్తిని ఒసగడమే కాకుండ వేయి గోవులను దానం చేసిన ఫలం కూడ సిద్ధిస్తుంది."

"పూర్వం వైదిషమనే పురం ఉండేది. దానిలో మిక్కిలి సంపన్నులైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు నివసించేవారు. ఆ అందమైన నగరంలో నాస్తికుడు గాని, పాపిగాని ఉండేవాడు కాదు. నగరమంతా ఎప్పుడూ వేదమంత్రాలతో ప్రతిధ్వనిస్తూ ఉండేది. అట్టి సుప్రసిద్ధ నగరంలో చైత్రరథుడనే రాజు ఉండేవాడు. అతడు చంద్రవంశజుడైన పశబిందుకుని కులంలో జన్మించాడు. చైత్రరథుడు బలవంతుడు, వీరుడు, ఐశ్వర్యవంతుడు, శాస్త్ర కోవిదుడై ఉండేవాడు. అతని రాజ్యపాలనలో రాజ్యమంతటా సుఖసంపదలు వెల్లివిరిసి ఉండేవి. పురప్రజలందరు విష్ణుభక్తికి అంకితులై ఉండి ఏకాదశీ వ్రతాన్ని పాటిస్తుండేవారు. హరిభక్తి కారణంగా వారందరు ఆ రాజ్యంలో సుఖంగా జీవించేవారు. రాజ్యంలో బీదవాడు గాని, పిసినారిగాని ఒక్కడైనా ఉండేవాడు కాదు. ఈ ప్రకారం ఆనందంగా అనేకసంవత్సరాలు గడచి

పోయిన తరువాత ఫాల్గుణమాస శుక్లపక్షంలో ఒకసారి ద్వాదశితో కూడిన ఆమలకీ ఏకాదశి వచ్చింది. ఇటువంటి ఏకాదశి మహత్తర లాభాన్ని చేకూరుస్తుందని తెలిసిన రాజు, అతని ప్రజలు దానిని యథావిధిగా నిర్వహించాలని సంకల్పించారు. ఏకాదశిరోజు ప్రొద్దున్నే రాజు, అతని ప్రజలు నదిలో స్నానం చేసి, ఒడ్డునే ఉన్నట్టి విష్ణు ఆలయాన్ని సందర్శించారు. గుడి ప్రాంగణంలోనే ఒక ఆమలకీ వృక్షం ఉంది. రాజు ఆ చెట్టు మొదట్లో నీళ్ళు నింపిన కుండను, గొడుగును, వస్త్రాన్ని, పాదుకలను, పంచరత్నాలను పూజార్థం ఉంచాడు. తరువాత అతడు జలమును, పాదుకలను, ఛత్రాన్ని, సువర్ణమును, వజ్రములను, ముత్యాలను, వైడూర్యములను, సుగంధ ధూపమును సమర్పించి శ్రీపరశురాముని, ఆమలకీ వృక్షాన్ని పూజించాడు. పిదప అతడు ప్రజలతో, ఋషులతో గూడి పరశురాముని కీర్తించాడు".

"ఓ పరశురామా! ఓ రేణుకనందనా! ఓ ఆమలకీ వృక్షచ్ఛాయలో నిలిచినవాడా! ఓ కామమోక్షప్రదాతా! ఇవే నీకు మా వందనములు".

తరువాత అతడు ఆమలకీవృక్షాన్ని స్తుతించాడు. "ఓ ఆమలకీ! ఓ విశ్వపోషకా! బ్రహ్మతనయా! ఓ సమస్త పాపవినాశకా! నీకు మా వందనములు. దయచేసి మా అర్పణలను స్వీకరింపుము".

ఈ విధంగా భగవంతుని, ఆమలకీని పూజించిన తరువాత రాజు, అతని ప్రజలు విష్ణు ఆలయంలోనే రాత్రంతా జాగరణ చేశారు. భక్తితో పాటలు పాడారు. ఆ సమయంలో విధివశాత్తుగా ఒక వేటగాడు అక్కడకు వచ్చాడు. నానారకాలైన జంతువులను చంపి అతడు జీవికను సంపాదించే వాడు. నెయ్యిదీపంతో, ధూపంతో శోభితమైన మందిరంలోనికి ప్రవేశించిన ఆ వేటగాడు చాలామంది జనులు మేల్కొని ఉన్నవారై భగవంతుని కీర్తించడం కనిపించింది. వాడు కూడ వాళ్ళతో పాటే కూర్చొని జరుగుతున్నదేమిటో



చూడసాగాడు. అదృష్టవశాత్తు అతనికి కుండపై ఉంచిన దామోదరుని దర్శనం కలిగింది. వాడు విష్ణుభగవానుని దివ్యకథలను కూడ విన్నాడు. వాడు ఆకలితో ఉన్నప్పటికిని రాత్రంతా మేల్కొని ఉన్నవాడై ఏకాదశి మహిమలను విన్నాడు. మర్నాడు ప్రొద్దున్నే రాజు తన ప్రజలతో పాటు తన పురానికి వెళ్ళిపోయాడు. వేటగాడు కూడ ఇంటికి వెళ్ళిన తరువాత భోజనం చేశాడు. తరువాత కొన్ని సంవత్సరాలకు వేటగాడు దేహాన్ని చాలించాడు. ఏకాదశి రోజు రాత్రి జాగరణ చేసిన ఫలితంగా వాడు మరుజన్మలో అసంఖ్యాక రథగజతురగపదాతిదళంతో కూడిన రాజుగా జన్మించాడు. జయంతి పురాన్ని పాలించే విదూరథునికి అతడు వసురథునిగా జన్మించాడు. అతడు వెయ్యి గ్రామాలకు రాజు అయ్యాడు. అతడు సూర్యునితో సమానంగా తేజోమయుడు, చంద్రునితో సమానంగా ప్రకాశమానుడు, విష్ణువుతో సమానంగా శక్తిమంతుడు, భూదేవితో సమానంగా ఓర్పు కలవాడుగా ఉండేవాడు. సత్యసంధుడైన అతడు ధర్మపరుడై విష్ణుభక్తునిగా అయ్యాడు.

ఒకరోజు వసురథుడు అడవిలో వేటకు పోయి దారి తప్పాడు. తీవ్రంగా అలసిపోయిన అతడు ఏ దారి తోచక ఒక చెట్టుక్రింద నడుం వాల్చి చేయినే తలగడగా పెట్టుకొని నిదురించాడు. అదే సమయంలో ఆ అడవిలో వసించే కొందరు మ్లేచ్ఛులు వచ్చి అతనిని నానా రకాలుగా హింసించారు. అతనిని తమ శత్రువుగా భావించి వారు చంపడానికి సిద్ధపడ్డారు. ఆ రాజు పూర్వం తమ తండ్రులను, తల్లులను, పుత్రులను, పౌత్రులను, మామలను నిర్దాక్షిణ్యంగా చంపి తాము దిక్కు తోచక తిరిగేటట్లు చేశాడని వారు భావించారు. ఈ విధంగా తలచి వారు ఆయుధాలనెత్తి రాజును కొట్టారు. కాని ఆశ్చర్యకరంగా వారి ఆయుధాలు ఏవీ కూడ రాజుయొక్క శరీరాన్ని తాకలేదు. అతని శరీరంపై చిన్న గాయమైనా కాలేదు. ఆ విధంగా తమ ఆయుధాలు వ్యర్థమయ్యేసరికి మ్లేచ్ఛులందరు ఖిన్నులై ప్రాణభీతి పొందారు.

అడుగు ముందుకు వేసే శక్తి కూడ వారికి లేకపోయింది. ఆ సమయంలో ఒక అసాధారణ అందకత్తె గంధాభరణభూషితయై రాజుయొక్క దేహం నుండి బయటకు వచ్చింది. చక్కని పూమాలతో అలంకృతయై యున్న ఆమె కన్నులు కోపంతో ఎఱ్ఱబడి ఉన్నాయి. భ్రుకుటి ముడిచిన ఆమె చేతిలో చక్రాన్ని ధరించి క్రోధంతో మ్లేచ్ఛులను చంపడానికి ముందుకు ఉరికి క్షణంలో వారిని నిహతులను చేసింది. ఈ సంఘటన పూర్తి కాగానే రాజుకు మెలకువ వచ్చింది. ఘోరమైన సంఘటనను చూసి రాజు నిద్రనుండి మేల్కొని భీతుడై ద్రాన్పడిపోయాడు. తరువాత శత్రువు లందరు చచ్చిపడి ఉండటాన్ని చూసి విస్మితుడై "ఆహా! ఈ నా శత్రువులను చంపి నన్ను రక్షించిన ఆ శ్రేయోభిలాషి మిత్రుడెవ్వడు? ఈ గొప్పకార్యానికి నేను ఆతనికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని అన్నాడు.

"కేశవుడు తప్ప శరణాగత జీవులను రక్షించే సామర్థ్యం వేరెవ్వరికి ఉంటుంది? ఆతడొక్కడే శరణాగతులైన భక్తులకు పోషకుడు" అనే మాట ఆకాశంలో వినవచ్చింది. ఆకాశవాణి వాక్కులు వినగానే రాజు అమితాశ్చర్య చకితుడయ్యాడు. భక్తిభావంతో అతని హృదయం ద్రవించింది. తరువాత అతడు రాజ్యానికి తిరిగివచ్చి ఎటువంటి అవాంతరం లేకుండా ఇంద్రునిలాగా రాజ్యపాలన చేశాడు.

వశిష్ఠముని పలుకుతూ "రాజా! ఈ పవిత్రమైన ఆమలకీ ఏకాదశీ వ్రతాన్ని పాటించేవాడు నిస్సంశయంగా విష్ణుపదాన్ని పొందగలుగుతాడు" అని తెలియజేశాడు.

* * *

# 9. పాపమోచనీ ఏకాదశి

## - చైత్రమాసం కృష్ణపక్షం

పాపమోచనీ ఏకాదశీ మహిమ శ్రీకృష్ణయుధిష్ఠిర సంవాద రూపంగా భవిష్యోత్తర పురాణంలో వర్ణించబడింది.

ఒకసారి ధర్మరాజు కృష్ణునితో పలుకుతూ "కృష్ణా! ఆమలకీ ఏకాదశీ మహిమను నీవు ఇదివరకే వివరించావు. అయితే ఇపుడు చైత్రమాసం కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశిని గురించి వివరించవలసింది. ఆ ఏకాదశి పేరేమిటి? ఆ ఏకాదశిని పాటించే పద్ధతిని, దాని ఫలితాన్ని నాకు చెప్పవలసిందిగా కోరుతున్నాను" అని అన్నాడు. అపుడు శ్రీకృష్ణుడు దానికి ప్రత్యుత్తరంగా పలుకుతూ "రాజోత్తమా! ఆ ఏకాదశి పేరు పాపమోచనీ, దాని మహిమను ఇపుడు విను. అతిపురాతన కాలంలో ఈ ఏకాదశీ మహిమను లోమశముని మాంధాతకు వివరించాడు. ఈ ఏకాదశి చైత్రమాసం కృష్ణపక్షంలో వస్తుంది. ఇది సకల పాపాలను హరిస్తుంది. జీవుని పిశాచ జీవనాన్ని నశింపజేస్తుంది, అష్టసిద్ధులను ప్రసాదిస్తుంది" అని అన్నాడు.

లోమశముని చెప్పిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దేవతల కోశాధిపతియైన కుబేరునికి ఒక రమ్యమైన పుష్పవనం ఉండేది. దాని పేరు చైత్రరథం. నిత్యవసంతఫలితంగా అక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేది. గంధర్వులు, కిన్నరులు వంటివారు అక్కడ క్రీడించేవారు. ఇంద్రాది దేవతలు కూడ అక్కడకు వచ్చి విహరించేవారు. అదే వనంలో మేధావి అనే శివభక్తుడు తపస్సు చేస్తుండేవాడు. ఒకసారి అప్సరసలు ఆయన నిష్ఠను భంగపరచడానికి ప్రయత్నించారు. వారిలో మంజుఘోష అనే అప్సరస మునిమనస్సును హరించడానికి ఒక పన్నాగం పన్నింది. ఆమె ముని

ఆశ్రమానికి దగ్గరలోనే ఒక చిన్న కుటీరాన్ని నిర్మించుకొని తియ్యని గొంతుతో వీణను మీటుతూ గీతాలాపన చేయసాగింది. శరీరానికి చందనాన్ని అలదుకొని, మెడలో సుగంధ పుష్పమాలను ధరించి తియ్యగా పాడుతున్న మంజుఘోషను చూసి శివవైరియైన మన్మథుడు కూడ మునిని జయించడానికి యత్నించాడు. పూర్వం ఒకసారి శివుడు మన్మథుని కాల్చి భస్మం చేశాడు. పూర్వశత్రుత్వాన్ని గుర్తు చేసికొనినవాడై మన్మథుడు ప్రతీకారం తీర్చుకోవడానికి శివభక్తుడైన మునిమనస్సులో ప్రవేశించాడు. తెల్లని యజ్ఞోపవీతాన్ని ధరించి చ్యవనఋషి ఆశ్రమంలో వసిస్తున్న మేధావి ఋషి అపుడు రెండవ మన్మథునిగా గోచరించాడు. అపుడు మంజుఘోష అతని చెంతకు చేరింది. అది చూసి మేధావి కూడ కామపీడితుడై తన దైవాన్ని మరిచాడు. ఆ విధంగా అతడు శివభక్తిని విడిచి ఆ వనితాసాంగత్యంలో మునిగిపోయాడు. అనేకసంవత్సరాలు గడిచాయి.

ముని తన స్థితి నుండి పతనం చెందాడని గుర్తించిన మంజుఘోష తిరిగి తన లోకానికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకొంది. అదే విషయాన్ని ఆమె మేధావితో చెప్పి తన లోకానికి వెళ్ళడానికి అనుజ్ఞను కోరింది. అపుడు మేధావి ఆమెతో "రమణీ! నీవు నా దగ్గరకు వచ్చింది ఈ సాయంత్రమే కదా. ఈ రాత్రికి ఇక్కడే ఉండి రేపు ప్రొద్దున్నే వెళ్ళిపో" అని అన్నాడు. మునికి భయపడిన మంజుఘోష సరేనని చెప్పి మరికొన్ని సంవత్సరాలు అక్కడే ఉండిపోయింది. ఈ రకంగా ఆ అప్సరస యాభైఏడు సంవత్సరాల తొమ్మిది నెలల మూడు రోజులు మునితో గడిపినప్పటికిని అదంతా కేవలం ఒక రాత్రిలో సగభాగం వలెనే తోచసాగింది. తిరిగి మంజుఘోష తన ఇంటికి వెళ్ళడానికి అనుజ్ఞను కోరింది. కాని ఈ సారి ముని ఆమెతో "రమణీ! నా మాటలు విను. ఇది కేవలం ప్రాతఃసమయం. నేను ప్రాతః కాలవిధులు పూర్తి చేసేంతవరకు ఇక్కడే ఉండు" అని అన్నాడు. అపుడు



అప్సరస నవ్వి "మహర్షీ! మీ ప్రాతఃకాల విధులు పూర్తి కావడానికి ఇంకెంత సమయం పడుతుంది? ఇంకా మీరు అవి పూర్తి చేయలేదా? ఇప్పటికే నా సాంగత్యంలో మీరు అనేక సంవత్సరాలు గడిపారు. ఇప్పటికైనా సమయం విలువ తెలుసుకోండి'' అని అన్నది. ఆ మాటలు వినగానే ఋషికి జ్ఞానోదయం కలిగింది. అపుడు ఆ ఋషి "సుందరీ! యాభైఏడేళ్ళ విలువైన కాలాన్ని నేను వృథా చేశాను. నీవే నా సమస్తాన్నీ, తపస్సును నాశనం చేశావు" అని అంటూనే ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. దేహం కోపంతో కంపించింది. అదే కోపంతో మేధావి ఆమెతో పలుకుతూ "నీవు మంత్రకత్తె, పిశాచిలాగా ప్రవర్తించావు. కాబట్టి పిశాచిలాగా మారిపో. పాపిష్ఠిదానా! సిగ్గు సిగ్గు" అని అన్నాడు.

మేధావి ఇచ్చిన శాపాన్ని వినగానే మంజుఘోష అతనితో "ఓ బ్రాహ్మణోత్తమా! దయచేసి ఈ శాపాన్ని ఉపసంహరించుకో. నేను నీకు అనేకసంవత్సరాల సాంగత్యాన్ని ఇచ్చాను కాబట్టి క్షమార్హురాలిని. నా మీద దయ చూపించు" అని అన్నది. ఆమె మాటలను వినిన మేధావి అపుడు ఆమెతో "సౌమ్యురాలా! నేనేం చేసేది? నీవు నా తపస్సంపదను కొల్లగొట్టావు. అయినా ఈ శాపం నుండి బయటపడే మార్గం నీకొకటి నేను చెబుతాను, చైత్రమాసం కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరు పాపమోచనీ ఏకాదశి. అది సకలపాపహరం. నీవు ఆ ఏకాదశివ్రతాన్ని పాటిస్తే నీ పిశాచజీవనం పోతుంది" అని పలికాడు. తరువాత మేధావి తన తండ్రి చ్యవనఋషి ఆశ్రమానికి వెళ్ళాడు. పతితుడైన తన పుత్రుని చూసి చ్యవనఋషి అతిదుఃఖితుడై "అయ్యో! నీవెంత పనిచేశావు! సాధారణమైన వనితకు ఆకర్షితుడవై తపస్సంపదను నష్టపరచడం నీకు తగనే తగదు" అని అన్నాడు. అపుడు మేధావి పలుకుతూ "తండ్రీ! దురదృష్టవశాత్తు నేను అప్సరససాంగత్యంలో

మహాపాపానికి ఒడిగట్టాను. కాబట్టి నాకు పాపపరిహారాన్ని తెలియజేయండి” అని అర్థించాడు. కుమారుడి దీనాలాపన వినిన చ్యవనఋషి అపుడు మార్గోపదేశం చేస్తూ “పుత్రా! పాపమోచని ఏకాదశీ వ్రతపాలన వలన సమస్తపాపాలు నశిస్తాయి. కాబట్టి శ్రద్ధతో దానిని పాటించు” అని అన్నాడు. తండ్రి మాటలను వినిన మేధావి పరమోత్సాహంతో ఆ ఏకాదశీ వ్రతపాలనకు సిద్ధపడ్డాడు. తరువాత ఆ ఏకాదశి వ్రతవిధానం వలన మేధావి పాపాలన్నీ నశించిపోయాయి, అతడు కూడ పరమభాగ్యవంతుడయ్యాడు. మంజుఘోష కూడ పాపమోచనీ ఏకాదశీ పాలన ద్వారా పిశాచరూపం నుండి బయటపడి తిరిగి స్వర్గానికి వెళ్ళిపోయింది.

మాంధాతకు ఈ కథను వివరించిన లోమశముని చివరిగా పలుకుతూ “రాజా! ఈ పాపమోచనీ ఏకాదశీ వ్రతపాలన చేత సమస్త పాపాలు నశిస్తాయి. ఈ ఏకాదశి వ్రతమాహాత్మ్యాన్ని చదవడం వలన, వినడం వలన సహస్ర గోదానఫలం లభిస్తుంది. ఈ వ్రతపాలన ద్వారా బ్రహ్మహత్యాపాతకం, భ్రూణహత్యాపాతకం, మదిరాపాన పాతకం, గురుపత్ని సంగమపాతకం వంటి సకలపాపాలు సమూలంగా నశిస్తాయి” అని అన్నాడు.

సారాంశమేమనగా ఈ ఏకాదశి పరమమంగళకరమైనది, సకల పాపహరమైనది కాబట్టి ప్రతియొక్కరు శ్రద్ధతో ఈ ఏకాదశి వ్రతపాలన చేయాలి.

* * *

# 10. కామదా ఏకాదశి

## - చైత్రమాసం శుక్లపక్షం

కామదా ఏకాదశి మాహాత్మ్యం శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంలో వరాహపురాణంలో వర్ణించబడింది. ఒకసారి ధర్మరాజు యదుకుల శిరోమణి యైన శ్రీకృష్ణుని సమీపించి ఆతనితో “ఓ వాసుదేవా! చైత్రమాసంలోని శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని గురించి నాకు వివరించవలసినది. అలాగే ఆ ఏకాదశిని పాటించే విధానాన్ని, దాని వలన కలిగే లాభాలను నాకు తెలుపవలసింది” అని అడిగాడు.

దానికి శ్రీకృష్ణుడు సమాధానమిస్తూ “ధర్మనందనా! పురాణ లిఖితమైన ఆ ఏకాదశిని గురించిన వర్ణనను సావధానంగా విను. శ్రీరామచంద్రుని ప్రపితామహుడైన దిలీపుడు చైత్రమాసం శుక్లపక్షంలో వచ్చే ఆ ఏకాదశిని గురించి తన గురువైన వశిష్ఠుని అడుగగా ఆయన దానిని గురించి ఈ విధంగా తెలిపాడు” అని చెప్పసాగాడు.

వశిష్ఠుడు దిలీపునితో “రాజా! ఆ ఏకాదశి పేరు కామదా ఏకాదశి. పరమపవిత్రమైన ఆ ఏకాదశి సకలపాపాలను భస్మీపటలం చేస్తుంది. వ్రతపాలనం చేసే వ్యక్తికి పుత్రోదయాన్ని కలిగిస్తుంది. ఇక దాని మహిమలను విను” అని పలికి దానికి సంబంధించిన వివరాలను తెలిపాడు.

పూర్వం రత్నపురమనే నగరం ఉండేది. అత్యంత వైభవోపేతమైన ఆ నగరాన్ని పుండరీకుడనే గంధర్వరాజు పాలిస్తుండేవాడు. గంధర్వకిన్నర అప్సరసలు ఆ నగరంలో నివసించేవారు. ఆ నగరంలో లలిత అనే సౌందర్యవతియైన అప్సరస లలితుడనే సుందరుడైన భర్తతో కలిసి నివసిస్తుండేది. అతడు గంధర్వుడు. పరస్పర ప్రేమతో విహ్వాలులై ఉండే ఆ

జంట తమ భవ్యమైన భవంతిలో నిత్యకేళిలో ఉండేవారు. క్షణకాల వియోగాన్ని కూడ వారు భరించలేకపోయేవారు.

ఒకసారి పుండరీకుని సభలో నృత్యగాన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. దానిలో పలు గంధర్వులతో పాటు లలితుడు కూడ గానం చేశాడు. కాని దానిలో లలిత పాల్గొనలేదు. ఆమె లేకపోవడం వలన లలితుడు పాడే పాటలో కొన్ని తప్పులు దొర్లాయి. దాని లయ తప్పింది. శ్రోతలలో కర్కోటకుడనే నాగజాతికి చెందినవాడు ఇది గమనించి లలితుని వ్యవహారానికి అసలైన కారణాన్ని రాజుకు తెలియజేశాడు. అది విని రాజు మిక్కిలి కుపితుడై "ఓరీ పాపీ! కామంతో నీవు నృత్యగాన కార్యక్రమంలో రసాభాసం చేశావు. నీవు నరభక్షకుడివి కమ్మని శపిస్తున్నాను" అని అన్నాడు.

పుండరీకుని శాపంతో లలితుడు వెంటనే ఘోరరూపుడైన నరభక్షకునిగా అయ్యాడు. అతనిని చూసిన లలిత తీవ్రమైన బాధకు గురి అయింది. ఏమి చేయాలి, ఎటు పోవాలి అని రాత్రింబగళ్ళు ఆమె తీవ్రదుఃఖంతో తపిస్తూ భర్తతోనే కలిసి కాలం గడపసాగింది. ఒకసారి ఆమె భర్తతో పాటు అడవిలో సంచరిస్తున్న సమయంలో వింధ్యాచల శిఖరముపైన శృంగిముని ఆశ్రమం కనిపించింది. లలిత వెంటనే ఆశ్రమంలో ప్రవేశించి శృంగికి నమస్కరించింది. అప్పుడు ఆయన ఆమె వివరాలను కనుక్కోగా లలిత తన వృత్తాంతాన్ని వివరించి చెప్పి తన భర్తకు శాపవిమోచనమయ్యే మార్గాన్ని తెలుపమని ప్రార్థించింది. దానికి ప్రత్యుత్తరంగా ఆయన రాబోయే ఏకాదశి కామదా ఏకాదశి, దానిని పాటించే వ్యక్తికి సమస్త కోరికలు తీరుతాయని, ఆ ఏకాదశి ఫలాన్ని ఆమె తన భర్తకు ధారపోస్తే అతడు శాపవిముక్తుడవుతాడని తెలిపాడు. ముని చెప్పిన విధంగానే లలిత భక్తిశ్రద్ధలతో కామదా ఏకాదశీ వ్రతపాలనం చేసింది. ద్వాదశిరోజు ఆమె వాసుదేవుని సమక్షంలో కూర్చొని తన



వ్రతఫలాన్ని భర్తకు ధారపోసింది. దాని ప్రభావం వలన లలితునికి శాపవిముక్తి కలిగి వెంటనే పూర్వగంధర్వరూపాన్ని పొందాడు. అప్పటినుండి లలిత, లలితుడు ఇద్దరు కలిసి సుఖంగా జీవించసాగారు.

ఈ వృత్తాంతాన్ని వివరిస్తున్న శ్రీకృష్ణుడు ధర్మరాజుతో "ఓ రాజశ్రేష్ఠుడా! ఈ అద్భుతమైన కామదా ఏకాదశీ వర్ణనను వినినవాడు నిశ్చయంగా దీనిని తన శక్త్యనుసారం పాటించాలి. ఈ వ్రతపాలనం బ్రహ్మహత్యాపాతకాన్నైనా, ఎంతటి ఘోరమైన శాపాన్నైనా పరిహరిస్తుంది" అని అన్నాడు.

* * *

# 11. వరూధినీ ఏకాదశి

**- వైశాఖమాసం కృష్ణపక్షం**

వైశాఖమాసం కృష్ణపక్షంలో వచ్చే వరూధినీ ఏకాదశీ మహిమ శ్రీకృష్ణధర్మరాజ సంవాదంగా భవిష్యోత్తర పురాణంలో వర్ణించబడింది.

ఒకసారి ధర్మరాజు శ్రీకృష్ణభగవానునితో "వాసుదేవా! నీకు నమస్కారం. వైశాఖమాసం కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశిని గురించి, దాని నామ మహిమలను గురించి నాకు వివరించవలసింది" అని అన్నాడు.

దానికి శ్రీకృష్ణుడు సమాధానమిస్తూ ఇలా అన్నాడు. "రాజా! ఆ ఏకాదశి పేరు వరూధినీ ఏకాదశీ. అది ఇహపరాలలో మనిషికి పరమసౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఆ ఏకాదశి వ్రతపాలనం ద్వారా మనిషి నిరంతర సుఖాన్ని పొందుతాడు. తన పాపం నశించగా అతడు అత్యంత సౌభాగ్యవంతుడౌతాడు. ఆ వ్రతపాలనచే అభాగ్యురాలైన సతి భాగ్యవంతురాలు అవుతుంది. పురుషుడు ఇహపరాలలో సుఖసమృద్ధులు పొందుతాడు, వారు జన్మ మృత్యువుల వలయం నుండి బయటపడతారు, సమస్తపాపం నశించగా వారు భగవద్భక్తిని పొందుతారు. మాంధాత ఆ ఏకాదశీ వ్రతపాలన ద్వారానే ముక్తుడయ్యాడు. ధుంధుమారుని వంటి ఎందరో రాజులు ఆ వ్రతపాలన ద్వారా మోక్షాన్ని పొందారు. వరూధినీ ఏకాదశి వ్రతాన్ని ఆచరించడంవల్ల మనిషి పదివేల సంవత్సరాల తపఃఫలాన్ని పొందగలుగుతాడు. కురుక్షేత్రంలో సూర్యగ్రహణసమయంలో నలభై కిలోల బంగారాన్ని దానం చేస్తే వచ్చే పుణ్యఫలం కేవలం ఆ వరూధినీ ఏకాదశీ వ్రతపాలనం ద్వారా మనిషి సాధించగలుగుతాడు".

"ఓ రాజోత్తమగా! అశ్వదానం కన్నను గజదానం శ్రేష్ఠమైనది. భూదానం గజదానం కన్నను శ్రేష్ఠమైనది. తిలాదానం భూదానం కన్నను శ్రేష్ఠం.



సువర్ణదానం తిలాదానం కన్నను, అన్నదానం సువర్ణదానం కన్నను శ్రేష్ఠములైనవి. నిజానికి అన్నదానం కంటే శ్రేష్ఠమైన దానం ఇంకొకటి లేనేలేదు. ఓ రాజశ్రేష్ఠుడా! అన్నదానంచే మనిషి పితృదేవతలను, దేవతలను, సకలజీవులను సంతృప్తిపరుపగలుగుతాడు. కన్యాదానం అన్నదానంతో సమానమని పండితులు చెబుతారు. అన్నదానం గోదానంతో సమానమని సాక్షాత్తుగా భగవంతుడే చెప్పాడు. అంతేగాక దానములు అన్నింటిలోను ఇతరులకు జ్ఞానదానం చేయుట అత్యున్నతమైన దానం".

"వరూధినీ ఏకాదశీ వ్రతపాలనంచే మనిషి సమస్తదానఫలితాన్ని పొందగలుగుతాడు. కుమార్తెను అమ్మి జీవికను సంపాదించే వ్యక్తి నిక్కంగా ఘోరపాపాన్ని మూటగట్టుకొనినవాడై ప్రలయానంతరం వరకు నరకంలో పడి ఉంటాడు. కనుక ఎవ్వడును కుమార్తెను తాకట్టు పెట్టరాదు. ఓ రాజరాజా! లోభముచే ఎవడేని కుమార్తెను అమ్ముకుంటే మరుసటి జన్మలో పిల్లి అవుతాడు. కాని ఎవడైతే శక్త్యనుసారము కుమార్తెను ఆభరణాలతో అలంకరించి యోగ్యుడైన వరునికి దానమిస్తాడో అతని పుణ్యపరిపాకాన్ని యమరాజు యొక్క ప్రధానకార్యదర్శియైన చిత్రగుప్తుడైనా గణించలేడు. ఆ ఏకాదశి వ్రతాన్ని పాటించేవాడు కంచుపాత్రలో భుజించరాదు, మాంసభక్షణం చేయరాదు, ఎఱ్ఱపప్పును, శనగపప్పును, పాలకూరను, తేనె, ఇతరులు వండిన దానిని, ఒకమారు కంటే ఎక్కువ గాని తినరాదు; ఏకాదశికి ముందురోజు నుండే మైథునక్రియలో పాల్గొనరాదు. జూదం, నిద్ర, తాంబూల సేవనం, ఇతరులను నిందించుట, పాపితో మాట్లాడుట, క్రోధి అగుట, ఏకాదశి రోజు అబద్ధం చెప్పుట వంటివి ఎంతమాత్రం చేయరాదు. ఏకాదశి మర్నాడు కూడ మనిషి కంచుపాత్రలో భుజించరాదు. మాంసభక్షణం, ఎఱ్ఱపప్పు వంటివి తినరాదు. తేనెను త్రాగరాదు. అసత్య భాషణం,

వ్యాయామం, కష్టించి పనిచేయడం, రెండు పూటల భోజనం, మైథున సంభోగం, గుండు గీసికొనుట లేదా గడ్డం చేసికొనుట, శరీరానికి తైలమర్దనం చేయరాదు. ఏకాదశీ వ్రతభంగానికి దారితీసే ఈ నిషేధాలను జాగరూకతతో పాటించాలి. ఇతర నిషేధాలను ఈ మూడు రోజులే కాకుండ ఎప్పటికీ పాటించాలి. ఈ నియమనిబంధనల ననుసరించి వరూథినీ ఏకాదశి వ్రతాన్ని పాటించే వ్యక్తి సమస్త పాపదూరుడై పరమగతిని పొందుతాడు. ఆ ఏకాదశి రోజున మేల్కొని ఉండి జనార్దనుని (శ్రీకృష్ణుని) సేవించేవాడు సమస్త పాపదూరుడై జీవిత చరమలక్ష్యాన్ని సాధిస్తాడు.

ఈ ఏకాదశి మహిమను వినేవాడు, చదివేవాడు వేయిగోవుల దానఫలితాన్ని నిక్కంగా పొందుతాడు; పాపముక్తుడై అతడు విష్ణుపదాన్ని చేరుకుంటాడు."

* * *

# 12. మోహినీ ఏకాదశి

## - వైశాఖమాసం శుక్లపక్షం

వైశాఖమాసంలోని శుక్లపక్షంలో వచ్చే మోహినీ ఏకాదశి మహిమను సూర్యపురాణంలో వివరించబడింది.

"ఓ జనార్దనా! వైశాఖమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి, దానిని ఆచరించే పద్ధతి ఏమిటి, దానిని ఆచరించడం వలన కలిగే ఫలితమేమిటి" అని ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగాడు. దానికి సమాధానంగా శ్రీకృష్ణుడు అతనితో "ధర్మనందనా! వశిష్ఠుడు శ్రీరామునికి తెలిసిన ఒక కథను నేను నీకు వివరిస్తాను సావధానంగా విను" అని పలికాడు.

ఒకసారి శ్రీరాముడు సీతాదేవి వియోగంతో మిక్కిలి వేదనకు గురియై సమస్త పాపాలను, దుఃఖాలను పోగొట్టే ఒక వ్రతాన్ని గురించి తనకు వివరించమని వశిష్ఠుని అడిగాడు. అపుడు వశిష్ఠుడు శ్రీరామునితో "రామచంద్రా! నీ ప్రశ్న సకల మానవాళికి లాభదాయకమైనది. కేవలం నీ మంగళకరనామాన్ని జపించడం చేతనే మానవులు పవిత్రులై సమస్త శుభాన్ని పొందగలుగుతారు. అయినా సాధారణమానవుల లాభం కొరకు నేను ఒక మహావ్రతాన్ని వివరిస్తాను. శ్రీరామా! వైశాఖ శుక్లపక్ష ఏకాదశి, మోహినీ ఏకాదశిగా ప్రసిద్ధి చెందింది. అది ఎంతో మంగళకరమైనది. ఆ ఏకాదశిని పాటించడం ద్వారా మనిషి యొక్క సమస్త పాపాలు, దుఃఖాలు పటాపంచలు అవుతాయి. దానికి సంబంధించిన పరమ మంగళకరమైన కథను ఇపుడు విను" అని అన్నాడు.

పవిత్ర సరస్వతీ నదీతీరంలో భద్రవతి అనే సుందరమైన నగరం ఉండేది. దానిని ద్యుతిమానుడనే రాజు పాలించేవాడు. అతడు చంద్రవంశానికి చెందినవాడు. సహిష్ణుత కలిగిన అతడు సత్యసంధుడై ఉండేవాడు. అదే

నగరంలో ధనపాలుడనే విష్ణుభక్తుడు కూడ జీవించేవాడు. వైశ్యవర్ణానికి చెందిన ధనపాలుడు ఎన్నో సత్రాలను, విద్యాలయాలను, విష్ణుమందిరాలను, వైద్యశాలలను, విశాలమైన రహదారులను నిర్మింపజేసాడు, మంచినీటి బావులను త్రవ్వించాడు, ఉద్యానవనాలను ఏర్పాటు చేశాడు, ఆహారవసతి కల్పించాడు. ఈ విధంగా తనకున్నట్టి ధనాన్ని సద్వినియోగపరచి అతడు తన పేరును నిలబెట్టుకున్నాడు. ఎల్లరికి శ్రేయోభిలాషియైనట్టి ఈ విష్ణుభక్తునికి శమనుడు, ద్యుతిమానుడు, మేధావి, సుకృతి, ధృష్టబుద్ధి అనే ఐదుగురు పుత్రులు ఉన్నారు. వారిలో ధృష్టబుద్ధి పరమపాపి. కుమతి, చెడు ప్రవర్తన కలిగినవాడు అయిన ధృష్టబుద్ధి వేశ్యాసాంగత్యంను కలిగినవాడై జూదం, మద్యపానం పట్ల మక్కువ చూపేవాడు. ఇతర ప్రాణులను చంపడంలో, హింసించడంలో అతనికి ఆనందం కలిగేది. కులకళంకంగా తయారైన అతడు దేవతలకు, అతిథులకు, పితృదేవతలకు, బ్రాహ్మణులకు ఏ మాత్రం గౌరవం ఇవ్వలేదు. పాపియైన అతడు తండ్రి ధనాన్ని దుర్వినియోగం చేసేవాడు. ఒకసారి అతను రహదారిలో ఒక వేశ్యభుజంపై చేయివేసి నడవడాన్ని చూసి చలించిపోయిన ధనపాలుడు అతనిని ఇంటి నుండి తరిమివేశాడు. ఈ విధంగా తల్లిదండ్రులు, బంధుమిత్రులు అందరి ప్రేమను కోల్పోయి వీధిలో పడిన ధృష్టబుద్ధి తనకున్న వస్త్రాభరణాలను అమ్ముకొని కొంతకాలం తన పాపకార్యాలను కొనసాగించాడు. ఆ ధనం కూడా ఖర్చు కాగానే నిజమైన కష్టాలు ఆరంభమైనాయి. తగినంత ఆహారం లభించక అతడు బక్కచిక్కిపోయాడు.

చింతాగ్రస్తుడైన ధృష్టబుద్ధి ఇక చేసేదిలేక దొంగతనానికి సిద్ధపడ్డాడు. ఒక్కొక్కసారి రక్షకభటులకు చిక్కినా అతని తండ్రి గొప్పతనాన్ని చూసి వారు అతనిని వదలివేసేవారు. కాని ఒకసారి అతడు ఒక పెద్ద దొంగతనం చేసి పట్టుబడ్డాడు. అపుడు రాజు అతనికి దేశబహిష్కరణ శిక్ష విధించాడు.



ఆ విధంగా దేశబహిష్కరణ శిక్షకు గురియైన ధృష్టబుద్ధి ఒక కీకారణ్యంలో ప్రవేశించి ఆకలిదప్పులకు లోనై విచక్షణారహితంగా పశువులను, పక్షులను చంపి పచ్చిమాంసాన్నే తినసాగాడు. విల్లంబులు పట్టుకొని ప్రాణిహింస అనే పాపం చేస్తూ అతడు అనేకసంవత్సరాలు గడిపాడు.

ఆ విధంగా అడవిలో సంచరిస్తూ ఉండగా ఒకరోజు ధృష్టబుద్ధి కౌండిన్యఋషి ఆశ్రమంలో ప్రవేశించడం జరిగింది. అది వైశాఖమాసం. ఆ ఋషి గంగానదిలో స్నానం చేసి అప్పుడే ఆశ్రమానికి తిరిగి వస్తున్నాడు. దైవవశంగా ఆ ఋషి వస్త్రం నుండి ఒక నీటిచుక్క మీద పడింది. దానితో అతని సమస్త పాపాలు నశించాయి. వెంటనే పరివర్తన కలిగిన ధృష్టబుద్ధి, ఆ మునికి నమస్కరించి తన పాపాలకు ప్రాయశ్చిత్తం తెలుపుమని ప్రార్థించాడు. అతని మాటలను వినిన కౌండిన్యఋషి కరుణాంతరంగుడై ఈ విధంగా పలికాడు. “నీ పాపాలన్నీ కూడ శీఘ్రగతి నశించే ఉదాత్తమైన పద్ధతిని చెబుతాను విను. వైశాఖమాసం శుక్లపక్షంలో వచ్చే మోహినీ ఏకాదశి మేరుపర్వతమంత పాపరాశినైనా నశింపజేస్తుంది. కనుక ఆ ఏకాదశిని నీవు శ్రద్ధతో ఆచరించు”.

కౌండిన్యఋషి చెప్పిన మాటలను వినిన ధృష్టబుద్ధి ఆయన ఉపదేశించిన విధి ననుసరించి మోహిని ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించాడు. ఆ వ్రత పాలనంచే అతడు సమస్తపాపదూరుడై తదనంతరం దివ్యదేహాన్ని పొంది గరుడవాహనం మీద వైకుంఠానికి వెళ్ళాడు.

ఈ ఏకాదశీవ్రతం మాయను తొలగించి అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేస్తుంది. తీర్థస్నానం, దానం, యజ్ఞాచరణం వలన కలిగే పుణ్యరాశియైనా ఈ మోహిని ఏకాదశి వ్రతపాలనం వలన కలిగే పుణ్యంతో సరిపోలదు.

* * *

# 13. అపర ఏకాదశి

## - జ్యేష్ఠమాసం కృష్ణపక్షం

జ్యేష్ఠమాసం కృష్ణపక్షంలో వచ్చే అపర ఏకాదశీ వృత్తాంతం శ్రీకృష్ణ యుధిష్ఠిర సంవాద రూపంలో బ్రహ్మాండపురాణంలో వర్ణించబడింది.

"జ్యేష్ఠమాసం కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి, దాని మాహాత్మ్య మేమిటి, ఆ వివరాలు నాకు చెప్పవలసింది" అంటూ ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగాడు.

దానికి శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మరాజా! నీవు అడిగిన వివేకపూర్ణమైనట్టి ప్రశ్న నిజానికి అందరికీ ఎంతో లాభదాయకమైంది. ఆ ఏకాదశి పేరు అపర ఏకాదశి. రాజా! ఈ ఏకాదశి పాటిస్తే అనంతమైన పుణ్యాన్ని ప్రసాదించి సమస్త పాపాలను నశింపజేస్తుంది. బ్రాహ్మణ హత్య, గోహత్య, భ్రూణహత్య, పరనింద, అక్రమ సంబంధాలు, అసత్యవాదం, తప్పుడు సాక్ష్యాలు ఇవ్వడం, డంబములు చెప్పుకోవడం, డబ్బు కొరకు వేదాలను పఠించడం లేదా బోధించడం, స్వంతశాస్త్ర కల్పనం వంటి ఘోరమైన పాపాలైనా ఈ ఏకాదశీ వ్రతపాలనతో నశించిపోతాయి. మోసగాడు, మిథ్యాజ్యోతిష్కుడు, దొంగవైద్యుడు – వంటివారు తప్పుడు సాక్ష్యమిచ్చే వారంతటి పాపాత్ములే అయినప్పటికిని ఇటువంటి పాపాలన్నీ అపర ఏకాదశి వ్రతపాలనతో దూరమౌతాయి. తన ధర్మాన్ని త్యజించి యుద్ధరంగం నుండి పారిపోయిన క్షత్రియుడు నిశ్చయంగా పతనం చెంది నరకంలో పడతాడు. అటువంటి వ్యక్తియైనా ఈ ఏకాదశిని పాటిస్తే స్వర్గాన్ని చేరుకుంటాడు".

"రాజా! గురువు నుండి జ్ఞానాన్ని పొందిన తరువాత గురుదూషణను చేసే శిష్యుడు నిక్కంగా పాపాన్ని మూట కట్టుకుంటాడు. అంతటి పాపియైనా కూడ అపర ఏకాదశి పాలన ద్వారా పాపవిముక్తుడై పరమగతిని పొంద–



గలుగుతాడు. రాజేంద్రా! కార్తీకమాసంలో పుష్కరతీర్థంలో ముమ్మార్లు స్నానం చేసిన ఫలితం, పుష్యమాసంలో సూర్యుడు మకరసంక్రమణం చేసే సమయంలో ప్రయాగలో స్నానమాడిన ఫలితం, కాశీలో శివరాత్రివ్రతాన్ని పాటించిన ఫలితం, గయలో విష్ణుపాదాల చెంత పిండప్రదానం చేసిన ఫలితం, గురువు సింహరాశిలో ప్రవేశించినపుడు గౌతమీనదిలో స్నానమాడిన ఫలితం, కుంభమేళా సమయంలో కేదారనాథక్షేత్ర దర్శనఫలం, బదరీనాథ్ క్షేత్ర దర్శనపూజాఫలం, సూర్యగ్రహణ సమయంలో కురుక్షేత్రంలో స్నానఫలం, ఏనుగులు, గుఱ్ఱములు, గోవులు, సువర్ణం, భూమి మున్నగువాటిని దానమిచ్చిన ఫలం అన్నీ కూడ అపర ఏకాదశి వ్రతపాలనచే సులభంగా లభిస్తాయి. ఇది పాపవృక్షాన్ని కూల్చివేసే పదునైన గొడ్డలి వంటిది, పాపమనే అరణ్యాలను దహింపజేసే తీవ్రమైన దావానలం, ఇది పాపం నుండి పుట్టిన చీకటిని పటాపంచలు చేసే సూర్యుడు, పాపాటవిలో జింకకు ఇది సింహం వంటిది. రాజా! ఈ అపర ఏకాదశిని పాటించడం ద్వారా విష్ణువును త్రివిక్రముని రూపంలో ఆరాధించడం ద్వారా మనిషి సర్వమంగళమైన విష్ణుపదాన్ని పొందుతాడు.

అందరి లాభం కొరకు నేను నీకు చెప్పినట్టి ఈ ఏకాదశీ మాహాత్మ్యాన్ని వినేవాడు, చదివేవాడు సర్వపాపవిముక్తుడౌతాడు."

* * *

# 14. నిర్జల ఏకాదశి

## - జ్యేష్ఠమాసం శుక్లపక్షం

జ్యేష్ఠమాసంలో శుక్లపక్షంలో వచ్చే నిర్జల ఏకాదశి వర్ణనం బ్రహ్మవైవర్త పురాణంలోని వ్యాసదేవభీమసేనసంవాదంలో కనబడుతుంది.

భీమసేనుడు ఒకసారి మహాముని వ్యాసదేవుని ఇలా అడిగాడు. "ఓ మహామునీ! నా విన్నపం వినండి. నా జ్యేష్ఠసోదరుడు ధర్మరాజు, తల్లి కుంతీదేవి, సోదరులైన అర్జుననకులసహదేవులు, ద్రౌపది ఏకాదశి రోజున ఏదీ తినరు. నేను కూడ ఏకాదశిరోజున ఉపవాసం చేయాలని వారందరు, ముఖ్యంగా ధర్మరాజు ఎప్పుడూ చెబుతుంటారు. ఏకాదశి రోజున ఉపవాసం అనేది శాస్త్రాలలో చెపబడినదని నాకు తెలిసినప్పటికిని ఆకలిని నేను భరించలేను కనుక ఉపవాసం చేయడం నాకు సాధ్యం కాదని నేను వారికి చెబుతుంటాను. నేను నా శక్త్యానుసారం దానమివ్వగలను, యథావిధిగా కేశవుని అర్చించగలను; కాని ఉపవాసం మాత్రం చేయలేను. కాబట్టి ఉపవాసం లేకుండ ఏకాదశిఫలాన్ని నేనెట్లా పొందగలనో నాకు ఉపదేశించ వలసింది".

భీమసేనుని ఈ పలుకులను వినిన వ్యాసదేవుడు అతనితో "భీమా! నీవు స్వర్గలోకాలకు వెళ్ళాలనుకుంటే, నరకలోక వాసాన్ని తప్పించుకోవాలంటే ప్రతీనెల రెండు ఏకాదశి దినాలలో తప్పక ఉపవాసం చేయాలి" అని అన్నాడు.

అపుడు భీముడు వ్యాసునితో "మహామునీ! ప్రతీ సంవత్సరం 24 ఏకాదశి దినాలలో ఉపవాసం చేయడం నాకు అసాధ్యం. ఆకలిని నేను క్షణకాలం కూడ భరించలేను. వృకమనే జఠరాగ్ని నా కడుపులో ఎప్పుడూ ఉంటుంది. కేవలం అతిభోజనం ద్వారానే అది చల్లారుతుంది. అయినా అతి ప్రయత్నంతో నేను సంవత్సరంలో ఒక రోజు ఉపవాసం చేయగలను. కాబట్టి ఇహపరాలలో



శుభాన్ని పొందడానికి నేను ఆచరించగలిగే వ్రతాన్ని నాకు ఉపదేశించండి" అని అన్నాడు.

దానికి వ్యాసదేవుడు పలుకుతూ "రాజా! వేదనియమాలను గురించి, మానవుల కర్తవ్యాలను గురించి ఇదివరకే నీవు నా నుండి విన్నావు. కాని కలియుగంలో ప్రతియొక్కరు నియమనిబంధనలను పాటించలేరు. కాబట్టి మహోన్నత ఫలితాలను సాధించగలిగే ఉదాత్తమైన పద్ధతిని నేను నీకు చెబుతాను. ఇది సమస్త పురాణసారం. శుక్ల, కృష్ణ పక్షాలలో వచ్చే ఏకాదశి దినాలను పాటించేవాడు ఎన్నడును నరకానికి పోడు" అని అన్నాడు.

వ్యాసదేవుని మాటలను వినిన పరమబలశాలి యోధుడైన భీమసేనుడు భయంతో అశ్వత్థవృక్ష ఆకులాగా వణికిపోయి ఆయనతో "మహామునీ! నేనేం చేసేది? సంవత్సరమంతా నెలకు రెండుసార్లు పూర్తిగా ఉపవాసం చేయడం నాకు అసాధ్యం. కనుక హే ప్రభూ! పరమపుణ్యమైనట్టి వ్రతాన్ని, దానిని అనుసరించడం ద్వారా నేను అనేకఫలితాలను పొందే పద్ధతిని దయతో నాకు ఉపదేశించండి" అని అన్నాడు.

భీముని మాటలకు బదులుగా వ్యాసదేవుడు ఇలా అన్నాడు. "జేష్ఠమాసం శుక్లపక్షంలో సూర్యుడు వృషభరాశిలో గాని, మిథునరాశిలో గాని ఉన్నప్పుడు వచ్చే ఏకాదశి పేరు నిర్జల ఏకాదశి. ఆ ఏకాదశిరోజు మనిషి పూర్తి ఉపవాసాన్ని పాటించాలి. మంచినీళ్ళైనా త్రాగరాదు. ఆ రోజు ఆచమనం చేసినపుడు ఆవగింజ లేదా బంగారు కణిక మునిగేటంత జలంతో మాత్రమే ఆ కార్యాన్ని పూర్తిచేయాలి. అంత స్వల్పజలాన్ని అరచేతిలో వేసికొని గోకర్ణాన్ని తాకే విధంగా దానిని పట్టుకోవాలి. అంతకంటే ఎక్కువ గాని, తక్కువ గాని జలాన్ని త్రాగితే అది సురాపానంతో సమానమౌతుంది".

"ఆ ఏకాదశి రోజు ఏదీ తినకూడదు. లేకపోతే వ్రతభంగమవుతుంది. ద్వాదశిరోజు సూర్యోదయం వరకు మంచినీళ్ళైనా త్రాగకూడదు. మనిషి ఈ విధంగా ఈ ఏకాదశిని నిర్జలంగా పాటిస్తే సంవత్సరంలోని అన్ని ఏకాదశిలను పాటించిన ఫలాన్ని పొందగలుగుతాడు".

"ద్వాదశిరోజు తెల్లవారుజామున అతడు స్నానం చేసి బంగారాన్ని, జలాన్ని బ్రాహ్మణులకు దానం ఇవ్వాలి. తరువాత అతడు బ్రాహ్మణులతో కలిసి ఆనందంగా భోజనం చేయవచ్చును". "భీమసేనా! ఈ ఏకాదశిని పాటించడం ద్వారా వచ్చే పుణ్యాన్ని ఇపుడు విను. ఈ ఏకాదశిని పాటించడం ద్వారా సంవత్సరంలోని అన్ని ఏకాదశిలను పాటించిన ఫలం దక్కుతుంది. శంఖచక్రగదాపద్మధారియైన విష్ణుభగవానుడు ఒకసారి నాతో పలుకుతూ "సర్వధర్మాలను విడిచి నాకు శరణాగతుడై ఈ నిర్జల ఏకాదశిని పాటించే వ్యక్తి నాకు అత్యంత ప్రియమైనవాడు; అతడు నిశ్చయంగా సకల పాపవిముక్తుడౌతాడు. దానం చేయడం ద్వారా ఎవ్వరును పరమగతిని పొందలేరు; స్మార్తవిధిని అనుసరించడం ద్వారా ఎట్టి లాభాన్ని పొందలేరు. నిజానికి దోషదూషితమైన కలియుగంలో వైదిక ధర్మనియమాలు లుప్తమై ఉంటాయి" అని అన్నాడు.

"వాయునందనా! ఇంతకన్న నీకు చెప్పేదేమున్నది? ఏకాదశి రోజులలో భోజనం నిషేధించబడింది. నిర్జల ఏకాదశి రోజు జలపానం కూడ నిషేధించబడింది. ఈ ఏకాదశిని పాటించడం ద్వారా మనిషి సకలతీర్థక్షేత్ర దర్శన పుణ్యాన్ని పొందుతాడు. అటువంటి వ్యక్తికి మరణసమయంలో భీకరాకారులైన యమదూతలు కనబడరు. దివ్యరూప ధారులైన విష్ణుదూతలు వచ్చి అతనిని విష్ణులోకానికి తీసికొనిపోతారు. ఈ ఏకాదశీ వ్రతం తరువాత జలాన్ని, గోవులను దానం చేసేవాడు సకల పాపవిముక్తుడౌతాడు".



మిగిలిన పాండవులు ఈ ఏకాదశీ మహిమను వినినంతట దానిని శ్రద్ధతో పాటించాలని దృఢంగా నిశ్చయించుకున్నారు. ఆ రోజు నుండి భీమసేనుడు నిర్జల ఏకాదశిని పాటించడం ఆరంభించాడు. అందువలననే ఇది పాండవనిర్జలఏకాదశి లేదా భీమసేన ఏకాదశి అని ప్రసిద్ధి చెందింది. ఈ ఏకాదశిని పాటించడం ద్వారా సుమేరు పర్వతమంతటి లేదా మందర పర్వతమంతటి పాపమైనా భస్మమైపోతుంది. రాజా! ఈ నిర్జల ఏకాదశి రోజు చేసే తీర్థస్నానం, దానం, వేదమంత్రోచ్చారణం, యజ్ఞనిర్వహణం వంటి పుణ్యకార్యాలు నశింపులేనివిగా అవుతాయని శ్రీకృష్ణుడే ప్రకటించాడు.

ఈ ఏకాదశి మహిమను భక్తితో చదివేవాడు లేదా వినేవాడు వైకుంఠ లోకానికి వెళతాడు. ప్రతిపదతో కలిసినట్టి అమావాస్య వ్రతాన్ని పాటించడం ద్వారాను, సూర్యగ్రహణ సమయంలో పితృతర్పణముల ద్వారాను లభించే ఫలం కేవలం ఈ ఏకాదశి మహిమను వినడం చేత కల్గుతుంది.

* * *

# 15. యోగినీ ఏకాదశి

**- ఆషాఢమాసం కృష్ణపక్షం**

ఆషాఢమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే యోగినీ ఏకాదశి మహిమ శ్రీకృష్ణయుధిష్ఠిర సంవాదరూపంలో బ్రహ్మవైవర్త పురాణంలో వర్ణింపబడింది.

ఒకసారి ధర్మరాజు శ్రీకృష్ణునితో "ఓ దేవా! మధుసూదనా! నిర్జల ఏకాదశిమహిమను నేను విన్నాను. ఇక ఇపుడు ఆషాఢమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశిని గురించి వినగోరుతున్నాను" అని అన్నాడు. దానికి దేవకీదేవుడు ఇలా వివరించాడు. "రాజా! యోగినీ ఏకాదశి అని పిలువబడే ఆ ఏకాదశిని గురించి నేను నీకు వివరిస్తాను. అది మనిషి యొక్క ఘోరమైన పాపాలను నశింపజేసి అతనిని సంసారసాగరం నుండి ఉద్ధరిస్తుంది. ఈ సత్యాన్ని వివరించడానికి ఇప్పుడొక పురాణకథను తెలియజేస్తాను" అని పలికి ఆ కథను వివరించసాగాడు.

అలకాపురి రాజైన కుబేరుడు గొప్ప శివభక్తుడు. అతడు నిత్యం శివారాధన చేసేవాడు. అతని దగ్గర హేముడనే ఒక యక్షుడు తోటమాలిగా ఉండేవాడు. అతని భార్య విశాలాక్షి. ఆమె అతిసౌందర్యవతి. ఆమె పట్ల హేముడు అమితానురక్తుడై ఉండేవాడు. హేముడు నిత్యం మానససరోవరం నుండి పుష్పాలను తెచ్చి శివపూజార్థమై యక్షరాజగు కుబేరునికి ఇచ్చేవాడు. ఒకరోజు అతడు మానససరోవరమునుండి పుష్పాలను తెచ్చినప్పటికిని వాటిని కుబేరునికి ఇవ్వక భార్యప్రేమచే బద్ధుడై ఇంటిలోనే ఉండిపోయాడు. తత్కారణంగా ఆ రోజు కుబేరునికి పూలు అందలేదు. హేముని కొరకు అతడు ఆరుగంటలు ఎదురుచూశాడు. పూలు లేకపోవడం వలన శివారాధనను పూర్తి చేయలేక అతనికి తీవ్రమైన కోపం వచ్చింది. తోటమాలి చేసిన ఆలస్యానికి కారణమేమిటో తెలిసికోమని అతడు ఒక దూతను పంపాడు.

హేముడు భార్యతోగూడి ఇంటిలో భోగవిలాసాలలో ఉన్నాడని విని కుబేరుడు అగ్రహోదగ్రుడై వెంటనే అతనిని తన చెంతకు తీసికొనిరమ్మని భటులను పంపాడు. తన పొరబాటును తెలిసికొనిన హేముడు ఎంతో సిగ్గుపడి భయంతో కుబేరుని దగ్గరకు వచ్చి వందనం చేశాడు. అతనిని చూడగానే కుబేరుని శరీరం కంపించింది, కళ్ళు ఎఱ్ఱబడ్డాయి. తీవ్రమైన కోపంతో అతడు "ఓరీ పాపీ! ధర్మవినాశకుడా! నా పరమారాధనీయుడగు శివుని నిర్లక్ష్యపరచి నీవు ఇంద్రియభోగంలో నెలకొన్నావు. కనుక నీకు శ్వేతకుష్ఠు సంప్రాప్తించుగాక! నీ భార్యతో నీకు నిరంతరవియోగం కలుగుగాక! ఓరీ మూర్ఖుడా! వెంటనే నీవు ఈ ప్రదేశంను విడిచి వెళ్ళిపో" అని శపించి హేముని గెంటివేశాడు.

కుబేరునిచే శపితుడైన హేముడు వెంటనే అలకాపురి నుండి పతనం చెంది ఈ భువిలో జన్మించాడు. శ్వేతకుష్ఠు సంప్రాప్తించగా అతడు తీవ్రమైన దుఃఖపరిస్థితులకు లోనయ్యాడు. తీవ్రమైన మానసికక్షోభ చేత, ఆకలిదప్పుల చేత అతడు ఒకసారి దట్టమైన అరణ్యంలో ప్రవేశించాడు. అచట అతడు పగటిపూట తీవ్రమైన దుఃఖాన్ని, రాత్రిపూట నిద్రలేమిని అనుభవించాడు. ఆ విధంగా చలికాలం, ఎండాకాలం కూడ గడచిపోయాయి. కాని శివపూజలో సహాయపడిన కారణంగా అతని స్మృతి మాత్రం చెక్కుచెదరలేదు. అనేక పాపాలు చేసినప్పటికిని అతడు పూర్వకర్మలను చక్కగా స్మృతి పథంలో నిలుపుకున్నాడు. అతని చిత్తం విశుద్ధంగాను, అప్రమత్తంగాను ఉండేది. ఆ విధంగా అడవిలో చరిస్తూ అదృష్టవశాత్తుగా అతడు మార్కండేయ ఋషిని కలిసికొన్నాడు. ఆ ఋషి ఆయువు ఏడు కల్పాలు. తాను పరమపాపినని భావించిన హేముడు దూరం నుండే ఆ ఋషికి పదేపదే నమస్కరించాడు. కరుణాహృదయుడైన మార్కండేయుడు అతనిని చెంతకు పిలిచి ఆ కుష్ఠువ్యాధి ఎలా వచ్చిందని, అంతటి దయనీయస్థితి సంప్రాప్తించడానికి అతడు చేసిన పాపమేమిటని ప్రశ్నించాడు.

మార్కండేయ ఋషి ప్రశ్నలకు బదులుగా హేముడు ఆయనతో "ఓ మునివర్యా! నేను కుబేరుని తోటమాలి హేముడను. మానససరోవరం నుండి ప్రతిరోజు నేను పూలు తెచ్చి నా ప్రభువు కుబేరునికి ఇస్తే ఆయన వాటితో శివారాధనం చేసేవాడు. కాని ఒకరోజు భార్యాలోలుడనైన కారణంగా పూలు ఇవ్వడంలో ఆలస్యమైంది. దానికి కోపించిన కుబేరుడు నాకు శ్వేతకుష్ఠు సంప్రాప్తిస్తుందని, నిరంతర భార్యావియోగం కలుగుతుందని శపించాడు. కాని పరమదురదృష్టవంతుడనైన నేను మిమ్ము కలిసేటంత భాగ్యవంతుడను ఏ విధంగా అయితినో తెలియట్లేదు. పరుల దుఃఖాన్ని చూసి సాధువుల హృదయం దుఃఖితమౌతుందని, వారు సదా సంక్షేమకార్యాలలో నెలకొని ఉంటారని విన్నాను. ఓ మహామునీ! ఈ పతితుడు ఈ రోజు మీకు శరణాగతుడయ్యాడు. దయచేసి నన్ను ఉద్ధరించండి" అని విన్నవించాడు.

అపుడు మార్కండేయఋషి దయార్ద్రహృదయుడై అతనితో "ఓ తోటమాలీ! పరమమంగళకరమైనది, లాభకరమైనది అయిన వ్రతాన్ని నీకు చెబుతాను. ఆషాఢమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే యోగినీ ఏకాదశిని నీవు శ్రద్ధతో పాటించు. దాని ప్రభావంతో నీవు ఈ కుష్ఠురోగం నుండి బయటపడతావు" అని అన్నాడు. మార్కండేయముని ఉపదేశాన్ని వినిన హేముడు ఆనందంతో ఆ ఋషికి పదేపదే నమస్కరించాడు. తరువాత ఆయన ఆదేశానుసారం అతడు పవిత్రమైన ఏకాదశీ వ్రతాన్ని పాటించాడు. ఆ వ్రతప్రభావంతో అతనికి పూర్వ దివ్యరూపం తిరిగి వచ్చింది. తరువాత అతడు ఇంటికి తిరిగి చేరి తన భార్యను కలిసికొన్నాడు.

ఎనుబది ఎనిమిదివేల మంది బ్రాహ్మణులకు సంతర్పణ చేయగా వచ్చే ఫలం కేవలం ఈ యోగినీ ఏకాదశీ వ్రతపాలన వలన కల్గుతుంది. ఇది మనిషి యొక్క సమస్తపాపాలను నశింపజేసి అమిత పుణ్యాన్ని చేకూరుస్తుంది.

* * *

# 16. శయన ఏకాదశి

## - ఆషాఢమాసం శుక్లపక్షం

శయన ఏకాదశి (దేవశయని లేదా పద్మ ఏకాదశి) వృత్తాంతం శ్రీకృష్ణ ధర్మరాజ సంవాదరూపంలో భవిష్యోత్తరపురాణంలో వర్ణించబడింది.

ఆషాఢమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని గురించి, ఆ పవిత్రమైన రోజున చేయవలసిన వ్రతం గురించి ఒకసారి ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగాడు. అదే ప్రశ్నను నారదుడు ఒకమారు బ్రహ్మదేవుని అడిగాడని, బ్రహ్మ అతనికి తెలిపిన అద్భుతమైన చరిత్రను తాను వివరిస్తానని శ్రీకృష్ణుడు తెలిపాడు.

మునిశ్రేష్ఠుడగు నారదుడు ఒకసారి తన తండ్రిని సమీపించి "తండ్రీ! ఆషాఢమాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి? విష్ణుప్రీత్యర్థమై ఆ ఏకాదశి వ్రతపాలన చేసే విధానాన్ని నాకు తెలియజేయలసినది" అని ప్రార్థించాడు. అది వినిన బ్రహ్మ అతనితో "ఏకాదశీ వ్రతమంతటి పవిత్రమైన వ్రతం ఈ భౌతికజగత్తులో వేరొక్కటి లేనే లేదు. సమస్తపాపాలను నశింపజేయడానికి మనిషి తప్పనిసరిగా ఏకాదశివ్రతాన్ని పాటించాలి. ఏకాదశీవ్రతపాలన చేయనివాడు నరకగామి అవుతాడు. ఆషాఢశుక్లపక్షంలో వచ్చే ఏకాదశి శయన లేదా పద్మ ఏకాదశి అని పిలువబడుతుంది. హృషీకేశుని ప్రీత్యర్థమై మనుజుడు ఈ ఏకాదశిని పాటించాలి" అని అన్నాడు.

ప్రపంచచక్రవర్తి, రాజర్షియైన మాంధాత గురించి పురాణాలలో చెప్పబడింది. అతడు సూర్యవంశంలో జన్మించాడు. పరమశక్తిమంతుడు, సత్యసంధుడు అయిన అతడు ప్రజలను కన్నబిడ్డలలాగా పాలించేవాడు. అతని రాజ్యంలో కరువుకాటకాలు గాని, ఏ విధమైన రోగం కాని ఉండేవి కావు. ప్రజలందరు సుఖశాంతులతో జీవిస్తూ సమృద్ధిగా ఉండేవారు. మాంధాతకోశాగారంలో అధర్మయుతసంపాదన ఉండేది కాదు. ఆ ప్రకారంగా రాజు, ప్రజలు ఆనందంగా కాలం గడపసాగారు.

కొన్ని సంవత్సరాల తరువాత విధివశాత్తుగా మూడు సంవత్సరాలు వానలు కురవలేదు. ఫలితంగా ప్రజలు ఆకలిపీడితులై చింతాపూర్ణులయ్యారు. ఆహార కొరత వలన కలిగిన దుఃఖఫలితంగా యజ్ఞయాగాదులు, వేదాధ్యయనం నిలిచిపోయాయి. అపుడు ప్రజలందరు రాజు వద్దకు వెళ్ళి అతనితో ఇలా అన్నారు. "రాజా! మేము చెప్పేది విను. శాస్త్రాలలో నారం అంటే జలం అని చెప్పబడింది, ఇక భగవానుడు దానిలో వసించువాడు కనుక నారాయణుడయ్యాడు. మేఘరూపంలో ఆతడు సర్వవ్యాపియై ఉన్నాడు. వర్షం కురియుటకు ఆతడొక్కడే కారణుడు. వర్షం వలన ధాన్యం ఉత్పత్తి అవుతుంది. ధాన్యంపై ఆధారపడి జీవులు బ్రతుకుతారు. ప్రస్తుతం ఆహారకొరత వలన నీ ప్రజలమగు మేము దుఃఖితులై ఉన్నాము. కనుక ఓ రాజోత్తమా! ఈ విపత్కరపరిస్థితికి ఏదో ఒక పరిష్కారాన్ని కనుగొని మాకు తిరిగి శాంతిని, సమృద్ధిని ప్రసాదించు".

ప్రజల మాటలను వినిన రాజు వారితో "మీరు చెప్పినది నిజమే. అన్నం పరబ్రహ్మస్వరూపమని చెప్పబడింది. జీవులందరు అన్నంపైన ఆధారపడియే జీవిస్తారు. రాజు చేసిన పాపాల వలననే రాజు, అతని ప్రజలు కష్టాల పాలవుతారని పురాణాలలో చెప్పబడింది. నేను చేసిన దోషమేమిటో నా బుద్ధితో నేను తెలిసికోలేకపోతున్నాను. అయినా నా ప్రజలైన మీ కొరకు నేను ఏదో ఒకటి చేస్తాను" అని అన్నాడు.

ఈ విధంగా పలికిన మాంధాత ముఖ్యసైన్యాన్ని తీసికొని బ్రహ్మకు నమస్కరించి అరణ్యంలో ప్రవేశించాడు. అరణ్యంలో అతడు నిత్యం ఋష్యాశ్రమాలను సందర్శించాడు. అడవిలో తిరుగుతున్నప్పుడు అదృష్టవశాత్తుగా అతడు బ్రహ్మతనయుడైన అంగిర ఋషిని కలిశాడు. బ్రహ్మతేజస్సుతో వెలుగొందుతున్న అంగిరఋషి తన తేజస్సుతో నలుదిక్కులను ప్రకాశింప జేస్తున్నాడు. రాజు ఆయనను చూడగానే తన వాహనం నుండి క్రిందకు దిగి పాదాభివందనం చేశాడు. ఋషి ఆ రాజును ఆశీర్వదించాడు. తరువాత అంగిరఋషి మాంధాతను క్షేమసమాచారాలు



అడుగగా ఆ రాజు మూడు సంవత్సరాల నుండి వర్షాలు కురియుట లేదని, తత్ఫలితంగా తన ప్రజలు అనేకకష్టాల పాలవుతున్నారని, ఆ కరువు కాటకాలకు కారణమేమిటో తనకు తెలియుట లేదని పలికాడు. తన ప్రజలు తిరిగి సుఖశాంతులను పొందే విధానాన్ని తెలియజేయమని ప్రార్థించాడు.

అది వినిన అంగిరఋషి రాజుతో "రాజా! ఇది సత్యయుగం. అన్ని యుగాలలోకి సర్వోత్తమమైన యుగం. ఈ యుగంలో జనులు పరబ్రహ్మారాధనలో ఉంటారు. ధర్మం నాల్గుపాదాలతో నడుస్తుంది. బ్రాహ్మణులు తప్ప వేరెవ్వరు ఈ యుగంలో తపస్సు చేయరాదు. ఈ నియమం ఉన్నప్పటికిని ఒక శూద్రుడు నీ రాజ్యంలో తపస్సు చేస్తున్నాడు. ఈ అధర్మయుత ప్రవర్తన కారణంగానే నీ రాజ్యంలో కరువు సంభవించింది. కనుక అతనిని వధించి నీ రాజ్యంలో శాంతిసమృద్ధులను నెలకొల్పుము" అని చెప్పాడు.

తపోనిష్ఠుడైన అమాయకుణ్ణి వధించడం తనకు అసాధ్యమని, అందువలన తనకు వేరే సులభపరిష్కారం తెలుపుమని రాజు ఆయనను ప్రార్థించాడు.

"రాజా! అయితే ఆషాఢశుక్లపక్షంలో వచ్చే పద్మ ఏకాదశి లేదా దేవశయన ఏకాదశీవ్రతాన్ని నీవు పాటించు. ఆ వ్రతప్రభావం వలన నీ రాజ్యంలో తప్పకుండా వర్షాలు కురుస్తాయి. ఈ ఏకాదశి మనిషికి సమస్తమంగళాన్ని చేకూర్చి పూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది. పూర్ణత్వపథంలోని సమస్త అడ్డంకులను అది తొలగిస్తుంది. కనుక నీ ప్రజలతో పాటుగా నీవు ఈ ఏకాదశీవ్రతాన్ని పాటించు" అని అంగీర ఋషి పలికాడు.

ఋషివాక్యాలను వినిన మాంధాత నగరానికి తిరిగి వచ్చి ఆషాఢ మాసంలో బంధుమిత్రపరివార సహితంగా శయన ఏకాదశీవ్రతాన్ని పాటించాడు. ఆ వ్రతప్రభావం వలన రాజ్యంలో విరివిగా వర్షాలు కురిశాయి. నీటి కొరత తీరిపోగానే రాజ్యమంతా ధాన్యరాశితో నిండిపోయింది. అపుడు హృషీకేశుని అనుగ్రహం చేత అందరు సుఖంగా జీవించారు. కనుక

సుఖసంతోషాలను, ముక్తిని ప్రసాదించే ఈ పవిత్రమైన ఏకాదశిని ప్రతియొక్కరు తప్పకుండా పాటించాలి. ఈ ఏకాదశీమాహాత్మ్యాన్ని వినేవాడు, చదివేవాడు సమస్తపాపవిముక్తుడౌతాడు.

ఈ ఏకాదశి విష్ణుశయన ఏకాదశి అని కూడా పిలువబడుతుంది. విష్ణుప్రీత్యర్థమై భక్తులు దీనిని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారు. వారు ఇంద్రియభోగాన్ని కాని, ముక్తిని గాని కోరక కేవలం విశుద్ధభక్తినే కోరుకుంటారు. సుప్రసిద్ధమైన చాతుర్మాస్య వ్రతం ఈ ఏకాదశి నుండే ఆరంభమౌతుంది. శ్రీహరి నిద్రకు ఉపక్రమించే ఆ రోజు నుండి ఆతడు మేల్కొనే రోజు వరకు భక్తులు భగవల్లీలలను వింటూ, కీర్తిస్తూ చాతుర్మాస్య వ్రతాన్ని పాటిస్తారు.

శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పినపుడు ధర్మరాజు శ్రీవిష్ణుశయన వ్రతాన్ని లేదా చాతుర్మాస్య వ్రతాన్ని పాటించే పద్ధతిని తెలుపుమని అడిగాడు.

సూర్యుడు కర్కాటకరాశిలో ఉన్నప్పుడు జగన్నాథుడగు మధుసూదనుడు నిద్రకు ఉపక్రమించి, సూర్యుడు తులారాశికి చేరినపుడు తిరిగి మేల్కొంటాడు. చాతుర్మాస్య వ్రతం శయన ఏకాదశి నుండి ఆరంభమౌతుంది. స్నానం చేసిన తరువాత విష్ణువుకు పీతాంబరం ధరింపజేసి తెల్లని వస్త్రాలతో చక్కని శయ్యను ఏర్పాటుచేసి ఆ దేవదేవుని విశ్రమింపజేయాలి. మొట్ట మొదట భగవానునికి బ్రాహ్మణుల చేత పంచామృతాలతో అభిషేకం చేయించి, వస్త్రంతో తుడిచి చందనం పూయాలి. తరువాత గంధపుష్పదీపాలతో భగవంతుని అర్చించాలి.

చాతుర్మాస్య వ్రతాన్ని ఏకాదశిరోజు నుండి గాని, మాసద్వాదశి నుండి గాని, పూర్ణిమ నుండి గాని లేదా సంక్రాంతి నుండి గాని పాటించవచ్చును. చాతుర్మాస్య వ్రతం కార్తికమాసంలోని ఉత్థాన ద్వాదశి రోజున ముగుస్తుంది. శ్రీహరిని స్మరిస్తూ చాతుర్మాస్య వ్రతాన్ని పాటించేవాడు సూర్యప్రభలతో ప్రకాశించే విమానంలో విష్ణులోకానికి చేరుతాడు. వ్రతానంతరం



భగవన్మందిరాన్ని, ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరచి పుష్పాలంకరణ చేసేవాడు మరియు తన శక్త్యనుసారం బ్రాహ్మణులకు భోజనం పెట్టేవాడు ఏడు జన్మలలో అవ్యయమైన సుఖాన్ని పొందుతాడు. ఈ వ్రతసమయంలో భగవంతునికి నెయ్యితో దీపారాధన చేసేవాడు అదృష్టభాగుడు, సుసంపన్నుడు అవుతాడు. భగవన్మందిరంలో మూడు సంధ్యలలో 108 మార్లు గాయత్రీ మంత్రం జపించేవాడు పాపరతుడు కాకుండును. అటువంటి వ్యక్తిపట్ల వ్యాసదేవుడు సుప్రసన్నుడగును; తద్ద్వారా అతడు విష్ణులోకంను చేరతాడు. వ్రతానంతరం ఇరువదియెనిమిది లేదా నూట ఎనిమిది కుండలలో నువ్వులను ఉత్తములగు బ్రాహ్మణులకు దానమిచ్చేవాడు దేహమనోవాక్కులచే చేయబడెడి పాపముల నుండి పూర్తిగా బయటపడును. రోగదూరుడై అతడు తెలివి కలిగిన సంతానాన్ని పొందుతాడు.

జనార్దనుడు శయనించే ఈ నాలుగుమాసాల పాటు భక్తియోగ సాధకుడు మంచంపై శయనించకూడదు. చాతుర్మాస్యసమయంలో మైథున భోగం నిషిద్ధం. కేవలం ఒకేపూట భోజనం చేస్తూ సాధకుడు ఈ వ్రతాన్ని అవలంబించాలి. ఈ సమయంలో విష్ణుభగవానుని ఎదుట కీర్తన చేసేవాడు గంధర్వలోకానికి వెళతాడు. ఈ కాలంలో బెల్లం తినడం మానివేసిన వాడు పుత్రపౌత్రాభివృద్ధిని పొందుతాడు; నూనెను వాడడం మానివేసినవాడు సుందరరూపుడౌతాడు, అతని శత్రువులు నశిస్తారు. చేదు, కారం, పులుపు, తీపి, ఉప్పని పదార్థాలను తిననివాని కురూపత్వం, దేహం యొక్క చెడువాసన తొలగిపోతాయి. పుష్పములను వాడనివాడు స్వర్గలోకాలకు వెళ్ళి విద్యాధరుడౌతాడు. పోకచెక్కను నమలనివాడు వ్యాధిదూరుడౌతాడు. కటికనేలపై భోజనం చేసేవాడు ఇంద్రలోకాన్ని చేరుకుంటాడు. శ్రీకృష్ణుని ప్రీత్యర్థమై పాలుపెరుగును త్యజించేవాడు గోలోకానికి చేరుతాడు. గోళ్ళు తీసికొనని వాడు, శిరోముండనం చేసికోనివాడు విష్ణుపాదములను స్పృశించే మహద్భాగ్యాన్ని పొందుతాడు. భగవన్మందిరానికి ప్రదక్షిణ చేసేవాడు హంసవాహనంపై భగవద్ధామానికి చేరుకుంటాడు.

# 17. కామిక ఏకాదశి

## - శ్రావణమాసం కృష్ణపక్షం

కామిక ఏకాదశి విశేషాలు శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంలో బ్రహ్మవైవర్త పురాణంలో వివరించబడినాయి.

“దేవదేవా! శ్రీకృష్ణా! దేవశయన ఏకాదశి మహిమను నీ నుండి నేను విన్నాను. శ్రావణమాసంలోని కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి మహిమను ఇపుడు నేను వినగోరుతున్నాను. దయచేసి దాని మహిమను నాకు చెప్పవలసినది” అని ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగాడు.

దానికి ప్రత్యుత్తరంగా శ్రీకృష్ణుడు ధర్మరాజుతో “రాజా! సమస్తపాపాలను నశింపజేసే ఈ ఏకాదశీవ్రతవర్ణనను సావధానంగా విను. పూర్వకాలంలో నారదుడు ఒకమారు ఇదే విషయాన్ని బ్రహ్మదేవుని అడుగుతూ ఆ రోజు ఆరాధించవలసిన దైవంను గురించి, ఆ ఏకాదశి రోజున ఆచరించవలసిన విధిని గురించి ప్రశ్నించాడు” అని అన్నాడు.

అఖిల జగద్గురుడగు బ్రహ్మ అపుడు సమాధానం చెబుతూ “శ్రావణ మాసం కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరు కామిక ఏకాదశి. ఈ ఏకాదశీ మహిమను వినడం ద్వారా మనిషి వాజపేయయజ్ఞనిర్వహణఫలితాన్ని పొందుతాడు. ఆ మంగళమయమైన రోజు మనిషి శంఖచక్రగదాపద్మధారి యైన విష్ణువును ఆరాధించాలి. గంగాతీరం, కాశీ, నైమిశారణ్యం, పుష్కరం వంటి తీర్థస్నానాలలోని వసించి అక్కడ స్నానం చేయడం వలన కలిగే ఫలం ఆ రోజు కేవలం విష్ణు ఆరాధనచే లభిస్తుంది. కేదారనాథ్‌లో, కురుక్షేత్రంలో లేదా సూర్యగ్రహణంరోజు చేసే స్నానం వలనైనా లభించనట్టి ఫలం ఆ రోజు శ్రీకృష్ణుని ఆరాధనం వలన తప్పక లభిస్తుంది. కనుక విష్ణు ఆరాధనతో ఈ కామిక ఏకాదశీ వ్రతాన్ని నిష్ఠగా పాటించడం ప్రతియొక్కరి కర్తవ్యం” అని అన్నాడు.



నీరు తామరాకును అంటని చందంగా కామిక ఏకాదశీప్రభావం వలన మనిషిని పాపం ఏమాత్రం అంటదు. తులసిదళాలతో శ్రీహరిని అర్చించేవాడు సమస్త పాపవిముక్తుడౌతాడు. తులసిదర్శనం సర్వపాపహరం. తులసిస్పర్శ దేహాన్ని పవిత్రం చేస్తుంది. తులసి ప్రణామం ద్వారా మనిషి రోగవిముక్తుడౌతాడు. తులసికి స్నానం చేయించడం ద్వారా మనిషికి యమరాజు భయం పోతుంది, తులసి మొక్కను నాటడం ద్వారా మనిషి శ్రీకృష్ణునితో కలిసి జీవించే భాగ్యాన్ని పొందుతాడు, తులసీదళాలను శ్రీకృష్ణపాదారవిందములకు అర్పించడం ద్వారా ఎవ్వడైనా విశుద్ధభక్తిని పొందగలుగుతాడు. ఏకాదశిరోజున తులసీదేవికి నమస్కరించి నెయ్యితో దీపారాధన చేసేవాని పుణ్యాన్ని చిత్రగుప్తుడైనా లెక్కించలేడు. బ్రాహ్మణహత్య లేదా భ్రూణహత్య వంటి ఘోరమైన పాపమైనా కామిక ఏకాదశీ వ్రతపాలనం వలన నశిస్తుంది. అది ఈ వ్రతపాలన వలన కలిగే గౌణఫలం.

ఈ ఏకాదశీ మహిమను వినేవాడు లేదా చదివేవాడు నిశ్చయంగా విష్ణులోకానికి చేరుకుంటాడు.

* * *

# 18. పవిత్ర ఏకాదశి

## (పుత్రదా ఏకాదశి)

**- శ్రావణమాసం శుక్లపక్షం**

పవిత్ర ఏకాదశీ మహిమను శ్రీకృష్ణధర్మరాజ సంవాదరూపంలో భవిషోత్తర పురాణంలో వర్ణించబడింది. శ్రావణమాసంలోని శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరును, దాని మాహాత్మ్యాన్ని వివరించమని ధర్మరాజు ఒకసారి శ్రీకృష్ణుని అడిగాడు. ఆ ఏకాదశి పేరు పవిత్ర ఏకాదశియని, మనిషియొక్క సమస్త పాపాలను నశింపజేసే ఆ ఏకాదశిని గురించి శ్రద్ధగా వినుమని, ఆ ఏకాదశీ మహిమను వినడం చేత వాజపేయ యజ్ఞం చేసినంత ఫలం కల్గుతుందని శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరమిచ్చి ఆ వివరాలను ఇలా తెలుప నారంభించాడు.

"ద్వాపరయుగారంభంలో మాహిష్మతీపురమనెడి రాజ్యాన్ని మహీజిత్తు అనెడి రాజు పాలించెడివాడు. సంతానం లేకపోవడం వలన కార్యనిర్వహణలో అతడు సర్వదా చింతాక్రాంతుడై ఉండేవాడు. సంతానవిహీనుడైనవానికి ఇహపరాలలో సుఖం లేదు కదా! ఎన్ని సంవత్సరాలైనప్పటికిని ఆనందాన్ని కలిగించే పుత్రరత్నమే అతనికి కల్గలేదు".

తన దీనపరిస్థితిని గమనించిన రాజు ఒకరోజు తన కన్నబిడ్డలుగా చూసుకునే రాజ్యప్రజలను సభకు పిలిపించి ఇలా అన్నాడు. "ప్రజలారా! ఈ జన్మలో నేనెట్టి పాపం చేయలేదు, అధర్మయుతమైన ధనంతో ఖజానాను నింపలేదు. బ్రాహ్మణుల సంపత్తిని దేవతల సంపదను కొల్లగొట్టలేదు. పైగా యథావిధిగా ఈ ప్రపంచాన్ని జయించాను. మిమ్మల్ని కన్నబిడ్డలుగా చూసుకుంటున్నాను. తప్పు చేసియుంటే సోదరుడు, బంధువుల వంటి వారినికూడ దండించుటలో వెనుకాడలేదు. సౌమ్యుడు, పుణ్యాత్ముడు అయితే శత్రువుకైనను నేను గౌరవమిచ్చెదను. ఓ బ్రాహ్మణులారా! ఈ ప్రకారంగా ధర్మమార్గంలో నడిచినప్పటికిని నేను పుత్రహీనుడనయ్యాను. దీనికి కారణమేమిటో నాకు తెలపండి".

"రాజుయొక్క దీనాలాపములను వినిన బ్రాహ్మణులు తమలో తాము చర్చించుకొని తమ రాజు నిమిత్తమై భూతభవిష్యద్వర్తమానముల ఎరిగిన ఋషులను కలవడానికి అడవికి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. అరణ్యానికి వెళ్ళి అటుఇటు తిరుగుతూ వారు అనేక ఆశ్రమాలను సందర్శించారు. చివరకు వారు లోమశమునిని కలిసికొన్నారు. ఆయన కఠోరతపస్సులో ఉన్నాడు. ఆయన దేహం దివ్యంగాను, ఆనందమయంగాను ఉంది. ఆయన ఉపవాసవ్రతంలో ఉన్నాడు. ఆత్మనిగ్రహుడైన ఆ ముని సర్వజ్ఞానసంపన్నుడు, బ్రహ్మదేవుని ఆయువంత ఆయుర్దాయం కలవాడు, తేజోమయుడు అయియున్నాడు. బ్రహ్మదేవుని ఒక కల్పం గడచిపోగానే ఆ ముని దేహం నుండి ఒక రోమం (లోమము) క్రిందపడుతుంది. అందుకే ఆ మునికి లోమశముని అనే పేరు వచ్చింది. ఆయనకు భూతభవిష్యద్వర్తమానములు తెలుసు".

ఆ ముని తేజస్సుచే మోహితులైనవారై బ్రాహ్మణులు ఆయన చెంతకు వెళ్ళి వినమ్రంగా స్తోత్రం చేశారు. అది వినిన ఆ ముని వారెవరని, తననెందులకు స్తుతిస్తున్నారని అడిగాడు. అపుడు ప్రత్యుత్తరంగా బ్రాహ్మణులు ఆయనతో "మునివర్యా! సందేహనివృత్తి కొరకే మీ చెంతకు వచ్చాము. మా రాజైన మహీజిత్తునకు సంతానం కలుగలేదు. ప్రజలమైన మమ్ము రాజు కన్నబిడ్డలలాగా చూసుకుంటున్నాడు. అందువలన రాజు కష్టాన్ని చూసి మేము భరించలేకపోయాము. భాగ్యవశాత్తు మేము నేడు మిమ్ములను చూడగలిగాం. మహనీయుడైన వ్యక్తి దర్శనమాత్రం చేతనే పురుషుడు సకలాభీష్టాలను పొందగలుగుతాడు. పుత్రహీనుడైన మా రాజు పుత్రవరదుడు అయ్యే మార్గాన్ని బోధించండి" అని విన్నపం చేసికొన్నారు.

వారి ప్రార్థనలను వినిన లోమశముని వెంటనే ధ్యానమగ్నుడై మహీజిత్తు యొక్క పూర్వజన్మను గురించి తెలిసికొన్నాడు. మహీజిత్తు తన పూర్వజన్మలో ఒక వైశ్యుడు. ఆ జన్మలో అతడు ఒక పాపకార్యం చేశాడు. వ్యాపారార్థం అతడు ఒక గ్రామం నుండి వేరొక గ్రామానికి వెళుతూ దారిలో దప్పికకు గురైనాడు. అది ద్వాదశి మధ్యాహ్న సమయం. దగ్గరలో అతనికి ఒక మంచినీళ్ళ కొలను కనిపించింది; దానిలో అతడు నీళ్ళను త్రాగాలనుకున్నాడు. అప్పుడే ఒక ఆవు, అప్పుడే పుట్టిన తన లేగతో పాటు నీళ్ళు త్రాగడానికి అక్కడకు వచ్చింది. కాని ఆ వైశ్యుడు ఆవును దూరంగా తరిమివేసి తానే మంచినీళ్ళను త్రాగాడు. దప్పిక గొనిన ఆవును నీళ్ళు త్రాగకుండ ఆపినందులకు అతనికి పాపం అంటింది. ఆ కారణంగా రాజు ప్రస్తుత జన్మలో పుత్రహీనుడయ్యాడు".

అది వినిన బ్రాహ్మణులు పుణ్యంతో పాపాన్ని పరిహరించవచ్చునని రాజుయొక్క పాపం తొలగి పుత్రవంతుడు అయ్యే పద్ధతిని ఉపదేశించమని మునిని ప్రార్థించారు.

అపుడు లోమశముని వారితో "శ్రావణమాసంలోని శుక్లపక్షములో వచ్చే సుప్రసిద్ధ ఏకాదశి పవిత్ర ఏకాదశి. మీరు, మీ రాజు ఆ ఏకాదశిని యథావిధిగా ఆచరించండి. తరువాత ఆ ఏకాదశి వ్రతపాలన కలిగిన పుణ్యాన్ని మీరు మీ రాజుకు ధారపోయండి. మీరు నా ఉపదేశాన్ని ఖచ్చితంగా పాటిస్తే మీ రాజు పుత్రవంతుడౌతాడు" అని అన్నాడు. ముని మాటలను వినిన బ్రాహ్మణులు ఆనందించారు, సంతోషించారు. తరువాత తమ రాజ్యానికి తిరిగి వెళ్ళి లోమశముని చెప్పినదంతా ఆయనకు పూసగుచ్చినట్లు చెప్పారు.

తరువాత సరియైన సమయం రాగానే రాజుయొక్క సలహాదారులైన బ్రాహ్మణులు ముని యొక్క ఉపదేశాన్ని గుర్తు చేసికొని రాజుతోపాటు



పవిత్ర ఏకాదశిని యథావిధిగా పాటించారు. ద్వాదశిరోజు వారు తమ పుణ్యాన్ని రాజుకు ధారపోశారు. ఆ పుణ్యఫలంగా రాణి గర్భవతియై అందమైన పుత్రుని కన్నది.

"ధర్మరాజా! ఈ పవిత్ర ఏకాదశిని పాటించేవాడు సమస్త పాపాల నుండి బయటపడి ఇహపరాలలో సుఖాన్ని పొందుతాడు. ఈ ఏకాదశి మహిమను వినేవాడు ఈ జన్మలో పుత్రప్రాప్తి ఆనందాన్ని అనుభవించి తదనంతరం భగవద్ధామానికి చేరుకుంటాడు".

* * *

# 19. అన్నద ఏకాదశి

## (అజ ఏకాదశి)

### - భాద్రపదమాసం కృష్ణపక్షం

అన్నద ఏకాదశి మహిమ శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంలో బ్రహ్మవైవర్తపురాణంలో వర్ణించబడింది.

"కృష్ణా! శ్రావణమాస కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి? దానిని గురించి నాకు వివరించవలసినది" అని ధర్మరాజు శ్రీకృష్ణునితో అన్నాడు.

దానికి ప్రత్యుత్తరంగా శ్రీకృష్ణుడు ఇలా వివరించాడు. "రాజా! నేను చెప్పేది సావధానంగా విను. మనిషియొక్క సమస్త పాపాలను హరించే ఈ మంగళమయమైన ఏకాదశి పేరు అన్నద ఏకాదశి. ఈ ఏకాదశీ వ్రతాన్ని పాటించి ఇంద్రియాధీశుడైన హృషీకేశుని అర్చించేవాడు సమస్తపాపకర్మల ఫలం నుండి ముక్తుడౌతాడు".

పురాతనకాలంలో హరిశ్చంద్రుడనే సుప్రసిద్ధుడైన చక్రవర్తి ఉండేవాడు. అతడు సత్యసంధుడు, నీతిమంతుడు. ఏవో కొన్ని తెలియని పాపాల కారణంగాను, తన మాటను నిలబెట్టుకోవడం కొరకు గాను అతడు తన రాజ్యాన్ని కోల్పోయాడు. చివరకు అతడు తనను, తన భార్యను, పుత్రుణ్ణి కూడ అమ్ముకోవాల్సి వచ్చింది. రాజా! ఆ పుణ్యచక్రవర్తి ఒక చండాలునికి సేవకుడయ్యాడు. అయినప్పటికిని అతడు సత్యసంధతతో స్థిరమైన శ్రద్ధను కనబరచాడు. తన యజమాని ఆదేశంపై అతడు శ్మశానంలో శవాలపై కప్పిన గుడ్డలను తన జీతంగా తీసికోవడం మొదలుపెట్టాడు. అంతటి నీచమైన పనిలో నెలకొనినప్పటికిని అతడు తన సత్యసంధత నుండి, సక్రమ వర్తనం నుండి వైదొలగలేదు. ఈ ప్రకారంగా అనేక సంవత్సరాలు గడిచాయి".

తరువాత ఒకరోజు ఆ చక్రవర్తి గొప్ప చింతతో ఆలోచించడం మొదలుపెట్టాడు. తాను ఏం చేయాలి, ఎక్కడికి పోవాలి, ఏ విధంగా తాను



ఉద్ధరింపబడతాననే విషయాన్ని అతడు పదేపదే ఆలోచించాడు. అతని కష్టాన్ని చూసిన గౌతమముని ఆ రాజు చెంతకు వచ్చాడు. ఆ మునిని చూసిన హరిశ్చంద్రుడు పరుల లాభం కొరకే బ్రాహ్మణులను బ్రహ్మదేవుడు సృష్టించాడని తలచాడు. తరువాత అతడు ఆ మునికి వందనములు కావించి చేతులు జోడించి చెంతన నిలిచాడు. ఆ తరువాత తన దీనగాథను అతడు గౌతమముని కి వివరించాడు.

రాజుయొక్క దీనగాథను వినిన గౌతమముని ఆశ్చర్యంతో "రాజా! శ్రావణమాస కృష్ణపక్షంలో వచ్చే అన్నద ఏకాదశి అత్యంత మంగళకరమైనది, సర్వపాపహరమైనది. ఆ ఏకాదశి త్వరలోనే రాబోవడం నీ అదృష్టమనే చెప్పుకోవచ్చు. ఆ ఏకాదశిరోజు నీవు ఉపవాసం ఉండాలి, రాత్రంతా జాగరణ చేయాలి. దాని ఫలితంగా నీ పాపమంతా నశిస్తుంది. ఓ రాజోత్తమా! నీ ప్రభావం చేతనే నేను నీ చెంతకు వచ్చానని తెలిసికో!" అని అన్నాడు.

హరిశ్చంద్రుని ఆ రీతిగా ఆదేశించిన పిమ్మట గౌతమముని అదృశ్యుడయ్యాడు. ఆ తరువాత ముని ఆదేశం మేరకు రాజు అన్నద ఏకాదశి వ్రతాన్ని పాటించి సర్వపాపదూరుడయ్యాడు.

ఓ రాజసింహమా! ఈ అద్భుతమైన ఏకాదశి ప్రభావం ఎటువంటిదంటే అనేకానేకసంవత్సరాలు అనుభవించాల్సి ఉన్నటువంటి కష్టాలన్నీ కూడ దాని వలన హరించుకుపోతాయి. ఈ ఏకాదశీ ప్రభావం వలననే హరిశ్చంద్రుడు తన భార్యను, మృతపుత్రుని తిరిగి పొందాడు. అపుడు దేవతలు దుందుభులు మ్రోగించి ఆకాశం నుండి పుష్పవృష్టి కురిపించారు. తదనంతరం ఈ ఏకాదశీప్రభావం వలననే ఆ రాజు తన రాజ్యాన్ని ఎటువంటి అడ్డంకులు లేకుండ అనుభవించగలిగాడు. చివరకు అతడు తన బంధుమిత్రప్రజలతో పాటుగా భగవద్ధామానికి వెళ్ళాడు. రాజా! ఈ ఏకాదశిని పాటించిన వ్యక్తి సమస్తపాపాల నుండి బయటపడి ఆధ్యాత్మిక జగత్తును చేరగలడు" అని శ్రీకృష్ణుడు ముగించాడు.

ఈ ఏకాదశీ మహిమను వినినవాడు, చదివినవాడు అశ్వమేధయాగ ఫలాన్ని పొందగల్గుతాడు.

# 20. పార్శ్వ ఏకాదశి

## - భాద్రపదమాసం శుక్లపక్షం

పార్శ్వ ఏకాదశి మహిమ బ్రహ్మవైవర్త పురాణంలో శ్రీకృష్ణధర్మరాజ సంవాదరూపంలో వర్ణించబడింది. ఇది పరివర్తిని ఏకాదశి లేదా వామన ఏకాదశి అని కూడ ప్రసిద్ధిచెందింది.

భాద్రపదశుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి, దానిని ఏ విధంగా పాటించాలి. దానిని పాటించడం వలన కలిగే లాభమేమిటని ధర్మరాజు ఒకసారి శ్రీకృష్ణుని అడిగాడు. దానికి ప్రత్యుత్తరమిస్తూ శ్రీకృష్ణుడు అతనితో "రాజా! భాద్రపద శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరు పార్శ్వ ఏకాదశి. ఇది అత్యంత శుభకరమైనది. అది మనిషికి మోక్షాన్ని ప్రసాదించి సమస్త పాపాలను పరిహరిస్తుంది. ఈ ఏకాదశీమహిమను విన్నంత మాత్రం చేతనే మనిషియొక్క అన్ని పాపాలు నశిస్తాయి. ఈ ఏకాదశీ పాలనం వలన కలిగే పుణ్యం వాజపేయ యజ్ఞఫలంతో కూడ లభించదు. దీనికి జయంతి ఏకాదశి అని కూడ పేరు ఉన్నది. ఈ ఏకాదశిరోజు శ్రీవామనదేవుని భక్తితో అర్చించే వాడు ముల్లోకవాసులచే అర్చింపబడతాడు. పద్మాక్షుడగు విష్ణువును ఈ రోజు ఆరాధించువాడు నిస్సందేహంగా వైకుంఠానికి వెళతాడు. శయనించి యున్న భగవానుడు ఈ ఏకాదశి రోజునే ఎడమవైపు నుండి కుడివైపుకు తిరుగుతాడు. అందుకే దీనికి పార్శ్వ పరివర్తిని ఏకాదశి అని పేరు వచ్చింది" అని అన్నాడు.

అది వినిన ధర్మరాజు శ్రీకృష్ణునితో "ఓ జనార్దనా! నీవు చెప్పిన దానిని వినినప్పటికిని నాకు కొన్ని సందేహాలు కల్గుతున్నాయి. ఓ దేవదేవా! నీవు ఎలా శయనిస్తావు? ఏ విధంగా ప్రక్కకు ఒత్తిగిల్లుతావు? చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించే విధానమేమిటి? నీవు శయనించినపుడు జనులు చేయవలసిన



దేమిటి? నీవు బలిచక్రవర్తిని ఎందుకు త్రాళ్ళతో బంధించావు? వీటన్నింటికి సమాధానం చెప్పి నాకు సందేహనివృత్తి చేయవలసింది" అని అన్నాడు.

దానికి సమాధానమిస్తూ శ్రీకృష్ణుడు అతనితో "ఓ రాజకేసరీ! త్రేతాయుగంలో బలి అనే నా భక్తుడు ఒకడు ఉండేవాడు. రాక్షసకులంలో జన్మించినప్పటికిని అతడు నిత్యం నన్ను పూజిస్తూ స్తుతించేవాడు. అతడు బ్రాహ్మణులను కూడ అర్చించేవాడు, యజ్ఞాన్ని చేసేవాడు. ఈ ప్రకారంగా అతడు త్వరలోనే ప్రభావపూర్ణుడై ఇంద్రునే పరాజితుని చేశాడు. స్వర్గరాజ్యాన్ని హస్తగతం చేసికొన్నాడు. అపుడు ఇంద్రునితో పాటు దేవతలందరు, ఋషులందరు నన్ను ఆశ్రయించారు. వారి ప్రార్థనలకు నేను వామన రూపంలో అవతరించి బలిమహారాజు యొక్క యజ్ఞప్రాంగణానికి బ్రహ్మచారి రూపంలో వెళ్ళాను".

"నేను బలిని మూడడుగుల నేలను దానమడిగాను. కేవలం మూడడుగుల నేలను గాక ఇంకా ఏదైనా కోరుకొమ్మని బలిచక్రవర్తి నన్ను ప్రార్థించాడు. అడిగినదానితోనే సంతృప్తి చెందుతానని చెప్పి నేను దృఢనిశ్చయాన్ని ప్రదర్శించాను. ఆపై ఇక ఎంతమాత్రం సంకోచం లేకుండ బలిమహారాజు, అతని భార్యయైన వింధ్యావళి నాకు మూడడుగుల నేలను దానమిచ్చారు. అపుడు నేను వామనరూపంలోనే క్రమంగా శరీరాన్ని పెంచి ఒక్క అడుగుతో సప్త అధోలోకాలను ఆక్రమించాను. రెండవ అడుగుతో గ్రహమండలంతో పాటు సమస్త ఆకాశాన్ని ఆక్రమించాను. మూడవ అడుగుకు స్థానం చూపమని అడుగగా బలి తన శిరాన్ని స్థానంగా సూచించాడు. ఆ విధంగా వామనదేవుడు తన పాదాన్ని బలిచక్రవర్తి శిరంపై ఉంచాడు. ఆ చక్రవర్తి వినమ్రతకు మెచ్చిన నేను అతనితోనే శాశ్వతంగా ఉంటానని ఆశీర్వదించాను".

"ఈ ఏకాదశి రోజునే, అంటే భాద్రపదశుక్లపక్ష ఏకాదశి రోజునే శ్రీవామనదేవుని శ్రీవిగ్రహం బలిమహారాజు గృహంలో ప్రతిష్ఠించ బడింది. నా వేరొక రూపం అంనతశేషతల్పంపై క్షీరసాగరంలో ప్రతిష్ఠించబడింది. భగవానుడు శయన ఏకాదశి నుండి ఉత్థాన ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు శయనిస్తాడు. ప్రతియొక్కడు భగవానునికి ఈ నాలుగు నెలలు విశేషమైన అర్చన చేయాలి. అంతే కాకుండ ఈ సమయంలో వచ్చే ప్రతీ ఏకాదశిని యథావిధిగా పాటించాలి" అని అన్నాడు.

ఈ ఏకాదశి పాలన ద్వారా మనిషి శతాశ్వమేధ యజ్ఞఫలాన్ని పొందగలుగుతాడు.

* * *

# 21. ఇందిర ఏకాదశి

## - ఆశ్వయుజమాసం కృష్ణపక్షం

ఇందిర ఏకాదశీమహిమ శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంలో బ్రహ్మవైవర్తపురాణంలో వర్ణించబడింది.

ఒకసారి ధర్మరాజు దేవదేవునితో "ఓ కృష్ణా! మధుసూదనా! ఆశ్వయుజ కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి? ఆ ఏకాదశీపాలనకు ఉన్నట్టి నియమనిబంధనలు ఏమిటి? ఆ వ్రతపాలన వలన కలిగే లాభమేమిటి?" అని ప్రశ్నించాడు.

ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు శ్రీకృష్ణుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు. "ఈ ఏకాదశి పేరు ఇందిర ఏకాదశి. దీనిని పాటించడం ద్వారా మనుజుడు తన పితృదేవతలను ఉద్ధరించగలుగుతాడు, అంతే కాకుండ అతని సమస్త పాపాలు నశిస్తాయి".

"రాజా! కృతయుగంలో ఇంద్రసేనుడనే రాజు ఉండేవాడు. తన శత్రువులను అణచడంలో నేర్పరియైన ఆ రాజు మాహిష్మతీపురాన్ని చక్కగా పాలించేవాడు. పుత్రపౌత్రులతో గూడి అతడు ఎంతో సుఖంగా జీవించాడు. అతడు సర్వదా విష్ణుభక్తిరతుడై ఉండేవాడు. ఆధ్యాత్మికజ్ఞానంలో నిరంతరం లగ్నమై యుండెడి భక్తుడైన కారణంగా ఆ రాజు ముక్తి నొసగెడి గోవిందుని నామస్మరణలోనే తన కాలాన్ని గడిపేవాడు".

ఒకనాడు ఆ రాజు తన రాజ్యసింహాసనంపై కూర్చొని ఉన్న సమయంలో అకస్మాత్తుగా నారదముని ఆకాశం నుండి ప్రత్యక్షమయ్యాడు. నారదమునిని చూడగానే ఆ రాజు లేచి నిలబడి, చేతులు జోడ్చి వినమ్రంగా వందనం కావించాడు. తరువాత షోడశోపచార పూజ కావించి మునిని సుఖాసీనుని కావింపజేశాడు. అపుడు నారదుడు ఇంద్రసేనునితో "రాజా! నీ రాజ్యంలో అందరూ సుఖసమృద్ధులతో ఉన్నారా? నీ మనస్సు ధర్మపాలనలో లగ్నమై ఉన్నదా? నీవు విష్ణుభక్తిలో నెలకొని ఉన్నావా?" అని ప్రశ్నించాడు.

దానికి ప్రత్యుత్తరంగా ఇంద్రసేనుడు నారదునితో "ఓ మునివర్యా! మీ దయ వలన అంతా బాగానే ఉంది, మంగళమయంగానే ఉన్నది. నేడు మీ దర్శనంతో నా జన్మ ధన్యమైంది, నాకు యజ్ఞఫలం లభించింది. ఓ దేవర్షీ! మీ రాకకు కారణమేమిటో చెప్పవలసినది" అని అన్నాడు.

రాజు మాటలను వినిన తరువాత నారదుడు అతనితో ఇలా అన్నాడు. ఓ రాజశార్దూలమా! నాకు కనిపించిన ఒక అద్భుతమైన సంఘటనను చెబుతాను విను. ఓ రాజేంద్రా! నేనొకసారి బ్రహ్మలోకం నుడి యమలోకానికి వెళ్ళాను. యమరాజు నన్ను ఆహ్వానించి చక్కగా అర్చించాడు. నేను కూడ అతనిని స్తుతించాను. అక్కడ యమలోకంలో మహాపుణ్యభాగుడైన నీ తండ్రిని నేను చూశాను. వ్రతోల్లంఘున ఫలితంగా నీ తండ్రి అక్కడకు వెళ్ళవలసి వచ్చింది. రాజా! అతడు ఒక సందేశాన్ని నాకు ఇచ్చి దానిని నీకు తెలపమని అర్థించాడు. అతడు నాతో ఇలా అన్నాడు – "మాహిష్మతీపురాధీశుడైన ఇంద్రసేనుడు నా పుత్రుడు. పూర్వజన్మలో చేసిన కొన్ని పాపాల వల్ల నేనిపుడు యమలోకంలో ఉన్నాను. కనుక నా పుత్రుడు ఇందిర ఏకాదశీ వ్రతాన్ని పాటించి ఆ పుణ్యఫలాన్ని నాకు ఇవ్వాలి. అపుడు నేను ఈ స్థితి నుండి బయటపడగలను".

"కనుక ఓ రాజా! నీ తండ్రిని ఆధ్యాత్మికలోకానికి పంపడానికై నీవు ఇందిర ఏకాదశీ వ్రతాన్ని చేపట్టు" అని నారదుడు తాను తెచ్చిన సందేశాన్ని చెప్పాడు. అపుడు ఇంద్రసేనుడు ఇందిర ఏకాదశీ వ్రతాన్ని చేసే పద్ధతిని గురించి తెలుపవలసిందిగా నారదుని ప్రార్థించాడు.

వ్రతవిధానాన్ని శ్రీనారదుడు ఇలా వివరించాడు. "ఏకాదశి ముందు రోజు మనుజుడు తెల్లవారుజామునే స్నానం చేసి పితృదేవతలకు తర్పణాలు ఇవ్వాలి. ఆ రోజు అతడు ఒక్క పూటనే భోజనం చేసి నేలపై పడుకోవాలి. మర్నాడు ఏకాదశిరోజు మళ్ళీ తెల్లవారుజామునే మేల్కొని దంతధావనం, హస్తముఖ ప్రక్షాళనం చేసికొని చక్కగా స్నానం చేయాలి. తరువాత ఎటువంటి భౌతికభోగంలో పాల్గొనని వ్రతనియమం చేపట్టి రోజంతా ఉపవసించాలి. ఓ పద్మనేత్రుడా! నేను నిన్ను ఆశ్రయిస్తున్నాను" అని పలికి భగవంతుని స్తుతించాలి.



తరువాత మధ్యాహ్నవేళ సాలగ్రామశిల ఎదురుగా విధిపూర్వకంగా పితృతర్పణాలు చేయాలి. తదనంతరం బ్రాహ్మణులకు చక్కగా భోజనం పెట్టి దక్షిణలతో సంతృప్తి పరచాలి. పితృతర్పణ కార్యంలో మిగిలిన పదార్థాలను గోవులకు పెట్టాలి. ఆ రోజు అతడు చందన పుష్ప ధూపదీప నైవేద్యాలతో హృషీకేశుని అర్చించాలి. శ్రీకృష్ణుని నామరూపగుణ లీలాదుల శ్రవణకీర్తనలతో, స్మరణంతో అతడు ఆ రాత్రి జాగరణ చేయాలి. మర్నాడు అతడు శ్రీహరిని అర్చించి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. తదనంతరం అతడు సోదరులు, పుత్రపౌత్రులు, బంధువులతో కలిసి నిశ్శబ్దంగా వ్రతపారణం చేస్తూ భోజనం చేయాలి. రాజా! ఈ విధంగా నీవు ఈ ఏకాదశీ వ్రతాన్ని పాటిస్తే నీ తండ్రి నిశ్చయంగా విష్ణులోకానికి వెళతాడు".

నారదుడు ఈ విధంగా ఉపదేశించి అంతర్ధానమయ్యాడు. తరువాత ఇంద్రసేనుడు నారదముని ఆదేశానుసారమే సంతానం, బంధువులు, మిత్రులతో గూడి నిష్ఠగా ఇందిర ఏకాదశిని పాటించాడు. ఆ వ్రతమహిమ కారణంగా ఆకాశం నుండి పుష్పవృష్టి కురిసింది. ఇంద్రసేనుని తండ్రి గరుడవాహనారూఢుడై విష్ణుపదాన్ని చేరుకున్నాడు. తరువాత రాజర్షియైన ఇంద్రసేనుడు ఎటువంటి అడ్డంకులు లేకుండా రాజ్యపాలనం చేసి, చివరకు రాజ్యాన్ని తన పుత్రునికి అప్పగించి తాను భగవద్ధామానికి వెళ్ళిపోయాడు. ఇందిర ఏకాదశీ మహిమే ఇటువంటిది.

ఈ ఇందిర ఏకాదశీ మహిమను చదివేవాడు, వినేవాడు సమస్త పాపముక్తుడై చివరకు విష్ణుపదాన్ని చేరుకుంటాడు.

* * *

# 22. పాశాంకుశ ఏకాదశి

**- ఆశ్వయుజమాసం శుక్లపక్షం**

ఆశ్వీయుజమాసం శుక్లపక్షంలో వచ్చే పాశాంకుశ ఏకాదశీమాహాత్మ్యము శ్రీకృష్ణధర్మరాజుల సంవాదరూపంలో బ్రహ్మావైవర్తపురాణం నందు వర్ణించ బడింది.

ఆశ్వీయుజశుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరు, దాని వివరాలు తెలుపుమని ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగినపుడు ఆ దేవదేవుడు ఈ విధంగా పలికాడు.

"ఓ రాజశ్రేష్ఠా! ఆ ఏకాదశి పేరు పాశాంకుశ ఏకాదశి. మనిషియొక్క సమస్తమగు పాపాలను నశింపజేసే ఆ ఏకాదశి మహిమను వివరిస్తాను విను. కొందరు దీనిని పాపాంకుశఏకాదశి అని కూడ పిలుస్తారు. ఆ రోజు ముఖ్యంగా పద్మనాభుని అర్చించాలి. ఆ ఏకాదశి జీవునికి స్వర్గసుఖాలను, మోక్షాన్ని, వాంఛితఫలాలను ఒసగుతుంది. విష్ణు నామోచ్చారణం చేత మనిషి ధరిత్రి పైన సమస్త తీర్థాలను దర్శించిన పుణ్యాన్ని పొందగలుగుతాడు. బద్ధజీవుడు మోహవశముచే నానారకాలైన పాపకర్మలను చేయక పతితజీవులను ఉద్ధరించే శ్రీహరి పాదపద్మాలను ఆశ్రయించి వాటికి నమస్కరించినచో నరకమున పడకుండును".

"శివుని విమర్శించే వైష్ణవులు, విష్ణువును విమర్శించే శైవులు నిస్సందేహంగా నరకంలో కూలుతారు. శతాశ్వమేధయజ్ఞఫలం కాని, శత రాజసూయయజ్ఞఫలం కాని ఈ ఏకాదశీ పాలన వలన సంప్రాప్తించే పుణ్యానికి ఒక వంతు కూడా సరిపోలవు. ఈ ఏకాదశిని పాటించడం వలన కల్గే పుణ్యానికి సమానమైన పుణ్యం ఈ జగత్తులో లేనే లేదు. కనుక పద్మనాభునికి పరమప్రియమైన ఈ ఏకాదశి అంతటి పవిత్రమైన దినం వేరొకటి లేదు".

"రాజా! ఏకాదశీ నియమపాలనలో విఫలుడైనవాని దేహంలో పాపాలు నివాసం చేస్తాయి. ఈ ప్రత్యేకమైన ఏకాదశిని పాటించేవాడు స్వర్గసౌఖ్యాలను, మోక్షాన్ని, రోగవిముక్తిని, సుందరమైన పత్నిని, ధనధాన్యాదులను పొందుతాడు. ఈ ఏకాదశిని పాటించి రాత్రి మొత్తం మేల్కొని ఉండువాడు సులభంగా విష్ణులోకానికి చేరుకుంటాడు".

"ఓ రాజోత్తమా! ఈ ఏకాదశిని పాటించడం ద్వారా మనిషి తన తల్లివైపు పది తరాలను, తండ్రివైపు పది తరాలను, భార్యవైపు పది తరాలను ఉద్ధరించగలుగుతాడు. బాల్యమందుగాని, యౌవనమందు గాని, వృద్ధాప్యమందు గాని ఈ ఏకాదశిని పాటించినవాడు సంసార క్లేశములను అనుభవింపడు. ఈ పాశాంకుశ లేదా పాపాంకుశ ఏకాదశిని నిష్ఠగా పాటించేవాడు సమస్త పాపవిముక్తుడై జీవితాంతమున విష్ణుపదాన్ని చేరుకుంటాడు. బంగారమును, నువ్వులను, భూమిని, గోవులను, ధాన్యాన్ని, జలాన్ని, గొడుగును, పాదరక్షలను దానమిచ్చినవాడు యమసదనానికి వెళ్ళవలసిన అవసరం ఉండదు. పుణ్యాచరణం లేకుండా ఆ రోజును గడిపేవాడు శ్వాసించుచున్నప్పటికిని మృతుడే అనబడతాడు. అతని శ్వాసక్రియ కొలిమితిత్తులతో పోల్చబడుతుంది".

"రాజా! ఇతరుల లాభం కొరకు చెఱువులను, బావులను త్రవ్వించేవాడు, నేలను గృహాలను దానమిచ్చేవాడు, యజ్ఞయాగాది కర్మలను చేసేవాడు యముని దండనకు గురికాడు. పుణ్యఫలం వలననే మానవులు దీర్ఘకాలం జీవిస్తారు, రోగదూరులౌతారు. సారాంశమేమంటే ఈ ఏకాదశిని పాటించడం వలన కలిగే ప్రత్యక్షఫలం దేవదేవుని భక్తియుతసేవ, కాగా భౌతికలాభములు పరోక్షఫలములై యున్నవి".

* * *

# 23. రమా ఏకాదశి

**- కార్తికమాసం కృష్ణపక్షం**

రమా ఏకాదశి మహిమను శ్రీకృష్ణధర్మరాజసంవాదరూపంలో బ్రహ్మవైవర్తపురాణంలో వర్ణించబడింది.

"ఓ జనార్దనా! కార్తీకమాసకృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి పేరేమిటి? దానిని నాకు వివరించవలసినది" అని ధర్మరాజు శ్రీకృష్ణునితో అన్నాడు.

అపుడు శ్రీకృష్ణుడు జవాబిస్తూ "ఓ రాజసింహమా! ఆ ఏకాదశి పేరు రమా ఏకాదశి. అది సమస్తపాపాలను హరిస్తుంది. ఇపుడు ఆ పవిత్ర ఏకాదశి మహిమను విను" అని పలుకసాగాడు.

చాలాకాలం క్రిందట ముచుకుందుడనే ప్రఖ్యాతరాజు ఉండేవాడు. అతడు స్వర్గరాజు. ఇంద్రునికి మంచి మిత్రుడు. యమరాజు, వరుణుడు, కుబేరుడు, విభీషణుడు వంటి మహోన్నతులతో కూడ అతనికి స్నేహం ఉండేది. సత్యసంధుడైన ఆ రాజు సదా విష్ణుభక్తిలో అనురక్తుడై ఉండేవాడు. అతడు తన రాజ్యాన్ని చక్కగా పాలించేవాడు.

కొంతకాలానికి ముచుకుందునికి ఒక కుమార్తె కలిగింది. సర్వోత్తమ నదియైన చంద్రభాగా పేరును ఆ అమ్మాయికి పెట్టారు. యుక్తవయస్సు రాగానే ఆమెకు చంద్రసేనుని తనయుడైన శోభనునితో వివాహం జరిగింది. ఒకసారి శోభనుడు ఏకాదశిరోజు తన మామగారి ఇంటికి వచ్చాడు. అది చూసిన చంద్రభాగ కలవరపడినదై తనలో తాను "ఓ దేవా! ఇప్పుడేమి చేయాలి? నా భర్త దుర్బలుడు, ఆకలిని తట్టుకోలేడు. నా తండ్రి మరీ కఠినుడు. ఏకాదశికి ముందు రోజు నా తండ్రి ఒక సేవకుని పంపి ఎవ్వరూ ఏకాదశి రోజున అన్నం తినవద్దని చాటింపు కూడ వేయిస్తాడు" అని అనుకోసాగింది.

ఈ ఆచారం గురించి వినిన శోభనుడు తన భార్యతో "ఓ ప్రియపత్నీ! ఇపుడు నన్నేమి చేయమంటావు? నా ప్రాణం రక్షింపబడడానికి, అలాగే రాజాజ్ఞ ఉల్లంఘించకుండ ఉండడానికి ఏం చేయాలో చెప్పు" అని అన్నాడు.



అపుడు చంద్రభాగ తన భర్తతో "స్వామీ! మనుషుల మాట అటుంచండి. నా తండ్రిరాజ్యంలో ఏనుగులు, గుఱ్ఱాలు, ఇతర జంతువులకు కూడ ఈ రోజు ఆహారం ఉండదు. కనుక ప్రభూ! ఇక మనుషులెట్టా తినగలుగుతారు? ఒకవేళ తప్పకుండ తినవలసియే ఉంటే మీరు మీ ఇంటికి వెళ్ళవలసి వస్తుంది. ఇది మీరు ఆలోచించి ఏదో ఒక నిర్ణయం తీసికోండి".

భార్య మాటలు వినిన శోభనుడు ఆమెతో "నీవు చెప్పింది అక్షరాల సత్యమే. కాని నాకు ఈ ఏకాదశీ వ్రతపాలన చేయాలని ఉంది. నాకు ఏది జరగవలసి ఉందో అది జరిగే తీరుతుంది కదా!" అని అన్నాడు.

ఈ విధంగా ఆలోచించిన శోభనుడు పవిత్ర ఏకాదశివ్రతపాలనకు సిద్ధమయ్యాడు. కాని అతడు ఆకలిదప్పికలతో నీరసించిపోయాడు. ఇంతలో సూర్యాస్తమయం అయింది. వైష్ణవులు, పుణ్యాత్ములు అందరూ ప్రసన్నులయ్యారు. ఓ రాజసింహమా! ఆ రాత్రి వారంతా సంకీర్తన, అర్చనలతో గడిపివేశారు. కాని ఆ రేయి గడపడం శోభనునికి అసాధ్యమైంది. సూర్యోదయం లోపలే అతడు దేహం చాలించాడు. ముచుకుందుడు శోభనునికి చందనపు కట్టెలతో చితిపేర్చి దహనసంస్కారాలు చేశాడు. ముచుకుందుని ఆజ్ఞమేరకు చంద్రభాగ సతీసహగమనం మానుకుంది. భర్తకు అంత్యక్రియలు జరిగిన తరువాత ఆమె తండ్రి ఇంటిలోనే నివసించసాగింది. "రాజా! ఇంతలో రమా ఏకాదశి వ్రతపాలన ప్రభావంగా శోభనుడు దేవపురమనే రాజ్యానికి రాజుగా జన్మించాడు. అది మందర పర్వతం పైన ఉన్నది. రత్నఖచితమైన బంగారు స్తంభాలు కలిగినట్టిది, మణిఖచితమగు గోడలు కలిగినదియైన ఐశ్వర్యయుత భవనంలో అతడు నివసించసాగాడు. మణిమయమైన బంగారు కిరీటమును ధరించిన అతనికి తెల్లనిఛత్రం పట్టుబడియుండేది. కర్ణకుండలములతో, కంఠాభరణములతో, బంగారుభుజకీర్తులతో కంకణములతో అలంకృతుడై అతడు రాజ్యసింహాసనమున కూర్చునేవాడు. గంధర్వులచే, అప్సరసలచే సేవింపబడుచు అతడు స్వర్గరాజు ఇంద్రుని వలె గోచరించెడివాడు".

ఒకరోజు ముచుకుందపుర నివాసియైన సోమశర్మ అనే బ్రాహ్మణుడు శోభనుని రాజ్యానికి తీర్థయాత్రలు చేస్తూ వచ్చాడు. శోభనుడు ముచుకుందుని అల్లుడని భావించి ఆ బ్రాహ్మణుడు అతని వద్దకు చేరాడు. బ్రాహ్మణుని చూడగానే రాజు లేచి నిలబడి, చేతులు జోడించి నమస్కరించాడు. తరువాత అతడు బ్రాహ్మణుని కుశల మడిగాడు. తరువాత ముచుకుందుడు, తన భార్య చంద్రభాగ, ముచుకుందపుర జనుల గురించిన క్షేమసమాచారాలు కూడ అడిగాడు. అపుడు బ్రాహ్మణుడు అందరి క్షేమసమాచారాలు తెలిపాడు. అక్కడ ప్రతియొక్కరు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపిన బ్రాహ్మణుడు అతనితో "రాజా! ఇంతటి సుందరమైన నగరాన్ని ఇంతకు మునుపు నేనెన్నడును చూడలేదు. నీకు ఈ రాజ్యం ఎలా లభించిందో చెప్పవలసింది" అని అడిగాడు.

"కార్తికమాసం కృష్ణపక్షంలో వచ్చే రమా ఏకాదశిని పాటించిన ప్రభావం వలననే నాకు ఈ తాత్కాలికమైన రాజ్యం లభించింది. ఓ బ్రాహ్మణోత్తమా! ఈ రాజ్యం శాశ్వతంగా ఉండిపోయే విధానమేమిటో నాకు చెప్పవలసినది. నేను ఏకాదశీ వ్రతాన్ని శ్రద్ధారహితంగా చేసిన కారణంగా ఈ అస్థిరమైన రాజ్యం లభించింది. ఈ విషయాలను చంద్రభాగకు తెలపండి. ఆమె దీనిని సుస్థిరమొనర్చగలిగే సామర్థ్యం కలిగినట్టిది" అని శోభనుడు అన్నాడు.

శోభనుని మాటలను వినిన బ్రాహ్మణుడు ముచుకుందపురానికి వచ్చి విషయమంతా చంద్రభాగకు వివరించాడు. అది వినిన చంద్రభాగ అమితానందభరితురాలు అయింది. తాను విన్నదంతా కలలాగా ఉన్నదని ఆమె పలికింది. అపుడు సోమశర్మ ఆమెతో "అమ్మా! నేను నీ భర్తను దేవపురిలో స్వయంగా చూశాను. ఆ పురం సూర్యప్రభలతో వెలిగిపోతోంది. కాని ఆ రాజ్యం సుస్థిరంగా లేదని అతడు చెప్పాడు. కాబట్టి ఏదో విధంగా రాజ్యాన్ని నీవు సుస్థిరం చేయాలి" అని అన్నాడు. అది వినిన చంద్రభాగ తనను తన భర్త చెంతకు తీసికొని వెళ్ళమని బ్రాహ్మణుని అర్థించింది. తన పుణ్యపరిపాకంతో ఆ రాజ్యాన్ని తాను సుస్థిరం చేయగలనని ఆమె చెప్పింది.



భార్యాభర్తలైన తాము కలిసికొనే ఏర్పాట్లు చేయమని, ఆ విధంగా భార్యాభర్తలు కలిసేందుకు సహాయపడితే పుణ్యం కల్గుతుందని ఆమె బ్రాహ్మణునితో అన్నది.

తదనంతరం సోమశర్మ చంద్రభాగను మందరపర్వతసమీపంలో ఉన్నట్టి వామదేవుని ఆశ్రమానికి తీసుకొని వెళ్ళాడు. దేదీప్యమానమగు ముఖవర్చస్సు కలిగిన చంద్రభాగ యొక్క కథను వినిన తరువాత వామదేవుడు ఆమెకు వేదమంత్రోపదేశం చేశాడు. వామదేవుడు ఒసగిన మంత్రప్రభావం వలన ఏకాదశీవ్రతమహిమ వలన చంద్రభాగ వెంటనే ఆధ్యాత్మిక శరీరాన్ని పొందింది. తరువాత ఆమె వెంటనే వెళ్ళి ఆనందంతో తన భర్తను కలిసికొన్నది.

భార్యను చూడగానే శోభనుడు పరమానందభరితుడై పూర్ణ సంతుష్టిని పొందాడు. అపుడు చంద్రభాగ తన భర్తతో "ప్రభూ! నా మంచిమాటలు వినండి. నేను నా తండ్రి ఇంట్లో ఎనిమిదేండ్ల వయస్సు నుండే ఏకాదశీవ్రత పాలనం చేస్తున్నాను. ఆ పుణ్యమంతా మీ రాజ్యాన్ని సుస్థిరం చేసి ప్రళయాంతం వరకు దీనిని సమృద్ధిగా నిలుపు గాక!" అని అన్నది. ఆ తరువాత ఆమె వివిధభూషణాలతో అలంకృతమైన దివ్యశరీరంతో భర్తతోకలిసి సుఖజీవనం గడిపింది. రమా ఏకాదశీ ప్రభావం వలన శోభనుడు కూడ దివ్యశరీరాన్ని పొంది మందరపర్వతచరియలలో విహరించాడు. కనుక ఈ రమా ఏకాదశి కామధేనువు లేదా చింతామణి వంటిది.

శ్రీకృష్ణుడు తన సంభాషణను కొనసాగిస్తూ "రాజా! పరమమంగళమైన రమా ఏకాదశీమహిమను నీకు వివరించాను. దీనిని కచ్చితంగా పాటించేవాడు బ్రహ్మహత్యాపాతకం వంటి పాపం నుండైనా నిస్సందేహంగా బయటపడతాడు. నల్లగోవు, తెల్లగోవు రెండు కూడ తెల్లనిపాలే ఇచ్చినట్లు కృష్ణపక్ష ఏకాదశి, శుక్లపక్ష ఏకాదశి రెండూ కూడ మోక్షాన్ని ప్రసాదిస్తాయి.

ఈ ఏకాదశీ మహిమను వినేవాడు సమస్త పాపాల నుండి బయటపడి విష్ణులోకంలో ఆనందంగా నివసిస్తాడు" అని చెప్పి ముగించాడు.

# 24. ఉత్థాన ఏకాదశి

**- కార్తికమాసం శుక్లపక్షం**

ఉత్థాన ఏకాదశీ (ప్రబోధినీ ఏకాదశి) మహిమను బ్రహ్మానారద సంవాద రూపంలో స్కందపురాణంలో వర్ణించబడింది.

ఒకసారి బ్రహ్మదేవుడు నారదమునితో "ఓ మునిశ్రేష్ఠుడా! సకల పాపాలను హరింపజేసేది, పుణ్యాన్ని వృద్ధి కావించేది, ముక్తిని ఒసగేది అయినట్టి ఉత్థాన ఏకాదశి మాహాత్మ్యాన్ని విను. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుడా! కార్తిక శుక్లపక్షంలో వచ్చేది, మనుజుని సకల పాపాలను భస్మీపటలం కావించేది అయిన ఉత్థాన ఏకాదశి ఈ జగత్తులో ఆవిర్భవించనంతవరకే గంగానది యొక్క శ్రేష్ఠత పటిష్ఠంగా ఉండేది. సాగరుని ప్రభావం, సరోవరం యొక్క పవిత్రత ఉత్థాన ఏకాదశి ప్రకటం కానంతవరకే అద్వితీయంగా ఉండేవి. వేయి అశ్వమేధ యాగాలను, వంద రాజసూయయాగాలను చేయగా కలిగే ఫలితం ఈ ఏకాదశిని పాటించడం ద్వారా సులభంగా కలుగుతుంది" అని పలికాడు.

బ్రహ్మదేవుని ఈ పలుకులను వినిన నారదముని బ్రహ్మతో "తండ్రీ! ఆ రోజు కేవలం ఒకేసారి ఆహారం తీసికొనేవానికి లేదా కేవలము రాత్రి మాత్రమే ఆహారము తీసికొనేవానికి లేదా పూర్తిగా ఉపవాసం చేసేవానికి కలిగే ఫలితమేమిటో చెప్పవలసినది" అని అన్నాడు.

ఆ ప్రశ్నకు సమాధానంగా బ్రహ్మదేవుడు అతనితో ఇలా అన్నాడు. "ఆ రోజు ఒకసారి భుజించేవాడు ఒక జన్మలోని సమస్త పాపాలను నశింపజేసికొంటాడు. కేవలం రాత్రి మాత్రమే భుజించేవాడు రెండు జన్మల పాపాలను నశింపజేసికొంటాడు. ఇక పూర్తిగా ఉపవసించేవాడు తన ఏడు జన్మల పాపాలను నశింపజేసికొంటాడు".

"పుత్రా! ముల్లోకములలో చూడనిది, కోరనిది, దుర్లభమైనదియైన దేనినైనను ఈ ఉత్థాన ఏకాదశి ప్రసాదిస్తుంది. మందర పర్వతం వంటి



మహాపాపాన్నైనా ఈ ఏకాదశి భస్మీపటలం చేయగలదు. ఈ ఏకాదశి రోజున చేసికొన్నట్టి పుణ్యం సుమేరు పర్వతమంత ఫలితాన్ని ఇస్తుంది. భగవంతుని ప్రార్థించనట్టి వారిలో, వ్రతభంగము చేసినవారిలో, నాస్తికులైనవారిలో, వేదనింద చేసేవారిలో, శాస్త్రములకు దుర్వ్యాఖ్యానం చేసేవారిలో, పరభార్యను అనుభవించేవారిలో, మూర్ఖులలో ధర్మం నిలువనే నిలువదు. మనిషి పాపం చేయక పుణ్యవర్తనుడై ఉండాలి. పుణ్యం చేయగోరే వానిలో ధర్మం నశింపకుండ నిలుస్తుంది. ఉత్థాన ఏకాదశీ వ్రతాన్ని గంభీరంగా పాటించే వానికి వందజన్మల పాపాలు తొలగిపోతాయి. ఉత్థాన ఏకాదశినాడు రాత్రి జాగరణ చేసే వ్యక్తి యొక్క భూతభవిష్యత్ వర్తమాన తరముల వారందరు విష్ణుపదాన్ని పొందుతారు".

"నారదా! కార్తికమాసంలో వచ్చే ఈ ఏకాదశీ వ్రతాన్ని పాటించడానికి, విష్ణు ఆరాధనం చేయనివానికి సమస్త పుణ్యం నశిస్తుంది. ఓ బ్రాహ్మణోత్తమా! మనిషి కార్తికమాసంలో నిశ్చయంగా విష్ణువును ఆరాధించాలి. కార్తిక మాసంలో తన వంట తానే చేసికొనేవాడు చాంద్రాయణ వ్రతఫలితాన్ని పొందుతాడు. కార్తికమాసంలో విష్ణు కథల శ్రవణ కీర్తనలు చేసేవాడు నూరు గోవులను దానం చేసిన ఫలితాన్ని పొందుతాడు. నిత్యం శాస్త్రాలను అధ్యయనంచేసే వ్యక్తి వేయి యజ్ఞఫలాన్ని పొందగలుగుతాడు. భగవత్కథలను విని తన శక్త్యనుసారం వక్తకు దక్షిణను ఇచ్చేవాడు శాశ్వతమగు భగవద్ధామాన్ని చేరుకుంటాడు".

ఇది వినిన నారదుడు అపుడు ఆ ఏకాదశి వ్రతవిధానాన్ని గురించి అడిగాడు. దానికి ప్రత్యుత్తరంగా బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. "ఓ ద్విజశ్రేష్ఠుడా! ఆ రోజు మనుజుడు బ్రహ్మముహూర్తంలోనే నిద్రలేచి కాళ్ళు చేతులు కడుక్కొని, స్నానం చేసి కేశవుని అర్చించాలి. తరువాత అతడు మంత్రోచ్చారణం చేస్తూ "ఈ ఏకాదశి రోజు నేను ఉపవసించి కేవలం

ద్వాదశి రోజునే ఆహారాన్ని తీసికొంటాను. ఓ పుండరీకాక్షా! అచ్యుతా! నేను నీకు శరణుజొచ్చియున్నవాడను. నన్ను రక్షించుము" అని వ్రతదీక్షను చేపట్టాలి.

"ఈ ఏకాదశీ వ్రతాన్ని మనిషి పరమానందంతో ఆచరించి విష్ణువు చెంత రాత్రి జాగరణ చేయాలి. జాగరణ చేస్తూ అతడు భగవంతుని దివ్యగుణాలను కీర్తించాలి, వినాలి. ఆ రోజు అతడు సమస్త లోభాలను విడిచిపెట్టాలి. ఈ ఉపదేశాన్ని పాటించే పుణ్యాత్ముడు పరమగమ్యాన్ని చేరకుంటాడు".

"జనార్దనుని కదంబపూలతో అర్చించేవాడు యమసదనానికి వెళ్ళనే వెళ్ళడు. గరుడధ్వజుని (విష్ణువును) కార్తికమాసంలో గులాబీలతో అర్చించేవాడు నిశ్చయంగా ముక్తిని పొందుతాడు. భగవానుని వకుళ అశోకపుష్పాలతో అర్చించేవాడు ఆకాశంలో సూర్యచంద్రులు ప్రకాశించేంత వరకు శోకవిముక్తుడై ఉంటాడు. దేవదేవుని శమీపత్రాలతో పూజించేవాడు యమరాజు దండనం నుండి తప్పించుకొంటాడు. దేవతా నియామకుడగు విష్ణువును వర్షఋతువులో చంపకపుష్పాలతో పూజించేవాడు ఈ భౌతికజగత్తులో తిరిగి జన్మించవలసిన పని ఉండదు. విష్ణువుకు పసుపుపచ్చని కేతకీపుష్పాలను అర్పిస్తే మనుజుడు కోట్లకొలది జన్మలలో ప్రోగుబడిన పాపాలు నశిస్తాయి. అరుణవర్ణసుగంధశతపత్రకమలాలతో జగన్నాథుని పూజించేవాడు భగవన్నిలయమైన శ్వేతద్వీపాన్ని చేరుకుంటాడు".

"ఓ బ్రాహ్మణోత్తమా! ఏకాదశిరోజు రాత్రి మనుజుడు జాగరణ చేయాలి. ద్వాదశిరోజు అతడు విష్ణువును ఆరాధించి బ్రాహ్మణులకు భోజనం పెట్టి వ్రతపరిసమాప్తి చేయాలి".

మనుజుడు తన శక్త్యనుసారం గురుదేవుని అర్చించి ఆయనకు దక్షిణను సమర్పిస్తే భగవంతుడు అతని యెడ ప్రసన్నుడౌతాడు.

* * *

# 25. పద్మినీ ఏకాదశి

## - అధికమాసం కృష్ణపక్షం

"ఓ జనార్దనా! అధికమాసంలోని శుక్లపక్షం నందు వచ్చెడి ఏకాదశి పేరేమిటి? దానిఎట్లు పాటించాలి? ఇది నాకు వివరించవలసినది" అని ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగినట్లు సూతమహర్షి చెప్పెడు.

ఈ ప్రశ్నకు సమాధానంగా శ్రీకృష్ణభగవానుడు ఇట్లు పలికెను. "ఓ పాండవా! అధికమాసంలోని శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరు పద్మినీ ఏకాదశి. అది అత్యంతశుభకరమైనది. దృఢనిశ్చయంతో దీనిని పాటించెడి అదృష్టవంతుడు వైకుంఠధామాన్ని పొందుతాడు. పాపములను శమింప జేయడంలో ఈ ఏకాదశి నాతో సమానంగా శక్తివంతమైనది. దీనిని గురించి చతుర్ముఖబ్రహ్మయైనను తగినంతగా వర్ణింపజాలడు. మోక్షదాయకం, పాపహరమునైన ఈ ఏకాదశిని గురించి బ్రహ్మదేవుడు పూర్వం నారదునికి చెప్పెను. రాజా! పద్మినీ ఏకాదశిని పాటించే విధానాన్ని నీకు వివరిస్తాను. సావధానంగా విను".

"ఏకాదశికి ఒకరోజు ముందు దశమి నుండియే మనుజుడు ఉపవాసాన్ని ఆరంభించి మినపప్పు, ఎఱ్ఱపప్పు, శనగపప్పు, పాలకూర, తేనె, ఉప్పు మున్నగువాటిని తినరాదు. ఇతరుల ఇండ్లలో భోజనం చేయరాదు. భోజనం చేయరాదు. ఈ ఎనిమిది విషయాలను అతడు పాటించాలి. దశమిరోజు ఒక పూటనే భోజనం చేసి నేలపై పడుకోవాలి. బ్రహ్మచర్యాన్ని పాటించాలి. ఇక ఏకాదశిరోజు తెల్లవారుఝాముననే నిద్రలేవాలి, కాని దంతధావనం చేసికొనరాదు. వీలైతే తీర్థస్థానంలో స్నానం చేయాలి.

ఓ ధర్మరాజా! పీతాంబరధారి, సకలజీవులకు ఆనందం ఇచ్చేవాడు అయిన దేవదేవుని అర్చనకు సమాయత్తుడై మనుజుడు పిదప శరీరాన్ని శుభ్రపరచుకొనాలి. ఆ విధంగా అతడు సకలపాపాలను దూరం చేసికొంటాడు. తరువాత అతడు గాయత్రీమంత్రంను జపించి పితృదేవతలకు తర్పణం

ఇవ్వవలెను. ఆ పిదప విష్ణుమందరింలో లక్ష్మీపతియగు నారాయణుని దర్శించాలి.

"వీలైతే అతడు స్వర్ణమయ రాధాకృష్ణ మూర్తులను చక్కగా అర్చించాలి. సుగంధజలపూర్ణమగు రాగి లేదా మట్టి కలశం ఏర్పరచి వస్త్రం కప్పి దానిపై బంగారు లేదా వెండి మూతను పెట్టి దానిపై రాధాకృష్ణులను ఆసీనులను చేయాలి. తరువాత శక్త్యనుసారం ధూపదీపములతోను, కర్పూర కుంకుమలతోను, గంధమాల్యాదులతోను, చక్కని నైవేద్యములతోను అర్చన చేయాలి. ఈ ప్రత్యేక ఏకాదశిరోజు అతడు ఆనందంతో నృత్యగానాలు చేయాలి. వ్యర్థ సంభాషణం చేయరాదు. నీచజన్మలను తాకరాదు, వారితో మాట్లాడరాదు. సత్యమునే పలుకవలెను. విష్ణుమూర్తి, బ్రాహ్మణులు లేదా గురువు ఎదుట ఇతరులను నిందించరాదు. భక్తుల సాంగత్యంలో అతడు వైష్ణవుల ద్వారా విష్ణుమహిమలను శ్రవణం చేయాలి. ఈ ఏకాదశిరోజు మంచినీరు కూడా త్రాగరాదు. ఇట్టి కఠినతపస్సు చేయలేని వ్యక్తి కేవలం నీరు లేదా పాలు త్రాగవచ్చును. లేనిచో ఉపవాసభంగం అవుతుంది. రాత్రంతా మేల్కొనియుండి పరమపురుషుని ప్రీత్యర్థం సంగీతవాద్యములతో సంకీర్తనం చేయాలి."

"రేయి తొలిఝాములో అతడు భగవంతునికి కొబ్బరి నైవేద్యం పెట్టాలి, రెండవ ఝాములో బేల్ ఫలంను, మూడవ ఝాములో నారింజపండును, చివరి ఝాములో పోకచెక్కను నైవేద్యం పెట్టాలి. తొలిఝాములో మేల్కొనుట వలన భక్తునకు అగ్నిష్టోమం చేసిన ఫలం కలుగుతుంది. రెండవ జాములో మేల్కొనుట వలన వాజపేయ యజ్ఞం చేసిన ఫలితం కల్గుతుంది. మూడవ ఝాములో మేల్కొనుట వలన అశ్వమేధయజ్ఞం చేసిన ఫలితం కల్గుతుంది. ఇక పూర్తి రాత్రి మేల్కొనియుండు వానికి ఈ ఫలితములే గాక రాజసూయ యజ్ఞం చేసిన ఫలితం కూడ లభిస్తుంది. కనుక ఈ పద్మినీ ఏకాదశికి మించిన ఉపవాసం లేదు. ఈ ఏకాదశిని పాటించినవాడు సకలతీర్థాలలో స్నానం చేసిన ఫలితాన్ని పొందుతాడు".



"రాత్రంతా మేల్కొని ఉన్న తరువాత సూర్యోదయం కాగానే మనుజుడు స్నానం చేసి నన్ను అర్చించాలి. తరువాత యోగ్యుడైన బ్రాహ్మణునికి భోజనం పెట్టి కేశవమూర్తిని, సుగంధ జలకలశాన్ని అతనికి దానం చేయాలి. ఈ దానం అతనికి ప్రస్తుత జన్మలో విజయం, తరువాత మోక్షం తప్పక కలుగతాయి. ఓ ధర్మరాజా! నీవు అడిగినట్లుగా పద్మిని ఏకాదశి యొక్క విధివిధానములను, దానిని పాటించడం వలన కలిగే లాభాలను వివరించాను. ఈ ఒక్క ఏకాదశిని పాటించినచో ఇతర అన్ని ఏకాదశులను పాటించిన సమాన ఫలితం కల్గుతుంది. ఇక ఈ పవిత్రరోజును గురించిన ఒక అద్భుతమైన చరిత్ర వివరిస్తాను వినుము. పులస్త్యముని ఒకమారు దీనిని నారదునికి వినిపించెను".

"పులస్త్యముని ఒకమారు కార్తవీర్యార్జునుని కారాగృహం నుండి రావణుని విడిపించెనని వినిన నారదుడు అతనితో "మునివర్యా! ఇంద్రాది దేవతలనే జయించిన రావణుని కార్తవీర్యార్జునుడు ఏ విధంగా జయించెను? అని ప్రశ్నించెను".

దానికి సమాధానంగా పులస్త్యముని ఇట్లు పలికెను. "త్రేతాయుగంలో కార్తవీర్యుడు (కార్తవీర్యార్జునుని జనకుడు) హైహయ వంశంలో జన్మించాడు. అతని నగరం మహిష్మతి. అతనికి వెయ్యిమంది రాణులు. కాని వారిలో ఎవ్వరికీ సంతానం కలగలేదు. సంతానంకోసం రాజు ఎన్నో యజ్ఞాలు చేసాడు; దేవతలను, పితృదేవతలను ఎందరినో పూజించాడు. కాని ఏ మునిశాపం చేతనో రాజుకు పుత్రసంతానమే కలుగలేదు. అందువలన అతడు తీవ్రమగు తపస్సు చేసి తన లక్ష్యాన్ని సాధించాలని అనుకున్నాడు. ఆ విధంగా అతడు కౌపీనాన్ని ధరించి, రాజ్యాన్ని మంత్రులకు అప్పజెప్పి అరణ్యానికి బయలుదేరాడు. అతని రాణులలో ఒకతె పద్మిని ఇక్ష్వాకు వంశంలో జన్మించింది. హరిశ్చంద్రుని కుమార్తెయైన ఆమె భర్త అడుగుజాడలలో నడవాలని నిర్ణయించుకొని అన్ని ఆభరణాలను తీసివేసి కట్టుబట్టలతో అతనిని అనుసరించింది".

"గంధమాదనపర్వతాన్ని చేరిన కార్తవీర్యుడు తీవ్రమగు తపోధ్యానాదులతో గదాధరుని పదివేల సంవత్సరములు అర్చించాడు. అయినప్పటికిని అతనికి పుత్రుడు కలుగలేదు. కేవలం శల్యప్రాయంగా మారిన భర్తను చూసి పద్మిని ఆలోచించినదై సతీ అనసూయ చెంతకు వెళ్ళి వినమ్రంగా ఇట్లు ప్రశ్నించింది. "అమ్మా! నా భర్త గత పదివేల సంవత్సరములుగా తపస్సు చేస్తున్నాడు. సమస్తపాపాలను, కష్టాలను తొలగించే కేశవుడు ఇంకను ఆయన యెడ ప్రసన్నుడు కాలేదు. కనుక ఏదేని ఉపవాసదీక్షను నాకు తెలిపి తద్వారా భగవంతుడు మా యెడ ప్రసన్నుడయ్యేటట్లు చేయవలసింది. అపుడు ఆతని అనుగ్రహంతో ప్రపంచచక్రవర్తి కాబోయే పుత్రుని మేము పొందగలం."

"పతివ్రతయైన పద్మిని మాటలను వినిన సతీ అనసూయ నవ్వుతూ ఇలా పలికింది. ఓ కమలాక్షీ! సంవత్సరంలో పన్నెండు నెలలు ఉంటాయి. కాని ప్రతి ముప్పదిరెండు నెలల తరువాత ఒక అధికమాసం వస్తుంది. అట్టి అధికమాసంలో వచ్చే రెండు ఏకాదశులను పద్మినీ ఏకాదశి, పరమ ఏకాదశి అని పిలుస్తారు. నీవు ఈ రెండు రోజులు ఉపవసించి రాత్రి అంతా జాగరణ చేయి. ఇది నీవు చేస్తే దేవదేవుడైన హరి నీ పట్ల ప్రసన్నుడై ఒక పుత్రుని ప్రసాదిస్తాడు". అది వినిన పద్మిని శ్రద్ధతో అనసూయ ఉపదేశాన్ని పాటించింది. నిర్జలోపవాసం చేసిన పద్మినినృత్యకీర్తనలతో రాత్రంతా గడిపింది. ఆమె భక్తికి ప్రసన్నుడైన కేశవుడు ఎదుటనే గరుడవాహనారూఢుడై వచ్చి ఆమెతో "సాధ్వీ! అధికమాసంలోని ఈ ప్రత్యేక ఏకాదశి రోజు ఉపవసించి నీవు నన్ను ప్రసన్నుని చేశావు. నీవు కోరిన వరం అడుగుము" అని అన్నాడు.

"భగవంతుని అద్భుతమగు వాక్కులను వినిన పద్మిని ఆతనిని స్తుతించి తన భర్త కోరికను తీర్చమని అడిగింది. అది వినిన దేవదేవుడు వారి కోరిక సిద్ధిస్తుందని దీవించాడు".

తరువాత లోకార్తిహరుడగు భగవానుడు కార్తవీర్యునితో "రాజా! నీ పత్ని నన్ను మిగుల ప్రసన్నుని జేసింది కనుక నీ అభీష్టాన్ని అడుగు. నేను



దానిని తీరుస్తాను" అని అన్నాడు. దానికి సమాధానంగా రాజు "ఓ జగదీశ్వరా! మధుసూదనా! దేవతలతో గాని, మానవులతో గాని, పన్నగులతో గాని, దానవులతో గాని జయింపబడని పుత్రుని నా కొసగుము. కేవలం నీ చేతనే అతడు పరాజితుడు కావచ్చును" అని అన్నాడు. తథాస్తు అని పలికి భగవానుడు అంతర్ధానం చెందాడు.

సంతోషించిన రాజు తన భార్య పద్మినితో కలిసి పురానికి తిరిగి వచ్చాడు. ఆ తరువాత పద్మిని గర్భవతియై మహావీరుడైన కార్తవీర్యార్జునునికి జన్మనిచ్చింది. ముల్లోకములలో అతడు పరమ శక్తిశాలి అయ్యాడు. పదితలల రావణుడే అతనిని యుద్ధంలో జయించలేకపోయాడు. తల్లి చేసిన పద్మినీ ఏకాదశి వ్రతపాలన వలన అతడు రావణునే జయింపగలిగాడు. అతడు భగవంతుని వరదానం వంటివాడు. ఈ విధంగా నారదునికి వివరించి పులస్త్యముని వెడలిపోయాడు.

శ్రీకృష్ణభగవానుడు ధర్మరాజుతో పలుకుతూ "ఓ ధర్మనందనా! నీవు అడిగిన విధంగా ఈ ప్రత్యేక ఏకాదశి శక్తిని గురించి నీకు వివరించాను. ఎవరైతే ఈ ఏకాదశి ఉపవాసాన్ని చేస్తారో వారు తప్పక నా ధామాన్ని పొందుతారు. నీ కోరికలు తీరాలంటే నీవు కూడ ఈ విధంగానే ఆచరించు" అని అన్నాడు. కేశవుని పలుకులను వినిన ధర్మరాజు మిక్కిలి సంతోషించి సమయం రాగానే పద్మినీ ఏకాదశిని ఆచరించాడు.

ఈ విశేష ఏకాదశి వివరణను ముగిస్తూ సూతముని శౌనకునితో "ఓ శౌనకా! ఈ విశేషమైన ఏకాదశిని గురించి అంతా నీకు వివరించాను. అధికమాసంలో వచ్చే ఏకాదశులను భక్తిశ్రద్ధలతో పాటించే వాడు భగవద్ధామానికి చేరుతాడు.

ఈ ఏకాదశుల గురించి వినినా, చదివినా మనుజుడు అనంత లాభాన్ని పొంది చివరకు శ్రీహరిధామానికి చేరుతాడు" అని పలికాడు.

* * *

## 26. పరమ ఏకాదశి

**- అధికమాసం శుక్లపక్షం**

అధికమాసం కృష్ణపక్షంలో వచ్చే పరమ ఏకాదశి మహిమను శ్రీకృష్ణ యుధిష్ఠిరసంవాదరూపంలో వర్ణించబడినది.

"ఓ దేవదేవా! అధికమాసంలో కృష్ణపక్షమునందు వచ్చెడి ఏకాదశి పేరేమిటి? ఓ జగత్పతీ! దానిని చక్కగా పాటించెడి విధానమేమిటి? ఇది నాకు వివరించవలసినది" అని ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగాడు. దానికి శ్రీకృష్ణభగవానుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు.

"ఓ ధర్మరాజా! ఆ పుణ్యదినం పేరు పరమ ఏకాదశి. అది పరమసుఖమయమైనట్టి జీవితాన్ని అనుగ్రహించి చివరకు జన్మమృత్యువుల నుండి మోక్షాన్ని కల్గిస్తుంది. నేను అంతకుముందు వివరించిన విధంగానే ఈ ఏకాదశిని కూడా పాటించాలి. అనగా ఈ ఏకాదశి రోజున పురుషోత్తముడనగు నన్ను భక్తిశ్రద్ధలతో పూజించాలి. కంపిల్య నగరంలో మహామునుల నుండి నేను వినినట్టి ఒక అద్భుతమైన చరితాన్ని ఈ సందర్భంలో చెప్పెదను. సావధానుడవై విను."

ఒకప్పుడు కాంపిల్య నగరంలో సుమేధుడనే పుణ్యబ్రాహ్మణుడు తన భార్య పవిత్రతో కలిసి నివసించేవాడు. ఆమె పరమసాధ్వి, భర్తకు విధేయురాలు. పూర్వజన్మపాపం వలన సుమేధుని చెంత ధనంగాని, ఆహారంగాని లేదు. పలువురిని అన్నం అడిగినప్పటికిని తగినంత ఆహారం అతనికి లభించ లేదు. భార్యాభర్తలిద్దరికి చాలీచాలనంత అన్నవస్త్రాదులు, ఇల్లు ఉండేవి. ఇంతటి దారిద్ర్యం ఉన్నప్పటికిని ఉత్తమ ప్రవర్తన కల్గిన పవిత్ర తన భర్తను చక్కగా సేవించేది. ఇంటికి అతిథులు వచ్చినపుడు ఆమె తన వంతు ఆహారాన్ని వారికి ఇచ్చి తాను పస్తులుండేది. అయినా కూడ



ఆమె ముఖకమలము ఎన్నడూ వాడలేదు. ఈ ఉపవాసాలతో ఆమె నీరసించనప్పటికిని సుమేధుని పట్ల ఆమె అనురాగం చెక్కుచెదరలేదు.

ఇదంతా చూసి తన దురదృష్టానికి మిగుల వగచిన సుమేధుడు ఒక రోజు భార్యతో "పవిత్రా! ధనవంతులను భిక్షమడిగినను అల్పంగానే నాకు భిక్ష దొరకుతున్నది. నేను ఏమి చేయాలి? ఈ దుఃఖము తీరే మార్గమేమిటి? తగినంత ధనం లేనప్పుడు కుటుంబం సరిగా జరుగదు కదా! కాబట్టి దూరప్రాంతాలకు వెళ్ళి నేను ధనాన్ని సంపాదిస్తాను. నేను ఈ ప్రయత్నం చేస్తే తప్పక అదృష్టం కల్గుతుంది. ప్రయత్నం లేకుండ మనిషి తన కోరికలను గాని, అవసరాలను గాని తీర్చకొనలేడు అంతవరకు నీవు మీ పుట్టింటికి వెళ్లి ఉండు" అని పలికాడు. భర్త మాటలను వినిన పవిత్ర చేతులను జోడించి అశ్రపూర్ణనయనాలతో అభిమానపూర్వకంగా ఇలా పలికింది. "ఓ బ్రాహ్మణోత్తమా! ఇపుడు మనం దరిద్రులుగా ఉన్నామంటే పూర్వజన్మలో నేనుగాని, మీరుగాని యోగ్యులకు దానమివ్వకుండ ఉండి ఉండవచ్చును. భర్త లేనప్పుడు భార్యను తండ్రిగాని, తల్లిగాని, సోదరుడుగాని, మామగారుగాని ఆదరించరు. అందరు నన్ను తీవ్రంగా విమర్శిస్తారు. కనుక ఉన్నచోటనే ఉండి ఉన్నదానితో సంతృప్తిగా ఉందాం. విధిప్రకారం కాలంలో మనకు రావలసింది వచ్చి మనం సుఖంగా ఉండగలం." భార్య మాటలను వినిన సుమేధుడు ఉన్న ఊరిలోనే ఉండడానికి నిశ్చయించుకున్నాడు. ఒకరోజు కౌండిన్యముని వారి ఇంటికి వచ్చాడు. ఆయనను చూడగానే సుమేధుడు, అతని భార్య లేచి నిలబడి ఆహ్వానించి వందనం చేశారు. "ఓ మునివర్యా! ఈ రోజు మీ దర్శనం చేత మేము ధన్యులమయ్యాం. మా జన్మ తరించింది" అని సుమేధుడు ఆయనతో పలికాడు.

ఆ రీతిగా భార్యాభర్త లిద్దరు కౌండిన్యమునికి అనేక ఉపచారాలు చేశారు. తరువాత సుమేధుని భార్య పవిత్ర మునితో ఇలా పలికింది. "ఓ

బ్రాహ్మణోత్తమా! దారిద్ర్యం వలన కలిగినట్టి ఈ దుఃఖంనుండి మేమెట్లు ముక్తులము కాగలమో చెప్పవలసింది. మా దురదృష్టం అంతమయ్యే విధంగా ఏ తీర్థయాత్రనో, ఉపవాసమో, తపస్సునో మాకు తెలియజేయుడు" అని పలికింది. "వినమ్రంగా ఆమె పలికిన మాటలను వినిన కౌండన్యముని క్షణకాలం ఆలోచించి పిదప ఆమెతో దేవదేవుడైన శ్రీహరికి ప్రియమైన ఉపవాసం ఒకటున్నది. ఆ రోజు చేసెడి ఉపవాసం అన్ని పాపాలను నశింపజేసి దారిద్ర్య దుఃఖాన్ని తొలగిస్తుంది. అధికమాసంలో కృష్ణపక్షంలో వచ్చే ఆ రోజు పరమఏకాదశి అని పిలువబడుతుంది. అది విష్ణువుకు అతి ముఖ్యమైన రోజు. ఈ అధికమాస ఏకాదశి ధనధాన్యాది సమస్తావసరాలను అనుగ్రహిస్తుంది. చివరకు మోక్షాన్ని కూడ ఇస్తుంది. ఆ రోజు సాయంత్రం హరినామసంకీర్తనం చేసి ఆనందంతో నృత్యం చేయాలి. ఆ విధంగా రాత్రి మొత్తం గడపాలి. కుబేరుడు ఒకమారు ఈ ఉపవాసవ్రతాన్ని చేశాడు. అతడు ఎంత నిష్ఠగా ఈ వ్రతాన్ని చేశాడో గమనించిన శివుడు అతనిని దేవతల కోశాధికారిగా మార్చాడు. అలాగే భార్యాపుత్రులను అమ్మేసిన తరువాత హరిశ్చంద్రుడు ఈ ఏకాదశీవ్రతాన్ని పాటించి, తద్వారా తన వారిని తిరిగి పొందాడు. ఈ తరువాత అతడు ఎటువంటి అడ్డంకులు లేకుండ రాజ్యపాలనం చేయగలిగాడు. కనుక ఓ సాధ్వీ! నియమ నిబంధనలతో నీవు ఈ పవిత్రమైన ఏకాదశిని పాటించు" అని పలికాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజుతో "ఓ పాండునందనా! కౌండిన్యముని ఈ ప్రకారం కరుణతోను, అనుగ్రహంతోను పరమ ఏకాదశిని గురించి పవిత్రకు బోధించాడు. తరువాత అతడు సుమేధునితో ఈ పరమ ఏకాదశి నుండి మీరు నియమనిబంధనలతో ఉపవాసదీక్షను చేపట్టండి. తెల్లవారుజామున్నే స్నానం చేసి మీ దంపతులిరువురు, మీమీ తల్లిదండ్రులతో పాటు మీ శక్త్యనుసారం ఐదురోజులు ఉపవాసం చేయండి. ఈ జగత్తులో ఉన్నంతవరకు



సరిపడెడి ధనధాన్యాదులను పొందండి. భగవద్ధామం మీకు తదనంతరం లభించగలదు" అని పలికాడు.

"ఈ మహోన్నత ఉపదేశాన్ని వినిన బ్రాహ్మణ దంపతులు యథావిధిగా పరమ ఏకాదశిని పాటించి ఉపవాసాన్ని నిర్వహించారు. తదనంతరం ఒక అందమైన రాకుమారుడు రాజమహలు నుండి వారి చెంతకు వచ్చాడు. బ్రహ్మదేవుని ఆజ్ఞపై అతడు వారికి దివ్యమైన భవంతిని ఒసగి దానిలో నివసించమని వారిని కోరాడు. వారి జీవిక కొరకు ఒక ఊరినే వారికి కానుకగా ఇచ్చి తన పురానికి వెడలిపోయాడు. ఆ విధంగా సుమేధ పవిత్రలు ఇహలోకసౌఖ్యాలను అనుభవించి చివరికి విష్ణులోకానికి చేరుకున్నారు".

"ఈ పరమ ఏకాదశి రోజు ఉపవాసం ఉన్నవారు, సమస్త పాపాలనుండి బయటపడతారు. వారు ఇహలోక సౌఖ్యాలను అనుభవించిన తరువాత విష్ణుపదాన్ని పొందుతారు. సుమేధుడు పవిత్రలు ఆ విధంగానే పొందారు. ఓ ధర్మరాజా! పరమ ఏకాదశిరోజు ఉపవాసం చేయడం వలన కలిగే ఫలితాలను గణించుట అసాధ్యం. పుష్కర గంగాస్నానాలతో, గోదానంతో, సమస్త ధర్మకార్యనిర్వహణంతో అది సమానం. ఈ రోజు ఉపవాసం చేసినవాడు గయలో పితృతర్పణం చేసినవాడవుతాడు. నిజానికి అతడు అన్ని ఇతర శుభదినాలలో ఉపవాసం చేసినట్లు అవుతుంది".

"నాల్గు వర్ణములలో బ్రాహ్మణుడు ఉత్తముడు అయినట్లు, చతుష్పాద జంతువులలో గోవు ఉత్తమము అయినట్లు, దేవతలలో ఇంద్రుడు శ్రేష్ఠుడు అయినట్లు, మాసములలో అధికమాసం శ్రేష్ఠమైనది. ఈ అధికమాసంలో పంచరాత్రిక విధానంలో ఐదురోజుల ఉపవాసం సమస్తమగు పాపములను నశింపజేస్తుంది. అధికమాసంలో వచ్చే పరమ, పద్మిని ఏకాదశులతో పాటు ఈ పంచరాత్రిక ఉపవాసాన్ని చేసినచో పాపవినాశనం జరుగుతుంది. మనిషి

ఈ అన్ని రోజులలో ఉపవాసం చేయలేకపోతే అధికమాసంలో తన శక్త్యనుసారం ఉపవాసం చేయవచ్చును. మానవజన్మను బడసి కూడ చక్కగా స్నానం చేసి అధికమాసంలోని ఏకాదశి ఉపవాసం పాటించనివాడు ఎనుబదినాలుగు లక్షల జీవరాశులలో దుఃఖాలను అనుభవిస్తాడు. మానవజన్మ మోక్షసాధనకే కనుక ప్రతిఒక్కరు ఈ పరమ ఏకాదశిని పాటించాలి". ధర్మరాజా! పరమ ఏకాదశిరోజు ఉపవసించడం వలన కల్గే అద్భుతమైన ఫలితాలను నీవడిగిన విధంగా వివరించాను. అధికమాసంలోని కృష్ణపక్షంలో వచ్చెడి ఈ ఏకాదశిని నీవు తప్పక పాటించాలి" అని పలికి శ్రీకృష్ణభగవానుడు ముగించాడు.

శ్రీకృష్ణుడు ఉపదేశించిన విధంగా ధర్మరాజు తన పత్ని ద్రౌపదితో, సోదరులతో కూడి పరమ ఏకాదశిని పాటించాడు.

* * *